www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

సంక్రాంతి శుభాకాంక్షలు



మంగళవారం | 14-1-2025 | పేజీలు: 8+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 14 | ఖమ్మం సిటీ

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు ఉ. 10.17 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.6.20-7.57; దుర్ముహూర్తం: ఉ.9.04-9.49, రా.10.11-11.01; అమృతఘడియలు: ఉ.7.55-9.29, తె.4.01-5.37; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.56

Khammam | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

IIT, NIT, MEDICALలలో సక్సెస్‌రేట్ **25%**

# బోధనలో స్టేట్‌లెవల్.. నెగ్గడంలో నేషనల్ లెవల్
# న్యూవిజన్ అంటే నెక్ట్స్ లెవల్

## 2024లో IIT, NITల్లో సీట్లు సాధించిన మా విద్యార్థులు

| Name | Institute | Branch |
|---|---|---|
| D.MURALI KRISHNA | IISC BANGALORE | MATHS & COMPUTING |
| V.RISHITH PAWAR | IIT MADRAS | EE |
| B.PREETHI | IIT MADRAS | CHEMICAL |
| M.JETHA HARSHINI | IIT MADRAS | EE |
| B.PRABANJAN JADAV | IIT BOMBAY | CSE |
| G.MAHASWI | IIT BOMBAY | CSE |
| M.NITHISH KUMAR | IIT KHARAGPUR | CSE |
| G.SRI RAM | IIT KHARAGPUR | ECE |
| P.REVANTH | IIT KHARAGPUR | ECE |
| K.VARSHITH | IIT KHARAGPUR | CSE |
| M.NAMITHA | IIT HYDERABAD | MATHS INTEGRATED |
| V.MURAHARISH | IIT HYDERABAD | CHEMICAL |
| MD. RIDA SAMRIN | IIT INDORE | CSE |
| K.TAGORE CHANDRA | IIT INDORE | MECHANICAL |
| A.SATHVIK | IIT INDORE | SPACE SCIENCE |
| B.HANISH RAM | IIT DHANBAD | EEE |
| T.PRASOON | IIT DHANBAD | EE |
| B.CHETAN | IIT DHANBAD | ENVIRONMENT ENGG. |
| U.PRASANNA | IIT DHANBAD | ECE |
| B.SHANKAR | IIT BHUBANESWAR | MECHANICAL |
| B.SAILEKHA | IIT BHUBANESWAR | CSE |
| D.PRANATHI MOHAN | IIT GANDHI NAGAR | MECHANICAL |
| G.LOKESH | IIT PATNA | CSE |
| K.POOJITH | IIT PATNA | ECONOMICS |
| B BHANU SHANKAR | IIT MANDI | MECHANICAL |
| G.SUJITH KUMAR | IIT GUWAHATI | ECE |
| B.NAVANITHA | IIT GUWAHATI | CHEMICAL |
| S.ESHWAR VARDHAN | IIT TIRUPATI | EEE |
| V.HAMSIKA CHANDANA | IIT BHILAI | ECE |
| S.PAVAN | IIT JAMMU | MECHANICAL |
| R.PRANESH | IIT VARANASI | MECHANICAL |
| A.RAJA | NIT DELHI | CSE |
| P.DIVYA SREE | NIT ROURKELA | ECE |
| K.AKSHAY KUMAR | NIT BHOPAL | CSE |
| CH. SATHVIK | NIT SURATHKAL | ECE |
| M.PAWAN KUMAR | NIT WARANGAL | EEE |
| D.JASWANTH | NIT WARANGAL | PHYSICS INTEGRATED |
| P.SUSHMITHA | NIT WARANGAL | ECE |
| J.SATHWIK | NIT JAIPUR | CHEMICAL |
| P.GOVARDHAN SAI | NIT WARANGAL | EEE |
| K.LAKSHMI PRANATHI | VNIT NAGPUR | CSE |
| M.PRINCE KARTHIK | NIT NAGPUR | ECE |
| B.PREM KUMAR | NIT NAGPUR | MECHANICAL |
| P.MOKSHITH CHOWHAN | NIT NAGPUR | MINING |
| V.DIVYA SREE | NIT CALICUT | MECHANICAL |
| S.SAI ANIRUDH REDDY | NIT DURGAPUR | ECE |
| CH.BHUVANA | NIT DURGAPUR | MATHS & COMPUTING |
| Y.SUMANTH | NIT ALLAHABAD | CSE |
| G.VATHSALYASEN | NIT SILCHAR | ECE |
| M.HARI SATHVIK | NIT SILCHAR | ECE |
| B.SIDDHARTHA | NIT SRI NAGAR | EEE |
| B.POOJITHA VIHARI | NIT AGARTALA | MECHANICAL |
| B.PRINCE DANIEL | NIT BHOPAL | CSE |
| N.V. SAI ABHIRAM | NIT RAIPUR | IT |
| N. Srinith | NIT SURAT | CSE |
| B.UDAYKANTH | NIT KURUKSHETRA | FOOD TECHNOLOGY |
| S.RUSHIDHAR REDDY | NIT TRICHY | CSE |
| M.AASHISH | NIT PUNJAB | CSE |
| S.YASHWANTH | NIT SIKKIM | CSE |
| A.GREESHMITHA | NIT TP GUDEM | CSE |
| T.SAI KIRAN | NIT TP GUDEM | ECE |
| B.YUVAN SRISHANTH | MIT KOTA | CHEMICAL |
| M.KETHAN KUMAR | IIIT GUWAHATI | ECE |
| K.SRI CHARAN REDDY | IIIT JABALPUR | CSE |
| D.AMULYA | IIIT JABALPUR | CSE |
| K.RAKHI | IIIT KANCHEEPURAM | SM |
| CH.REVANTH | IIIT KANCHEEPURAM | CSE |
| J.KHHOMAL | IIIT KANCHEEPURAM | ECE |
| M.ROSHAN KARTHIK | IIIT SRI CITY-AP | CSE |
| T.MANOJ | IIIT SRI CITY-AP | CSE |
| B.DILEEP | IIIT SRI CITY-AP | CSE |
| K.DEVA RESHANTH | IIIT LUCKNOW | CSE |
| B.LATHIKA | IIIT KOTTAYAM | CSE |
| M.HEMANTH SAI KRISHNA | IIIT KOTTAYAM | CSE |
| G.PRASHANTH | IIIT RANCHI | CSE |
| J.VIGNESH | IIIT MANIPUR | EEE |
| T.VARUN | IIIT KURNOOL | CSE |
| D.PRADEEP | IIIT KURNOOL | ECE |
| K.MANOGNA | IIIT JABALPUR | CSE |
| B.DURGA SRI | CENTRAL UNIVERSITY JAMMU&KASHMIR | CSE |
| B.HARI CHANDANA | ISM DHANBAD | MECHANICAL |
| G.ESHWAR NAIK | IIIT GUJARAT | CSE |

## 2024లో MEDICAL సీట్లు సాధించిన మా విద్యార్థులు

| Name | College | Course |
|---|---|---|
| M.NIHARIKA | GANDHI MEDICAL COLLEGE HYDERABAD | MBBS |
| B.HARSHITH | ESIC MEDICAL COLLEGE HYDERABAD | MBBS |
| B.MANIDEEP | MAHESWARA MEDICAL COLLEGE SANGAREDDY | MBBS |
| MD ABRAR AHSAN | AYAN MEDICAL COLLEGE HYDERABAD | MBBS |
| A.AISHWARYA | MALLAREDDY MEDICAL COLLEGE HYDERABAD | MBBS |
| A.ARUN | MAMATH MEDICAL COLLEGE HYDERABAD | MBBS |
| Y.SAI PRASHANTHI | GOVT. MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| CH.SRIVARUN | MAMATHA MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| V.VAMSI KRISHNA | GOVT. MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| T.MANO TEJA | GOVT. MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| D.CHINMAYI | MAMATHA MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| B.POOJITHA | MAMATHA MEDICAL COLLEGE KHAMMAM | MBBS |
| SHAIK MALIHA TAKHDIS | GOVT. MEDICAL COLLEGE KOTHAGUDEM | MBBS |
| Y.JYOTHI | GOVT. MEDICAL COLLEGE KOTHAGUDEM | MBBS |
| P.MADHAVI | GOVT. MEDICAL COLLEGE MAHABUBABAD | MBBS |
| L.ASHWINI | GOVT. MEDICAL COLLEGE MULUGU | MBBS |
| B.GANESH | GOVT. MEDICAL COLLEGE SANGAREDDY | MBBS |
| V.JAGRUTHI PAWAR | GOVT. MEDICAL COLLEGE SANGAREDDY | MBBS |
| L.KARTHIK | SURABHI MEDICAL COLLEGE SIDDIPET | MBBS |
| P.POOJITHA SREE | COLOMBO MEDICAL COLLEGE WARANGAL | MBBS |
| K.POOJITHA | PRATHIMA MEDICAL COLLEGE WARANGAL | MBBS |

ఎందరిలో ఎందరికి డాక్టర్ సీట్లు ?
నీట్‌కి కోచింగ్ తీసుకున్నవారిలో డాక్టర్ సీట్లు సాధించినవారు **62%**

NIT IIIT 31 | IIT 31 | MEDICAL 21

Secured Seats in 2024

మా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

సంక్రాంతి శుభాకాంక్షలు

Nurturing Tomorrow's Citizens

# NEW VISION JUNIOR COLLEGE

KHAMMAM, Ph: 7997232233, 7997432233, 9640920394

PADMAJA ADS KMM - 8008288830

# మార్కెట్లలో చమురు మంటలు

అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలు పెరుగుదల ప్రపంచ మార్కెట్లలో కల్లోలం సృష్టిస్తోంది. అమెరికా, యూరప్, ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లోనే ట్రేడ్ కావడంతో ఆ ప్రభావం దేశీయ ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లపై ప్రసరించింది. వరుసగా నాలుగో రోజు కూడా ఈక్విటీ మార్కెట్ భారీ నష్టాలు నమోదు చేయగా డాలర్ మారకంలో రూపాయి విలువ రెండేళ్ల కాలంలో కనివిని ఎరుగని రీతిలో 66 పైసలు పడిపోయింది.



## 4 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు ఫట్

**ఒక్కరోజే రూ.12.61 లక్షల కోట్లు ఆవిరి**

**సెన్సెక్స్ మరో 1,049 పాయింట్లు డౌన్**

ముంబై: దలాల్‌స్ట్రీట్ మళ్లీ బేర్‌మంటోంది. ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో రోజు కూడా నష్టపోయాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 1,048.90 పాయింట్లు క్షీణించి 76,330.01 వద్దకు జారుకుంది. దాంతో సూచీ 77,000 కీలక స్థాయిని కూడా కోల్పోయింది. నిఫ్టీ 345.55 పాయింట్లు పతనమై 23,085.95 వద్ద ముగిసింది. అమ్మకాల హోరులో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.12.61 లక్షల కోట్లు తగ్గింది. గడిచిన నాలుగు సెషన్లలో ఇది రూ.24.69 లక్షల కోట్లు తగ్గి రూ.417.06 లక్షల కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,869.1 పాయింట్లు కోల్పోయింది.

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో నాలుగు మినహా అన్నీ నష్టపోయాయి. జొమాటో షేరు 6.52 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్ 4 శాతానికి పైగా పతనమవగా.. టాటాస్టీల్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్ 3 శాతానికి పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి.

● చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో అమ్మకాల ఒత్తిడి తీవ్రతరమైంది. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 4.17 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 4.14 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీలన్నీ నెగిటివ్‌గానే ముగిశాయి. రియల్టీ అత్యధికంగా 6.59 శాతం పతనమవగా.. యుటిలిటీస్, సర్వీసెస్, పవర్, ఇండస్ట్రియల్స్, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ సూచీలు 4 శాతానికి పైగా నష్టపోయాయి.

● గత శుక్రవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.2,254.68 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రూ.22,194 కోట్ల పెట్టుబడులను నికరంగా వెనక్కి తీసుకున్నారు.

**పతనానికి కారణాలివే..**

డిసెంబరులో అమెరికాలో ఉద్యోగాల కల్పన బలంగా పుంజుకోవడంతో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీరేట్లను గతంలో అంచనా వేసిన స్థాయిలో తగ్గించకపోవచ్చన్న ఆందోళనలతో యూఎస్ సహా ప్రపంచ మార్కెట్లలో ఈక్విటీల అమ్మకాలు పోటెత్తాయి. ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకుతుండటం, రూపాయి భారీ క్షీణత, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి.

**స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్‌కు 17% లిస్టింగ్ లాభం**

ప్రతికూలతలో సైతం సోమవారం లిస్టయిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ మాత్రం ఇన్వెస్టర్లకు రెండంకెల లాభాలు పంచింది. ఐపీఓ ధర రూ.140తో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు 16.67 శాతం లాభంతో రూ.163.35 వద్ద ముగిసింది. ఈ ఇష్యూ 182.57 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది.

## రూపాయి ధమాల్

**ఒక్కరోజే 66 పైసలు డౌన్**

**రెండేళ్లలో ఇదే అతిపెద్ద పతనం**

భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికన్ డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఏకంగా 66 పైసలు క్షీణించి రూ.86.70 వద్ద ముగిసింది. దాదాపు రెండేళ్లలో రూపాయికిదే అతిపెద్ద క్షీణత. డాలర్ క్రమంగా బలపడుతుండటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు వేగంగా పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు వెల్లడించాయి. ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను తరలిస్తుండటం కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది. గత శుక్రవారం డాలర్-రూపాయి మారకం విలువ 18 పైసల నష్టంతో రూ.86.04 వద్ద ముగిసింది. దాంతో పోలిస్తే సోమవారం రూపాయి 8 పైసల నష్టంతో రూ.86.12 వద్ద ప్రారంభమైంది. వెంటనే కాస్త కుదురుకుని రూ.86.11 వద్దకు బలపడినప్పటికీ, డాలర్ల కోసం ట్రేడర్లు ఎగబడటంతో ఇంట్రాడేలో నష్టాలు భారీగా పెరిగాయి. చివరికి 66 పైసలు తగ్గి రూ.86.70 వద్ద స్థిరపడింది. 2023 ఫిబ్రవరి 6న నమోదైన 68 పైసల నష్టం తర్వాత రూపాయికిదే అతిపెద్ద పతనం. గత ఏడాది చివరినాటికి రూ.85.52గా ఉన్న మారకం విలువ.. గడిచిన రెండు వారాల్లో 118 పైసలు క్షీణించింది.

**ముందుందు మరింత క్షీణత..!**

డాలర్ దెబ్బకు రూపాయి మరింత క్షీణించవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ముందుందు మారకం విలువ రూ.86.25-86.80 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు.

**ఎగుమతిదారులకు ప్రయోజనం పరిమితమే..**

రూపాయి విలువ భారీగా క్షీణించినప్పటికీ మన ఎగుమతిదారులకు కలిగే ప్రయోజనం పరిమితమేనని విశ్లేషకులంటున్నారు. మన ఎగుమతిదారులు వస్తు తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం అధికంగా దిగుమతులపైనే ఆధారపడుతుండటం ఇందుకు కారణమన్నారు. రూపాయి పతనం కారణంగా దిగుమతి వ్యయం పెరగడంతో అంతగా ప్రయోజనం లభించడం లేదన్నారు.

### అంతా అమెరికా వల్లే..

ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తానని హెచ్చరించడంతో అంతర్జాతీయంగా దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. తాజాగా అమెరికా మార్కెట్ గత నెలలో కొత్తగా 2.56 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించగలిగింది. మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసిన 1.55 లక్షల ఉద్యోగాల కంటే ఇది చాలా అధికం. జాబ్ మార్కెట్ బలంగా పుంజుకోవడంతో అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీరేట్లను గతంలో ఆశించిన స్థాయిలో తగ్గించకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంతో డాలర్ విలువతోపాటు యూఎస్ బాండ్ల రేట్లు మరింత పెరిగాయి. ఆరు అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే, డాలర్ ఇండెక్స్ మరో 0.29 శాతం పెరిగి 109.80కి చేరింది. 10 ఏళ్ల కాలపరిమితి గల యూఎస్ బాండ్ల రేటు సైతం 0.48 శాతం పెరిగి 2023 అక్టోబరు నాటి గరిష్ఠ స్థాయి 4.79 శాతానికి ఎగబాకింది. కాగా, రష్యా ముడిచమురుపై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించడంతో బ్రెంట్ క్రూడాయిల్ రేటు 4 నెలల గరిష్ఠ స్థాయి 80 డాలర్లకు చేరింది. సోమవారం ఒకదశలో 80.74 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. దాంతో చమురు దిగుమతిదారులు పెద్ద ఎత్తున డాలర్ల కొనుగోళ్లకు పాల్పడ్డారని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గత కొన్నివారాలుగా విదేశీ మారకం నిల్వలు గణనీయంగా తగ్గుతూ వస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం కూడా రూపాయి భారీ క్షీణతకు మరొక కారణమని వారన్నారు.

## జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా రూ.2,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.2,000 కోట్ల విలువైన షేర్లను సైతం అమ్మకానికి పెట్టనున్నట్లు సెబీకి ఇప్పటికే దాఖలు చేసిన పత్రాల్లో కంపెనీ వెల్లడించింది.

● వైండింగ్ అండ్ కండక్టివిటీ ఉత్పత్తుల తయారీదారు విద్య వైర్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు సమర్పించింది. పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా కంపెనీ రూ.320 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన కోటి షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

## హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,591 కోట్లు

» ఒక్కో షేరుపై రూ.18 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ డిసెంబరు త్రైమాసికంలో రూ.29,890 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.4,591 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 5.07 శాతం, నికర లాభం 5.5 శాతం పెరిగాయి. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే మాత్రం లాభాలు 8.4 శాతం, ఆదాయం 3.56 శాతం పెరిగినట్లు కంపెనీ సీఈఓ విజయ కుమార్ చెప్పారు. ఈ ఏడాదికి ఆదాయ వృద్ధిరేటు అంచనాలను సైతం కంపెనీ 3.5-5 శాతం నుంచి 4.5-5 శాతానికి పెంచింది. డిజిటల్, ఏఐ ఆధారిత సేవలు క్యూ3లో కంపెనీ ఆదాయ, లాభాలకు దోహదం చేశాయి.

**ప్రత్యేక డివిడెండ్:** కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.18 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఇందులో రూ.6 ప్రత్యేక డివిడెండ్ అని తెలిపింది. కంపెనీ క్యూ3 ఆర్థిక ఫలితాలు బాగున్నా బీఎస్ఈలో ఈ షేరు 0.56 శాతం నష్టంతో రూ.1,985.25 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80,070 ▲ | 73,400 ▲ | 1,02,000 ▲ |
| విజయవాడ | 81,000 ▲ | 76,500 ▲ | 92,500 ▼ |
| విశాఖపట్నం | 78,470 ▼ | 71,930 ▼ | 90,660 ▼ |
| రాజమండ్రి | 79,800 ▲ | 73,150 ▲ | 92,700 ▲ |
| ప్రొద్దుటూరు | 79,750 ▲ | 73,850 ▲ | 93,000 ▼ |
| ముంబై | 78,310 ▲ | 71,730 ▲ | 89,800 ▼ |

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 14వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 490 | విజయవాడ | 515 |
| వరంగల్ | 492 | గోదావరి | 515 |
| చిత్తూరు | 523 | విశాఖపట్నం | 520 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 107 | విజయవాడ | 121 |
| వరంగల్ | 107 | గుంటూరు | 120 |
| కరీంనగర్ | 107 | ఒంగోలు | 120 |
| మహబూబ్‌నగర్ | 107 | చిత్తూరు | 92 |
| కర్నూలు | 107 | నెల్లూరు | 97 |
| విశాఖపట్నం | 117 | అనంతపురం | 97 |
| గోదావరి | 121 | | |

## హైదరాబాద్‌లో గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రాజెక్టు

» రూ.1300 కోట్ల ఆదాయంపై గురి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రియల్ ఎస్టేట్ రంగంలోని గోద్రెజ్ ప్రాపర్టీస్ కంపెనీ హైదరాబాద్‌లో తొలి రెసిడెన్షియల్ ప్రాజెక్టును ప్రారంభించింది. రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సమాచారంలో కంపెనీ ఈ విషయం తెలిపింది. హైదరాబాద్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన కోకాపేట్ ప్రాంతంలో 3 ఎకరాల విస్తీర్ణంలో "గోద్రెజ్ మాడిసన్ అవెన్యూ" పేరిట చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొత్తం 12 లక్షల చదరపు అడుగుల స్థలం అమ్మకానికి ఉంటుంది. దీని బుకింగ్ విలువ రూ.1,300 కోట్లుంటుందని అంచనా వేస్తోంది. ఈ ప్రాజెక్టులో 3, 4 బెడ్‌రూమ్ ఫ్లాట్లు అందుబాటులో ఉంటాయి. మంచి వృద్ధి అవకాశాలున్న హైదరాబాద్‌లో ఇది తమ తొలి ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టు అని కంపెనీ ఎండీ, సీఈఓ గౌరవ్ పాండే తెలిపారు. మన్‌హటన్ తరహా లాండ్‌స్కేప్‌లతో ఈ ప్రాజెక్టు ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అగ్రశ్రేణి విద్యా సంస్థలు, ప్రీమియం రిటైల్, హెల్త్ కేర్ వసతులకు చక్కటి కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

## అరాజెన్‌కు రూ.860 కోట్ల నిధులు

హైదరాబాద్ (బిజినెస్ బ్యూరో): కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీలోని అరాజెన్ ప్రైవేట్ ఈక్విటీసంస్థ క్వాడ్రియా కేపిటల్ నుంచి 10 కోట్ల డాలర్ల (రూ.860 కోట్లు) నిధులు సమీకరించింది. ఇందుకుగాను అరాజెన్‌లో 140 కోట్ల డాలర్ల విలువ గల మైనారిటీ వాటాలు క్వాడ్రియాకు లభిస్తాయి. ప్రస్తుత ఇన్వెస్టర్లు తమ వాటాల్లో కొంత శాతం విక్రయించడం ద్వారా ఈ నిధులు సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. అమెరికా, యూరప్‌ల నుంచి పెరుగుతున్న ఔట్‌సోర్సింగ్ అవసరాలకు దీటుగా తమ సామర్థ్యాలు విస్తరించుకునేందుకు, మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని అరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ మన్ని కంటిపూడి అన్నారు. అరాజెన్‌లో గోల్డ్‌మన్ శాచ్ తర్వాత రెండో వ్యూహాత్మక ఇన్వెస్టర్ క్వాడ్రియా అవుతుంది.

# స్పోర్ట్స్

## రాయుడి కెరీర్‌కు విలన్.. విరాట్!


కోహ్లీ
రాయుడు

**వరల్డ్‌కప్‌లో చోటు దక్కకుండా అడ్డుకొన్నాడు**

**బాంబు పేల్చిన ఊతప్ప**

**కోహ్లీ కంటే రోహిత్ గొప్ప కెప్టెన్**



న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో ఆడాలనేది ఏ ఆటగాడికైనా జీవిత కల. తెలుగు క్రికెటర్ అంబటి రాయుడుకు ఆ అవకాశం అందినట్టే అంది చేజారింది. అయితే, 2019 వరల్డ్‌కప్ జట్టులో రాయుడుకు చోటు దక్కకపోవడానికి కోహ్లీనే కారణమని టీమిండియా మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప బాంబు పేల్చాడు. విరాట్‌కు ఎవరైనా నచ్చకపోతే.. ఇక అంతేనంటూ ఓ ఇంటర్వ్యూలో సంచలన విషయాలు బహిర్గతం చేశాడు. రాయుడు ఇంటికి జెర్సీలు, కిట్‌బ్యాగ్‌లు కూడా చేరాయని తెలిపాడు. 'కోహ్లీ ఎవరినైనా వద్దనుకొంటే ఇక వారి కెరీర్ నాశనమే. అందుకు రాయుడే ప్రత్యక్ష ఉదాహరణ. అతనికి జరిగిన దానికి సానుభూతి తెలపాలి. వరల్డ్ కప్ జెర్సీలు, కిట్ బ్యాగులు కూడా రాయుడు ఇంటికి చేరాయంటే టీమ్‌లో చోటు ఖాయమనేగా. అలాంటి సమయంలో జట్టులో చోటు లేదంటే ఏఆటగాడైనా ఎలా తట్టుకోగలడు. ఇలా మరొకరికి ఎప్పుడూ జరగకూడదు. ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడ'ని ఊతప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. 2019 వరల్డ్‌కప్ టీమ్ ఎంపిక ముందు డ్రామా చోటు చేసుకొంది. రాయుడుకి జట్టులో చోటు ఖాయమని అందరూ భావిస్తుండగా.. హఠాత్తుగా విజయ్ శంకర్‌ను టీమ్‌లోకి తీసుకొన్నారు. దీనిపై అంబటి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే, రాయుడుకి టీమ్‌లో స్థానం లభించకపోవడానికి అప్పటి చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కారణమన్న విమర్శలు కూడా వచ్చాయి. కానీ, అసలు విలన్ కోహ్లీ అని ఊతప్ప ఇప్పుడు బయటపెట్టాడు. అప్పట్లో ఎమ్మెస్కే కూడా ఈ విషయమై మాట్లాడాడు. జట్టు ఎంపికలో తానొక్కడినే ఉండనని, మిగతా సెలెక్టర్లతోపాటు జట్టు కెప్టెన్ కూడా తన అభిప్రాయాన్ని చెబుతాడని ప్రసాద్ వెల్లడించాడు.

కెప్టెన్సీ విషయంలో కోహ్లీకి, రోహిత్ శర్మకు మధ్య తేడాని కూడా విడమర్చి చెప్పాడు. 2024 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు పక్కా అని అనుకున్నారు. కానీ, టాస్‌కు 10 నిమిషాల ముందు శివమ్ దూబేను జట్టులోకి తీసుకొన్నారు. ఆ సమయంలో శాంసన్‌తో రోహిత్ మాట్లాడిన విధానం తనకు నచ్చిందని రాబిన్ చెప్పాడు. ఇద్దరి సారథ్యాల్లో తేడా ఇదేనని స్పష్టం చేశాడు. అందుకే తాను రోహిత్‌ను గొప్ప నాయకుడిగా భావిస్తానని చెప్పాడు.

**చాపెల్‌కు సీనియర్లతో ఎప్పుడూ గొడవలే..:** కోచ్‌గా గ్రెగ్ చాపెల్ హయాంలో జట్టులో ఎప్పుడూ అలజడి వాతావరణం నెలకొని ఉండేదని ఊతప్ప తెలిపాడు. 'భారత ఆటగాళ్లలో ఫిట్‌నెస్ లోపాన్ని చాపెల్ గుర్తించాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్ల మాదిరిగా జట్టు ఫిట్‌నెస్‌ను పెంచాలనుకొన్నాడు. కానీ, జట్టులోని కొందరు సీనియర్లకు ఆ విషయాన్ని సమర్థంగా చెప్పలేక పోవడం గొడవలకు దారి తీసింది. పైగా, తను అనుకొన్నట్టు సాగకపోతే.. డ్రెస్సింగ్ రూమ్ విషయాలను కూడా చాపెల్ లీక్ చేసేవాడ'ని రాబిన్ తెలిపాడు. కాగా యువరాజ్ కెరీర్ ముగియడానికి కూడా కోహ్లీనే కారణమని రెండు రోజుల క్రితం ఊతప్ప చెప్పిన సంగతి విదితమే. క్యాన్సర్‌నుంచి బయటపడిన యువరాజ్‌ను ఫిట్‌నెస్ విషయంలో కోహ్లీ ఇబ్బందిపెట్టేవాడని, తనతో సమానంగా అందరూ ఫిట్‌గా ఉండాలని అనేవాడని ఊతప్ప ఆరోపించాడు.

## భారత్ బోణీ

● నేపాల్‌పై గెలుపు ● ఖో-ఖో వరల్డ్‌కప్



న్యూఢిల్లీ: ఖో-ఖో వరల్డ్‌కప్‌లో భారత్ శుభారంభం చేసింది. సోమవారం హోరాహోరీగా జరిగిన గ్రూప్-ఎ తొలి మ్యాచ్‌లో భారత్ 42-37తో నేపాల్‌పై గెలిచింది. తొలి టర్న్‌లో భారత్ 24 పాయింట్లు సాధించగా.. రెండో టర్న్‌లో నేపాల్ 20 పాయింట్లు స్కోరు చేసింది. ఇక మూడో టర్న్‌లో భారత్ 18 పాయింట్లు దక్కించుకోగా.. నాలుగో టర్న్‌లో నేపాల్ 16 పాయింట్లు మాత్రమే సాధించింది.


భారత అమ్మాయిల మార్చ్‌పాస్ట్

ఇందిరా గాంధీ స్టేడియంలో తొలి ఖో-ఖో వరల్డ్‌కప్ ఆరంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ జ్యోతి వెలిగించి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఏరియల్ డ్యాన్స్‌లు ఆకట్టుకొన్నాయి. టోర్నీలో తలపడే జట్లు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవ్య, సహాయ మంత్రి రక్షా ఖడ్సే, ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష, ఎంపీ రాజీవ్ శుక్లా, భారత ఖో-ఖో సంఘం అధ్యక్షుడు సుదాన్షు మిట్టల్, గ్రేట్ ఖలి తదితరులు పాల్గొన్నారు.


సాత్విక్ సింధు

## మళ్లీ బరిలో సింధు

**నేటినుంచి ఇండియా ఓపెన్**

**తలపడనున్న అంతర్జాతీయ స్టార్లు**

న్యూఢిల్లీ : భారత్‌పాటు చైనా, జపాన్, డెన్మార్క్, దక్షిణ కొరియా వంటి బలమైన దేశాలు..200 మందికి పైగా షట్లర్లు వారంపాటు బ్యాడ్మింటన్ అభిమానులను అలరించనున్నారు. మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భారత్ ఏకంగా 46 మందితో బరిలోకి దిగుతోంది. ఒలింపిక్ చాంపియన్లు అక్సెల్‌సెన్, అన్ సె యంగ్ కూడా తలపడుతుండడంతో టోర్నమెంట్ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆతిథ్య జట్టునుంచి పీవీ సింధుపై అందరి దృష్టీ నిలిచింది. గత ఏడాది పెద్దగా రాణించలేకపోయిన రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత సింధు ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టింది. దాంతో ఈ సీజన్ తొలి టోర్నమెంట్ మలేసియా ఓపెన్‌లో పాల్గొనలేదు. పెళ్లయ్యాక మొదటిసారి పోటీల బరిలోకి దిగుతున్న ఆమె తొలి రౌండ్‌లో యున్ సంగ్ (తైపీ)తో తలపడనుంది. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్‌పై అందరిదృష్టీ నిలవనుంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్-చున్ ఈతో, కిడాంబి శ్రీకాంత్-హాంగ్ యాంగ్‌తో టోర్నీని ఆరంభిస్తారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ-అరిసా/అయాకోను ఢీకొంటారు.

## గౌతీ ఓటు యశస్వికే!

**పంత్ కావాలంటున్న అగార్కర్**

**భవిష్యత్ కెప్టెన్ ఎంపిక వ్యవహారం**


యశస్వి



న్యూఢిల్లీ: ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్న రోహిత్ శర్మను సారథ్య బాధ్యతల నుంచి తప్పించేందుకు బీసీసీఐ సన్నద్ధమవుతోంది. అయితే, అతడి తర్వాత జట్టు పగ్గాలను ఎవరికి అప్పగించాలన్నది పెద్ద సమస్యగా మారింది. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేస్తే..అతనికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆస్ట్రేలియా పర్యటనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రోహిత్ బీసీసీఐకి తేల్చి చెప్పాడని సమాచారం. ఈ నేపథ్యంలో వన్డే ఫార్మాట్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ వరకు హిట్‌మ్యాన్‌నే సారథిగా కొనసాగించే అవకాశాలున్నాయి. కానీ, భవిష్యత్ కెప్టెన్ విషయంలోనే గందరగోళం నెలకొంది. బుమ్రాకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించడానికి బోర్డు సుముఖంగానే ఉందట. కానీ, అతడి ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకొని సమర్థుడైన వైస్ కెప్టెన్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రిషబ్ పంత్‌ను భవిష్యత్ టెస్ట్ కెప్టెన్‌గా అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ సూచిస్తుండగా.. కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం యశస్వీ జైస్వాల్‌కు మద్దతు తెలుపుతున్నాడట. దీంతో అగార్కర్, గౌతీ మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితులు నెలకొన్నాయని సమాచారం.

## ఆర్చరీ ప్రపంచకప్ జట్టులో సురేఖ, చికిత, ధీరజ్



న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ జట్టులో జ్యోతి సురేఖకు మరోసారి చోటు దక్కింది. ఏప్రిల్‌లో ఫ్లోరిడా, మేలో షాంఘైలో జరిగే స్టేజ్ 1, 2 వరల్డ్‌కప్‌ల కోసం కోల్‌కతాలో నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో సురేఖ సహా ముగ్గురు తెలుగు ఆర్చర్లు అర్హత సాధించారు. భారత మహిళల కాంపౌండ్ జట్టులో సురేఖ, పెద్దపల్లికి చెందిన తానిపర్తి చికిత.. పురుషుల రికర్వ్ విభాగంలో విజయవాడకు చెందిన ధీరజ్ బొమ్మదేవరకు స్థానాలు లభించాయి. సురేఖ 15వ ఏడాది దేశానికి ప్రాతినిథ్యం వహిస్తుండడం విశేషం.

## బసవారెడ్డి భయపెట్టాడు!


జొకోవిచ్

**చెమటోడ్చిన జొకోవిచ్**

**సిన్నర్, స్వియటెక్ సునాయాసంగా..**

**ఆస్ట్రేలియన్ ఓపెన్**


బసవారెడ్డి

మెల్‌బోర్న్ : తన ఆరాధ్య ఆటగాడు, పైగా అతడో దిగ్గజం..అలాంటి ప్రత్యర్థితో గ్రాండ్‌స్లామ్ అరంగేట్ర మ్యాచ్ అంటే ఎంతో ఉద్వేగం, ఉత్కంఠ ఉంటుంది..కానీ తెలుగు మూలాలున్న 19 ఏళ్ల అమెరికన్ నిషేష్ బసవారెడ్డి ఆ ఒత్తిడి ఛాయలను ఏమాత్రం దరి చేరనివ్వలేదు..పైగా బెరుకులేని ఆటతో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించాడు. తొలి సెట్ గెలిచి సవాలు విసిరాడు. ఫలితంగా మ్యాచ్ నాలుగు సెట్లపాటు సాగింది. దాంతో సోమవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ మొదటి రౌండ్‌ను అధిగమించేందుకు 10 సార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ పోరాడాల్సి వచ్చింది.

**ఆల్‌రౌండ్ ఆటతో..:** జొకోవిచ్‌తో బసవారెడ్డి మ్యాచ్‌ను టెన్నిస్ పండితులంతా ఏకపక్షమని తేల్చేశారు. కానీ అమెరికా కుర్రోడు ఏకంగా మూడు గంటలపాటు చూపిన తెగువ, పోరాట పటిమతో జొకో 4-6, 6-3, 6-4, 6-2తో కానీ మ్యాచ్ నెగ్గలేకపోయాడు. బలమైన సర్వీసులు, వేగవంతమైన ఏస్‌లు, తెలివైన షాట్లతో జొకోను ముప్పుతిప్పలు పెట్టిన నిషేష్ తొలి సెట్‌ను సొంతం చేసుకొని ప్రత్యర్థికి షాకిచ్చాడు. పదునైన ఆటతో రెండో సెట్ ఆరంభంలోనూ నొవాక్‌ను ఇబ్బందిపెట్టాడు. అయితే సర్వీస్ గేమ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సెర్బియా స్టార్ రెండో సెట్ నెగ్గడం ద్వారా 1-1తో స్కోరు సమం చేశాడు. మూడో సెట్‌లో బసవారెడ్డి మళ్లీ పోరాడడంతో..ఈ సెట్‌ను దక్కించుకొనేందుకు జొకో శ్రమకోర్చాల్సి వచ్చింది. కీలకమైన నాలుగో సెట్‌లో తొలుత అనవసర తప్పిదాలు, డబుల్ ఫాల్ట్‌లతో నొవాక్ తడబాటుకు లోనైనా తేరుకొని..సెట్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకొన్నాడు. గ్రాండ్‌స్లామ్ తొలి మ్యాచ్‌లో బసవారెడ్డి చూపిన ఆల్‌రౌండ్ ఆటకు ఫిదా అయిన ప్రేక్షకులు లేచి నిల్చొని చప్పట్లతో అతడికి వీడ్కోలు పలికారు. పురుషుల ఇతర మొదటి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సిన్నర్ 7-6 (2), 7-6 (5), 6-1తో జారీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-1, 7-5, 6-1తో షెవ్‌చెన్కోపై వరుస సెట్లలో గెలిచి ముందంజ వేశారు. 11వ సీడ్ సిట్సిపాస్‌కు 7-5, 6-3, 2-6, 6-4తో అమెరికాకు చెందిన అలెక్స్ మిచెల్సన్ ఝలకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో స్వియటెక్ 6-3, 6-4తో సినియకోవాని, మూడో సీడ్ గాఫ్ 6-3, 6-3తో సోఫియా కెనిన్‌ని, ఏడో సీడ్ పెగులా 6-3, 6-0తో మాయా జోయింట్‌ని, నవోమి ఒసాక 6-3, 3-6, 6-3తో గార్షియాని ఓడించి రెండో రౌండ్‌కు చేరారు.

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI





మంగళవారం | 14-1-2025 | పేజీలు: 8+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 14 | Khammam | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | ఖమ్మం సిటీ


# పెట్టుబడంటే తెలంగాణే

## అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలి

పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రానికి పేరు.. దావోస్‌లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి

పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి.. నిరుటి దావోస్ ఒప్పందాల కార్యరూపంపై సంతృప్తి



పెట్టుబడులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, వేం నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): "పెట్టుబడులంటేనే తెలంగాణ అనేలా ఉండాలి. అందుకు తగ్గట్లుగా మన ప్రణాళికలను రూపొందించాలి. పెట్టుబడులకు గమ్యస్థానంగా ఇప్పటికే దేశంలో అందరి దృష్టిని తెలంగాణ ఆకర్షిస్తోంది. విదేశీ కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉంది. దావోస్ పర్యటన సందర్భంగా.. ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 20 నుంచి దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్‌కు ఆయన వెళ్లనున్నారు. అంతకంటే ముందు సింగపూర్‌లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో.. గత ఏడాది దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాటి పురోగతిపై సోమవారం తన నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారులతో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ఏడాది దావోస్ ఒప్పందాల మేరకు ప్రాజెక్టులు ఏయే దశల్లో ఉన్నాయి? ఎన్ని ప్రారంభమయ్యాయి? అనే వివరాలను సీఎం రేవంత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తోందన్నారు. "ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులు తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా

మిగతా 5వ పేజీలో...

### విద్యుత్తు చార్జీలు యథాతథం

ప్రస్తుత చార్జీలే 2025-26లోనూ కొనసాగింపు

పెంపుపై అనుమతి కోరిన డిస్కమ్‌లు.. సర్కార్ నో

వారంలో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదన

**50 ఉద్యోగాలిస్తే.. రూ.5 లక్షల సాయం**

పునరుత్పాదక విద్యుత్తుకు పెద్ద పీట

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

5

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి శుభాకాంక్షలు.

**సెలవు**

సంక్రాంతి సందర్భంగా మా కార్యాలయాలకు మంగళవారం సెలవు. కావున బుధవారం (15-1-25) 'ఆంధ్రజ్యోతి' సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

\- మేనేజింగ్ డైరెక్టర్



kulaganana

### కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల జారీ

మార్గదర్శకాలను ఖరారు చేసిన సర్కారు

క్షేత్రస్థాయి పరిశీలన కోసం ముసాయిదా

గ్రామసభలో ప్రదర్శన తర్వాత ఆమోదం

సభ్యుల మార్పులు, చేర్పులకు అవకాశం

అర్హత కలిగిన వ్యక్తి ఒకే కార్డులో..

5

### నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులు సైతం

మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో చర్చలు

రేపు కాంగ్రెస్ కార్యాలయ ప్రారంభం



కిషన్‌రెడ్డి ఇంట సంక్రాంతి..

### మోదీ, చిరు సందడి

మెగాస్టార్‌కు ప్రధాని ప్రాధాన్యం

ఆద్యంతం చిరంజీవిని తనవెంటే తిప్పుకొన్న మోదీ

భోగి మంటలు వెలిగించి, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ



కిషన్‌రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో మహిళతో మోదీ కరచాలనం. చిత్రంలో చిరంజీవి

# కోడి పందేలు చూసొద్దాం!

సంక్రాంతికి భారీగా ఏపీకి తెలంగాణ వాసులు.. హైదరాబాద్ నుంచి 60 వేల కార్లు వెళ్లినట్లు అంచనా

నగరం నుంచి 10 లక్షల మంది పైగా ప్రయాణం.. వీరిలో గణనీయ సంఖ్యలో తెలంగాణ ప్రజలు

హైదరాబాద్/మియాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఈ సారి తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది కొత్త ట్రెండ్ మొదలైనట్లు అంచనా వేస్తున్నారు. ఏపీలో జరిగే సంక్రాంతి పండగతో పాటు కోడిపందేలు, ఇతర సంబరాలను తిలకించడానికి తెలంగాణ నుంచి.. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి భారీగా జనం తరలి వెళ్లారు. ఒక్క హైదరాబాద్ నుంచే 10 లక్షల మందికి పైగా ఉంటారని అంచనా. వీరిలో తెలంగాణ వాసులు కూడా భారీగానే ఉన్నారు. సాధారణంగా అయితే ప్రతి సంక్రాంతికి హైదరాబాద్, చుట్టుపక్కల నివసించే ఏపీ వాసులు

మిగతా 6వ పేజీలో...

### కో.. అంటే కోట్లు!

6

ఏపీలో గోదారి, పలు జిల్లాల్లో కోడిపందేల జోరు

300 కోట్ల పందేలు.. కొందరికి బుల్లెట్ల కానుకలు

లక్షలాదిగా జనం.. కత్తులు కట్టే వారికి డిమాండ్

పందెం రాయుళ్ల జోష్.. పోలీసుల కట్టడి పైపైనే!



ప్రయాగ్‌రాజ్‌లో పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు

### త్రివేణి సంగమం భక్తజన సంద్రం

2

- ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహా కుంభమేళా
- తొలిరోజు కోటిన్నర మంది భక్తుల పుణ్య స్నానాలు
- జై శ్రీరామ్, హరహర మహాదేవ.. నినాదాల హోరు

### రూ. 2 లక్షల కోట్లు!

- కుంభమేళాలో 40 కోట్లమంది 5 వేలు చొప్పున ఖర్చు
- ఆహారం, పానీయాలపై మరో రూ.20 వేల కోట్లు

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్!

హుజూరాబాద్ ఎమ్మెల్యే హైదరాబాద్‌లో అదుపులోకి

కలెక్టరేట్‌లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాడికి యత్నించారంటూ కరీంనగర్‌లో కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదులు

4 కేసులు.. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు పోలీసులు

ఎమ్మెల్యే సంజయ్ వాంగ్మూలం తీసుకున్న పోలీసులు

కౌశిక్‌పై అనర్హత వేటుకు స్పీకర్‌కు ఫిర్యాదు చేశా: సంజయ్

కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నాం: హరీశ్‌రావు

అర్ధరాత్రి కరీంనగర్‌లో హైడ్రామా.. బీఆర్ఎస్ నిరసన

హైదరాబాద్/కరీంనగర్ క్రైం/జగిత్యాల అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై ఆది, సోమవారాల్లో నాలుగు కేసులు నమోదయ్యాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రణాళిక

మిగతా 2వ పేజీలో...



## రేపటి యూజీసీ-నెట్ పరీక్ష వాయిదా

**16వ తేదీ పరీక్షలు యథాతథం.. ఎన్‌టీఏ ప్రకటన**

న్యూఢిల్లీ, జనవరి 13: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ నెల 15 (బుధవారం)న జరగాల్సిన యూజీసీ-నెట్ పరీక్షను వాయిదా వేసినట్టు సోమవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తరువాత ప్రకటిస్తామని తెలిపింది. 15న లా, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్ సహా 17 సబ్జెక్టుల్లో పరీక్షలు జరగాల్సి ఉండగా అవన్నీ వాయిదా పడ్డాయని ఎన్‌టీఏ డైరెక్టర్ (పరీక్షలు) రాజేష్ కుమార్ తెలిపారు. 16వ తేదీన జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా కొనసాగుతాయని, అందులో మార్పు లేదని ప్రకటించారు. పీహెచ్‌డీ ప్రోగ్రాంలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లు పొందడం, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించడం కోసం ఈ పరీక్షలు జరుగుతున్నాయి.

## పన్ను ఎగవేతదారుల వేటకు ఇంటర్‌పోల్ సాయం

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 13: పన్ను ఎగవేతదారుల భరతం పట్టేందుకు ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని ఆదాయపన్ను శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎక్కడున్నారు? వారి గుర్తింపు? రహస్య ఆస్తులు తదితర సమాచారాన్ని పొందడానికి ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని ప్రణాళికలు రూపొందించింది. అధికారిక నేర పరిశోధనకు ముందు వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం తదితర చర్యలను వేగవంతం చేయడమే దీని లక్ష్యం. ఇప్పటికే ఈ విషయాల్లో అంతర్జాతీయ సహకారం కోసం ఎంఎల్ఏ(మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్) ఒప్పందాలు, ఎల్ఆర్(లెటర్ రొగేటరీ)లను భారత్ వినియోగించుకుంటోంది. భారత్‌కు సుమారు 42 దేశాలతో ఎంఎల్ఏ ఒప్పందాలు ఉన్నాయి. ఎల్ఆర్‌ను ఇతర దేశాలకు పంపడం ద్వారా ఆ దేశాల సహకారం పొందుతారు. ఈ విషయంలో తాజాగా 194 సభ్యదేశాలతో ప్రపంచ అతిపెద్ద అంతర్జాతీయ పోలీసు సంస్థగా ఉన్న ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని ఐటీశాఖ నిర్ణయించింది.

## 35,170 మంది పాన్‌కార్డుదారులకు ఐటీ లేఖ

ముంబై/న్యూఢిలీ, జనవరి 13: పన్ను ఎగవేతదారులే లక్ష్యంగా ఆదాయపుపన్ను శాఖ నిరంతర డ్రైవ్ చేపట్టింది. భారీ నగదు లావాదేవీలు జరిపిన 35,170 మంది పాన్‌కార్డుదారులను సాంకేతికత ఆధారంగా గుర్తించి, వారికి తాజాగా సోమవారం లేఖలు పంపింది. వారి ఆర్థిక లావాదేవీల వివరాలను ఆ లేఖల్లో ప్రస్తావించింది. ఐటీ రిటర్న్ దాఖలు చేశారా? లేదా? అనే సమాచారం కోసం కస్టమైజ్డ్ రెస్పాన్స్ షీట్‌ను కూడా లేఖకు జత చేసింది. వారి ప్రతిస్పందనను తీసుకోవడంతోపాటు, తదనంతర చర్యలు చేపట్టేందుకు ఒక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేశామని, ఆయా వ్యక్తుల పన్ను చెల్లింపులు, రిటర్న్ ఫైలింగ్‌లను గుర్తించేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆర్థిక మంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. దీంతోపాటు నిర్దిష్ట సమాచారం ఉన్న ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేయని పాన్‌కార్డుదారులను గుర్తించేందుకు బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టును చేపట్టినట్టు తెలిపింది. కాగా, 2012-13 సంవత్సరంలో 14.62 లక్షల మంది మాత్రమే రూ.10 లక్షలకుపైగా ఆదాయం ఉన్నట్టు ప్రకటించగా, ఆ ఏడాది 33.83 లక్షల మంది తమ బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలకుపైగా డిపాజిట్లు చేసినట్టు కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా పరిశీలించిన రికార్డుల్లో వెల్లడైంది.

## జయలలిత వారసురాలి పిటిషన్ కొట్టివేత

**ఆభరణాలను తమిళనాడుకు అప్పగించాలని హైకోర్టు ఆదేశం**

బెంగళూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం, దివంగత జయలలిత ఆస్తుల కోసం ఆమె వారసురాలిగా జె.దీప దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు సోమవారం కొట్టివేసింది. పోలీసులు జప్తు చేసిన ఆభరణాలు, వస్తువులను తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీప పిటిషన్‌ను విచారించి, తీర్పునిచ్చింది. గత ఏడాది మార్చి 6న తమిళనాడు ప్రభుత్వానికి జయలలిత ఆభరణాలను అప్పగించాల్సి ఉంది. కానీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆ ఆదేశాలతో తమ హక్కులకు భంగం కలుగుతోందని జయలలిత వారసురాలు జె.దీప హైకోర్టులో పిటిషన్ వేశారు.

## త్రివేణి సంగమం

# భక్త జన సంద్రం



**ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహా కుంభమేళా**

### తొలిరోజు కోటిన్నర మంది భక్తుల పవిత్ర స్నానాలు

న్యూఢిల్లీ, జనవరి 13 : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా ప్రారంభమైంది. త్రివేణి సంగమంలో (గంగ, యమున, సరస్వతి) పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున భక్తులు తొలి స్నానాలు ఆచరించడంతో 45 రోజులు సాగే ఈ మహాపర్వానికి తెర లేచింది. వాయిద్యాల చప్పుళ్లు, భజనలతో సంగమ తీరం అలౌకిక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జై గంగామయి, జై శ్రీరామ్, హరహర మహాదేవ... అంటూ స్నానఘట్టాలు హోరెత్తుతున్నాయి. తొలి రోజు 1.5 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు చేసినట్టు అంచనా. ఈ మహా కుంభమేళాకు దాదాపు 40 కోట్లమంది భక్తులు తరలివస్తారని అంచనా. అంటే.. రష్యా, అమెరికా వంటి అగ్రదేశాల జనాభా కంటే కూడా అధికంగానే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు.

**ఏకంగా 'నగరాన్నే' నిర్మించేశారు.**

నాలుగు వేల హెక్టార్లలో 'మహా కుంభమేళా' నగరాన్నే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇది ప్రపంచంలోనే అతి విస్తారమైన తాత్కాలిక నగరం. ఇక్కడ ఏ సమయంలోనైనా యాభై లక్షలమంది నుంచి కోటిమంది ఉండవచ్చు. ఈ నిర్మాణాల కోసం, ఇతరత్రా సౌకర్యాల కల్పన కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.7వేల కోట్లు ఖర్చుచేసింది. భక్తులపై ఇంత వ్యయం చేస్తున్న సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి...వారివల్ల కనిష్ఠంగా రూ. రెండు లక్షల కోట్ల మేర ఆర్థిక వృద్ధి సమకూరనున్నదని అంచనా.

> "భక్తి, నమ్మకం, సంస్కృతుల పవిత్ర సంగమంలో అసంఖ్యాక జనరాసులను మహా కుంభమేళా ఒక దగ్గరకు చేర్చింది. కాలాతీత ఆధ్యాత్మిక వారసత్వాన్నీ, సౌభ్రాతృత్వాన్నీ, విశ్వాసాన్నీ ఈ వేడుక ప్రతిబింబించింది"
>
> - 'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ.

40 కోట్లమంది భక్తులు సగటున ఐదు వేలు చొప్పున ఖర్చుచేస్తే సమకూరే ఆర్థిక ప్రయోజనం ఇదీ. అదనంగా ఆహార పదార్థాలు, పానీయాల విక్రయాలద్వారా మరో రూ.20 వేల కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుందని అఖిల భారత వర్తక సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. యూపీ కనీ సమాత్ర, వాస్తవ జీడీపీలో ఒక శాతం పెరుగుదలకు ఈ వృద్ధి దోహదపడుతుంది. దీనిపై యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ.. 2019లో జరిపిన అర్ధ కుంభమేళాలో 24 కోట్లమంది భక్తులు పాల్గొనగా, రాష్ట్ర ఖజానాకు రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇలా చూస్తే.. ఈసారి రూ. రెండు లక్షల కోట్లు తేలిగ్గా సమకూరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**విదేశీ భక్తుల హడావుడి**

దాదాపు 13 అఖాడాలకు చెందిన వేలాది మంది సాధుసంతులు మహాకుంభమేళాలో పాలుపంచుకుంటున్నారు. విదేశాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించడానికి త్రివేణి సంగమ తీరానికి అతి భారీ ఎత్తున చేరుకుంటున్న భక్తులు.. స్నానఘట్టాల వద్ద జరిగిన ఏర్పాట్ల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంగమ తీరంలోని నందీద్వారం వద్ద నెలకొల్పిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల కటౌట్ల వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

### 'విగ్రహం' చుట్టూ వివాదం..

మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ విగ్రహం ఏర్పాటు వివాదానికి దారితీస్తోంది. విగ్రహం ఉన్నచోట శిబిరం ఏర్పాటుచేసి సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు ఆహారం, వసతిని భక్తులకు కల్పిస్తున్నారు. అయితే, తన పాలనాకాలంలో హిందూ, సనాతన వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన ములాయం విగ్రహం ఇక్కడ పెట్టడం ఏమిటంటూ కొందరు భక్తులు, హిందూ సంస్థల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిములకు అనుకూలంగా, అయోధ్య ఆలయ ఉద్యమానికి వ్యతిరేకంగా నాడు ములాయం నిలిచారని అఖిల భారతీయ అఖాడా పరిషత్ మహంత్ రవీంద్ర పూరీ తెలిపారు. కోట్లాదిమంది హిందూ భక్తులు భక్తిశ్రద్ధలతో స్నానాలు ఆచరించే స్థలంలో అలాంటి నేత విగ్రహం పెట్టడం సరైన చర్య కాదన్నారు. రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన ములాయం పట్ల తమకు రాజకీయంగా ఏ వ్యతిరేకతా లేదన్నారు.

## లోకం తీరు



## తీపి శత్రువు

**శీతలపానీయాల వల్ల ఏటా 22 లక్షల టైప్ 2 డయాబెటిస్ కేసులు**

న్యూఢిల్లీ, జనవరి 13: కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ రావడమే కాకుండా టైప్ 2 డయాబెటిస్, హృదయరోగాలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. తీపిపానీయాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా కొత్తగా దాదాపు 22 లక్షల టైప్ 2 మధుమేహ కేసులు, 12 లక్షల హృద్రోగ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ కేసుల సంఖ్య ఆందోళనకరంగా ఉందని అమెరికాకు చెందిన టఫ్ట్స్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. 2020లో ప్రపంచవ్యాప్తంగా నమోదైన టైప్ 2 మధుమేహుల్లో 9.8% తీపి పానీయాల వల్లేనని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ అధ్యయనంలో తేలింది. కాగా, హార్వర్డ్ అనుబంధ బ్రిగాఘ్ మహిళా ఆస్పత్రి పోస్ట్‌మెనోపాజ్‌లో ఉన్న లక్ష మంది మహిళలపై 20 ఏళ్ల పాటు ఓ అధ్యయం జరిగింది. నెలకు 3, అంతకన్నా తక్కువ కూల్‌డ్రింక్స్ తాగినవారిలో 85% ఎక్కువ లివర్ క్యాన్సర్ ప్రమాదం కనిపించింది.

## 'కాగ్ నివేదిక'పై కావాలనే ఆలస్యం

**ఢిల్లీ సర్కారుపై హైకోర్టు అసహనం**

న్యూఢిల్లీ, జనవరి 13: కాగ్ నివేదికపై అసెంబ్లీలో చర్చించకుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారంటూ ఆప్ ప్రభుత్వంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఆలస్యం పలు అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానం వల్ల సర్కారుకు రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్న కాగ్ నివేదికపై చర్చ జరిపేందుకు అసెంబ్లీలో ప్రత్యేక సెషన్ ఏర్పాటుకు ఆదేశించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.




జడ్ మోర్ టన్నెల్ వద్ద ప్రధాని మోదీ, ఒమర్

## మోదీ.. మాటిస్తే తప్పడంతే!

**జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదాపై మోదీ**

### శ్రీనగర్-లేహ్ హైవేపై 'జడ్ మోర్' టన్నెల్ ప్రారంభం

శ్రీనగర్, జనవరి 13: 'ఇక్కడ ఉన్నది మోదీ.. మాటిస్తే తప్పడంతే' అని ప్రధాని మోదీ అన్నారు. జమ్మూకశ్మీరుకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని ఆ కేంద్రపాలిత ప్రాంతం సీఎం ఒమర్ అబ్దుల్లా చేసిన వినతిపై ఆయన స్పందిస్తూ.. ప్రతి దానికీ ఓ సమయం ఉంటుందన్నారు. సరైన సమయంలో సరైనవే జరుగుతాయని స్పష్టం చేశారు. సోమవారం జమ్మూకశ్మీరులో పర్యటించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. శంకుస్థాపనలు కూడా చేశారు. ముఖ్యంగా గాందర్‌బల్ జిల్లా సోనామార్గ్‌లో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై 6.4 కిలోమీటర్ల పొడవున నిర్మించిన 'జడ్ మోర్' సొరంగాన్ని ఆయన ప్రారంభించారు. లోపలకు వెళ్లి పరిశీలించారు. సొరంగం నిర్మించిన కార్మికులతో సంభాషించారు. ఆ సందర్భంగా అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కాగా, రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై 12 కిలోమీటర్ల పొడవున తలపెట్టిన ఈ ప్రాజెక్టులో రెండు సొరంగాల నిర్మాణం తలపెట్టారు. వీటిలో ఒకటి జోజిలా సొరంగం. 2028కల్లా ఇది పూర్తవుతుంది. రెండోది జడ్ మోర్. 6.4 కిమీ నిడివి గల ఈ సొరంగం శ్రీనగర్-లద్దాఖ్ నడుమ 49 కిలోమీటర్ల ప్రయాణ దూరాన్ని 43 కిమీకు తగ్గిస్తుంది.

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్!

(మొదటి పేజీ తరువాయి)



కరీంనగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

రూపొందించేందుకు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతుండగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అడ్డుకొని, దాడికి యత్నించారని సంజయ్ పీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య, ఆర్డీవో కె.మహేశ్వర్, సుడా చైర్మన్ కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కౌశిక్‌రెడ్డిపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ పోలీసులు కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. రాత్రి 10.40 గంటలకు కరీంనగర్ తీసుకొచ్చారు. ఆయన్ను కరీంనగర్ సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉంచారు. ప్రాథమిక విచారణ అనంతరం వైద్య పరీక్షలు చేయించి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని నినాదాలు చేశారు. కరీంనగర్‌లో అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. పెద్దఎత్తున నిరసనకు దిగిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**వాంగ్మూలం ఇచ్చిన సంజయ్**

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆయన పీఏ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి పోలీసులు ఎమ్మెల్యే వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అనంతరం ఆయన స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తనపై దాడికి యత్నించి, దుర్భాషలాడిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కౌశిక్‌రెడ్డి తనను దుర్భాషలాడారని, దాడి చేసేందుకూ యత్నించారని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తానని స్పీకర్ చెప్పినట్లు సంజయ్ వివరించారు. తనను కౌశిక్‌రెడ్డి నెట్టివేశాడని, అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పారు. తానెప్పుడూ ఏ వ్యక్తినీ దూషించలేదన్నారు. కౌశిక్‌రెడ్డి రాజకీయాల్లోకి రాకముందే ఆయనపై కేసులు ఉన్నాయని తెలిపారు. కౌశిక్‌రెడ్డికి బెదిరించడం అలవాటేనని, వరంగల్‌లో బెదిరించి సెటిల్‌మెంట్ చేశాడని ఆరోపించారు. తాను ప్రజా సమస్యలపై మాట్లాడాలని అనుకుంటే ఆయన ఆటంకం కలిగించాడన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసమే తనను గెలిపించారని, అభివృద్ధి చేయడం తన బాధ్యత అని చెప్పారు. కౌశిక్‌రెడ్డి దురుసు ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతో పనిచేస్తే ఇంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. తనను ప్రశ్నించే ముందు కౌశిక్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారాడో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. గతంలో బీఆర్ఎస్ చేరికలపై కేసీఆర్ క్షమాపణ చెబితే, తాను రాజీనామా చేస్తానని చెప్పారు. కాగా, జగిత్యాలలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చిత్రపటాన్ని గాడిదకు తగిలించి ఎమ్మెల్యే సంజయ్ అనుచరులు నిరసన తెలిపారు. అనంతరం కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం: హరీశ్

కౌశిక్‌రెడ్డిని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే దాడులు, అడిగితే అరెస్టులు.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ 13 నెలల పాలనలో తెలంగాణ కక్షపూరిత రాజకీయాలకు నిలయంగా మారడం శోచనీయమన్నారు. ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇపుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అణచివేతలు, నిర్బంధాలకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని హరీశ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే సంజయ్‌కి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సవాల్ విసిరారు.

## రైతులు, కూలీలకు కాంగ్రెస్ కుచ్చుటోపీ!

### ఎకరంలోపు ఉన్న వారందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి: హరీశ్



సంగారెడ్డి టౌన్/జహీరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కుంటి సాకులు చెబుతూ రైతులు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ కుచ్చుటోపీ పెట్టిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఎకరంలోపు భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 24.57 లక్షల మంది ఉన్నారన్నారు. ఇందులో ఎక్కువ శాతం దళితులు, గిరిజనులు, బీసీలు ఉన్నారని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటే వారి కడుపు కొట్టడమేనా? అని హరీశ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కోటి మంది వ్యవసాయ కూలీలు ఉండగా.. పది లక్షల మందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. 90 శాతం మంది కూలీలకు రకరకాల కారణాలతో ఆత్మీయ భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేయడం విచారకరమని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు అడుగడుగునా రైతులను దగా చేస్తోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు విజయోత్సవాల్లో భాగంగా నవంబరు 30న సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ కోసం రూ.2,750 కోట్ల చెక్కును విడుదల చేశారని.. ఆ చెక్కుకే దిక్కులేదని ఎద్దేవా చేశారు. 'ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్లుగా రుణమాఫీకి కూడా డమ్మీ చెక్కులు ఇస్తున్నారా? ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు ఎందుకు జమ కాలేదు?' అని హరీశ్ ప్రశ్నించారు. కాగా, బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి జరిగిందని హరీశ్ చెప్పారు. సంగారెడ్డి జిల్లా ఉప్పర్‌పల్లి తాండాలో మోతీమాతను సోమవారం ఆయన దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## వాస్తవాధీన రేఖ సమీపంలో చైనా భారీ సైనిక విన్యాసాలు

న్యూఢిల్లీ, జనవరి13: లద్దాఖ్ తూర్పు ప్రాంతంలో చైనా భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. వాస్తవాధీన రేఖ సమీపంలో అత్యంత ఎత్తైన ప్రదేశంలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన షింజియాంగ్ మిలిటరీ కమాండ్ ఈ విన్యాసాలు చేపట్టింది. అత్యంత కఠిన, ప్రతికూల పరిస్థితుల్లో యుద్ధ సన్నద్ధత, లాజిస్టిక్స్ సరఫరా తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ విన్యాసాలు నిర్వహిస్తోంది. ఈ నెల 15న భారత సైనిక వ్యవస్థాపక దినోత్సవం జరగనున్న తరుణంలో చైనా విన్యాసాలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. అత్యాధునిక సైనిక సాంకేతికత, వాహనాలు, మానవ రహిత వ్యవస్థలు, డ్రోన్లను చైనా ఆర్మీ వినియోగిస్తోంది. యుద్ధ సమయాల్లో బలగాలకు అవసరమైన ఆయుధాలు, పరికరాలు, ఆహారం, మందులు ఇతర కీలక సామాగ్రి సరఫరా చేసే విషయంపై దృష్టి సారించింది. చలి, మంచు తీవ్రంగా ఉండే వాతావరణాన్ని తట్టుకునేలా చైనా బలగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.



జగన్నాథం అంతిమ యాత్రలో మంత్రి పొన్నం ప్రభాకర్, మందకృష్ణ, మధుయాష్కీ, రాజయ్య, రాములు, సంపత్‌కుమార్ తదితరులు

## మందా జగన్నాథం అంత్యక్రియలు పూర్తి

**అధికారిక లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వం**

సైదాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముగిశాయి. చంపాపేటలోని ఆయన నివాసం నుంచి సైదాబాద్ దోబీఘాట్ శ్మశానవాటిక వరకు ఆయన పార్థివ దేహానికి అంతిమయాత్ర నిర్వహించి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. తన అభిమాన నేతను కడసారి చూసేందుకు మంత్రులు, రాజకీయ, ప్రజాసంఘాల నేతలతోపాటు అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతిమ యాత్రలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంపీలు మధుయాష్కీ, గౌడ్, పోతుగంటి రాములు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, గువ్వల బాలరాజు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పాల్గొని పాడె మోశారు. సిరిసిల్ల రాజయ్య డప్పు కొట్టారు. కాగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మందా జగన్నాథం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. తెలంగాణ ఉద్యమంలో, బీఆర్ఎస్ పార్టీకి మందా జగన్నాథం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వివాదరహితుడు, సౌమ్యుడు, తెలంగాణ మేలు కోరుకున్న వ్యక్తి అని అన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిని మందా జగన్నాథం ఆకాంక్షించారని వివరించారు. మందా జగన్నాథం పార్థివ దేహానికి మంత్రి దామోదరం రాజనర్సింహ, మాజీ ఎంపీ కేశవరావు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు.

## నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌పై వేటు

**విధుల పట్ల నిర్లక్ష్యంతో బాధ్యతల నుంచి తొలగింపు**

**ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ నియామకం**

సుభాష్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌ను సోమవారం విధుల నుంచి తొలగిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందుల గురించి 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన 'స్ట్రెచర్ లేక.. సిబ్బంది రాక.. భార్యను భుజాలపై మోసుకెళ్లిన భర్త' అనే కథనానికి స్పందించిన డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం ఆ మరునాడే నిబంధనలకు విరుద్ధంగా ఆమె జన్మదిన వేడుకలను చాంబర్‌లో నిర్వహించడం వివాదాస్పదమైంది. గత నెలలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ సూపరింటెండెంట్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పర్యవేక్షణ, సేవలు సక్రమంగా లేవని సమావేశంలోనే నిలదీశారు. గత ఐదేళ్లుగా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రతిమారాజ్ కొంతకాలంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్‌ను నియమిస్తూ.. వెంటనే బాధ్యతలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డాకింగ్‌పై సందేహాలు..!

బెంగళూరు, జనవరి 13: అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించడం కోసం రూ.370 కోట్ల వ్యయంతో చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో ముందడుగు వేసినట్టే కనిపించిన ఇస్రో మరోసారి వెనక్కు తగ్గింది...! శనివారం సాయంత్రం ఎస్‌డీఎక్స్01, ఎస్‌డీఎక్స్02 ఉపగ్రహాల మధ్య దూరం 230 మీటర్లు ఉంది. తర్వాత ఆ దూరాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చిన ఇస్రో.. ఆదివారం ఉదయానికల్లా దాన్ని 3 మీటర్లకు తగ్గించడంలో విజయం సాధించింది. కానీ.. ఆ తర్వాత ఉపగ్రహాల మధ్య దూరాన్ని తగ్గించే ట్రయల్ ముగిసిందని, వాటిని సురక్షిత దూరానికి తరలించామని, ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ చేపడతామని ఎక్స్‌లో ట్వీట్ చేసింది. ఉపగ్రహాలను చేరువ చేయడం ఉత్సాహాన్ని రేపినా.. మళ్లీ వాటిని సురక్షిత దూరానికి తరలించడం పలు సందేహాలకు తావిస్తోంది. దీనిపై పలువురు నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరేమో ఈ రెండు ఉపగ్రహాలు డాకింగ్‌కు అనుకూలంగా లేవని అంటుంటే.. మరికొందరు ఇస్రో ఊహించిన, ప్రకటించిన దానికంటే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌ల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల అంచనాలు, లెక్కలు తప్పాయని మరికొందరు విమర్శిస్తున్నారు. స్పేస్ డాకింగ్ కోసం ఇస్రో గత నెల 30న స్పేడెక్స్ మిషన్ ద్వారా జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి చేర్చింది.

## అయ్యప్ప జ్యోతి దర్శనం నేడే

**5 వేల మందితో అదనపు భద్రత**



సోమవారం శబరిమలలో అయ్యప్ప భక్తులు

శబరిమల, జనవరి 13: మకర సంక్రమణ సమయంలో.. కాంతమలైగా పిలిచే పొన్నంబలమేడుపై జ్యోతి రూపంలో దర్శనమిచ్చే హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి దర్శనానికి భక్తులు శబరికొండకు తరలివస్తున్నారు. 1999లో హిల్‌టాప్ తొక్కిసలాట.. 2011లో పులిమేడ్ దుర్ఘటనల నేపథ్యంలో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. మకర విళక్కు(జ్యోతిదర్శనం) రోజున భారీ బందోబస్తుకు కేరళ సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న భద్రతకు తోడు.. అదనంగా 5 వేల మందిని మోహరించనుంది. మకరవిళక్కు సీజన్ ప్రశాంతంగా ముగిసేందుకు పలు ప్రాంతాల్లో వాహనాలు, భక్తులకు నిషేధాజ్ఞలు విధించినట్లు పథనంతిట్ట కలెక్టర్ ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో ఈ సారి పంపాబేస్, హిల్‌టాప్ వద్ద పార్కింగ్‌కు అనుమతించినా.. మకరవిళక్కు నేపథ్యంలో హిల్‌టాప్‌లో వాహనాల పార్కింగ్‌ను నిషేధించారు. ఆ స్థానంలో సుమారు 8 వేల మంది భక్తులు హిల్‌టాప్ నుంచి మకరజ్యోతిని దర్శించుకునే అవకాశం కల్పించనున్నారు. మకరజ్యోతి దర్శనానికి ఈ సారి అయ్యన్నమల వ్యూపాయింట్‌లో ఎవరినీ అనుమతించరు. పందళం నుంచి శబరిమలకు తిరువాభరణాలను ఊరేగింపుగా తీసుకెళ్లే మార్గంలో ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. మకరజ్యోతి అనంతరం భక్తులు నీలక్కల్‌కు తిరిగి వెళ్లేలా కేఎస్ఆర్టీసీకి చెందిన 300 బస్సులు అందుబాటులో ఉంటాయి. అయ్యప్ప దర్శనం పూర్తయిన భక్తులు మకర జ్యోతి కోసం సన్నిధానంలో ఉండకుండా.. సంబంధిత వ్యూపాయింట్లకు తరలిస్తారు. అక్కడ ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు.

## రాజన్న అన్నదాన సత్రానికి విరాళాల వెల్లువ

- రూ. 45 లక్షలు ప్రకటించిన మంత్రి పొన్నం
- రూ. 10 లక్షలు ప్రకటించిన విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి అన్నదాన సత్రానికి విరాళాలు వెల్లువెత్తాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.45 లక్షల విరాళం ప్రకటించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. సోమవారం రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రాజన్న ఆలయంలో అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలైందని, త్వరలో టెండర్‌లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు నిరంతరం అన్నదానం కొనసాగించేందుకు ట్రస్టులో ఇప్పటికే రూ.20 కోట్లు ఉన్నాయని, వాటిని రూ.100 కోట్లకు చేర్చడమే లక్ష్యంగా తాను పనిచేస్తానని చెప్పారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ఈ ప్రాంత ప్రజలు కూడా విరాళాలు అందించాలని కోరారు.

## 3 రోజుల్లో జిల్లాలకు 2,276 'సిటీ' బస్సులు

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ ఆర్టీసీ బస్సులు పెద్ద సంఖ్యలో జిల్లాలకు తరలివెళ్లాయి. మూడు రోజుల్లో 2,276 పైగాబస్సులను ప్రత్యేకంగా జిల్లాలకు నడిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్, బోయిన్‌పల్లి ప్రాంతాల నుంచి బస్సులు సమీప జిల్లాలకు నడిచాయి. జిల్లాలకు రెగ్యులర్ సర్వీసులతో పాటు 3 రోజుల్లో 2,276 ప్రత్యేక బస్సులు నడపడం తొలిసారని అధికారులు తెలిపారు. జనవరి 17 నుంచి 19 వరకు జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు నడవనున్నట్లు వెల్లడించారు.

## గాలిపటం ఎగురవేస్తూ విద్యుదాఘాతంతో బాలుడి మృతి

- మరో చిన్నారికి గాయాలు.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

మహమ్మదాబాద్ జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పండగపూట పతంగి ఎగురవేస్తూ విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం కంచింపల్లికి చెందిన రఘు, చంద్రకళ హైదరాబాద్‌లో కూలీలుగా పని చేస్తున్నారు. 3 రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. రఘు కొడుకు మనోజ్‌కుమార్(7) వారి ఇంటి పక్కనే ఉన్న ఇంటిపైకి వెళ్లి గాలిపటాలు ఎగురవేశాడు. అతని పతంగి విద్యుత్ తీగలకు వేలాడటంతో ఇనుపచువ్వతో తీస్తుండగా అది తీగలకు తగిలి బాలుడు విద్యుత్ షాక్‌కు గురై అక్కడే సగానికి పైగా కాలిపోయాడు. మరో బాలుడు గాయపడ్డాడు. వారిద్దరిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మనోజ్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

# మహిళా పవర్!

## మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు.. ప్రతి గ్రామ సమాఖ్యకు ఓ మెగావాట్ యూనిట్

- నాలుగు ఎకరాల భూమిలో రూ.3 కోట్లతో ఏర్పాటు
- 10 శాతం సమాఖ్య భరించాలి.. 90 శాతం బ్యాంకు రుణం
- యూనిట్‌కు రూ.3.32పైసల ధరతో కొనుగోలుకు ఒప్పందం
- మహిళల ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందడుగు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వారిని సోలార్ పవర్ రంగంలోకి ప్రవేశింప చేసి.. మహిళాశక్తిని చాటి చెప్పేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పెండింగ్ లేకుండా చెల్లించడం, ప్రభుత్వపరంగా అందించే ప్రోత్సాహంతో, పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో స్థిరంగా ఎదుగుతున్న కారణంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (ఎస్ఈఆర్‌పీ) ద్వారా రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వారికి సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామంలోని 40 స్వయం సహాయక సంఘాల సమన్వయంతో పని చేసే గ్రామ సమాఖ్యకు ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న సోలార్ విద్యుత్ ఉత్పత్తిప్లాంటును అప్పగించనున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4 వేల ప్లాంట్లను కేటాయించనున్నారు. అయితే, ఒక మెగావాట్ యూనిట్ ప్లాంటును రూ.3 కోట్ల వ్యయంతో నాలుగు ఎకరాల భూమిలో ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మొత్తం యూనిట్ వ్యయంలో గ్రామ సమాఖ్యలు 10 శాతం వెచ్చించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం బ్యాంకుల ద్వారా రుణం అందిస్తారు. అయితే, ఒక్కో యూనిట్‌ను రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయాల్సి ఉండటం.. అందులో 10 శాతం అంటే.. రూ.30 లక్షల వరకు ఎస్‌హెచ్‌జీలు భరించాల్సి ఉండటంతో.. గ్రామంలోని ఒకటి రెండు సంఘాలు అంతమొత్తం భరించలేని పరిస్థితి. అంతేకాకుండా మిగిలిన రూ.2.70 కోట్లు బ్యాంకుల ద్వారా రుణం పొందాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ సమాఖ్యల ద్వారా యూనిట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సెర్ప్ విభాగాలు వెల్లడించాయి. కాగా, ఎస్‌హెచ్‌జీల ద్వారా నిర్వహించే సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అటవీ, దేవాదాయ, పోరంబోకు భూములను ఎంపిక చేయాలని ప్రభుత్వం సంబంధిత శాఖలను ఇప్పటికే ఆదేశించింది. వీటికి అనువైన భూములను సేకరించేందుకు ఆయా శాఖల ద్వారా భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తూనే.. మెదక్, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ఇప్పటివరకు 180 ఎకరాలు అనువైన భూమిని గుర్తించారు. జూలై నాటికి మొత్తం 4 వేల యూనిట్లకు అవసరమైన భూమిని గుర్తించే విధంగా ఆయా విభాగాలు దృష్టి పెట్టాయి. సాగుకు అనువుగా లేని భూములను రాష్ట్ర ప్రభుత్వమే భూమిని సమకూర్చి అందులో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సదుపాయాలు కల్పించనుంది. అయితే, ఎకరాకు రూ.20 వేలు చొప్పున భూములు కేటాయించే శాఖలతో సెర్ప్ ద్వారా గ్రామ సమాఖ్యలు లీజు ఒప్పందం కుదుర్చుకునేలా విధి విధానాలు రూపొందించారు.

### అప్పు తీరాక ప్లాంట్లు సమాఖ్యల సొంతం

ఒకటి, రెండు సంఘాలకు పరిమితం కాకుండా.. గ్రామంలోని (దాదాపు 40 ఉంటాయి) అన్ని ఎస్‌హెచ్‌జీలతో ఏర్పడిన గ్రామ సమాఖ్య ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. అర్హమైన మహిళా సమాఖ్యలకు అనువైన భూములను ప్రభుత్వ శాఖల ద్వారా గుర్తించి.. లీజుపై ఇప్పిస్తారు. సమాఖ్యల నిర్వహణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను సంబంధిత విభాగాల ద్వారా కొనుగోలు చేసే విధంగా సెర్ప్ సంస్థ మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఒక యూనిట్‌కు రూ.3.32 పైసలకు కొనుగోలు చేసేలా ఈ ఒప్పందం ఉంటుందని తెలుస్తోంది. కాగా, రూ.3కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసే ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్ ద్వారా గ్రామ సమాఖ్యలకు ఏటా రూ.52 లక్షల వరకు ఆదాయం వస్తుందని ప్రాథమిక అంచనా.. అయితే.. బ్యాంకు రుణం చెల్లింపు, నిర్వహణా వ్యయం, ఇతర ఖర్చులు పోను.. వచ్చిన ఆదాయంలో ఏడాదికి రూ.4 లక్షల వరకు మిగిలే అవకాశం ఉంది. పదేళ్ల కాలపరిమితితో బ్యాంకుల ద్వారా రుణం తీసుకోనున్న కారణంగా పదేళ్లలో అప్పు తీరితే.. ఆ తర్వాత సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ గ్రామ సమాఖ్యకే సొంతం అవుతుంది. దీంతో ఏళ్ల తరబడి గ్రామ సమాఖ్యలోని మహిళలు ఆదాయ వనరులు పొందేందుకు మార్గం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## తప్పించుకునేందుకు.. గొంతు కోసుకున్న దొంగ

- పరిస్థితి విషమం.. పోలీసులు గప్‌చుప్!

బంజారాహిల్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో పట్టుకునేందుకు వచ్చిన కానిస్టేబుల్ నుంచి తప్పించుకునేందుకు ఓ దొంగ బ్లేడుతో గొంతు, చేతులు కోసుకున్న ఉదంతమిది..! ఈ సంఘటన బోరబండ ఠాణా పరిధిలో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. బోరబండ సైట్-3లో నివసించే థామస్, ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తుంటారు. క్రిస్మస్, కొత్తసంవత్సరం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి జోగిపేటకు వెళ్లారు. ఈనెల 7న తిరిగి వచ్చి చూడగా.. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా.. అల్మారాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చెవి కమ్మలు, మాటీలు, ఉంగరాలు, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీని జల్లెడపట్టగా.. మహమ్మద్ హాషం అనే దొంగ ఈ చోరీకి పాల్పడ్డట్లు నిర్ధారణ అయ్యింది. తప్పించుకుతిరుగుతున్న హాషంను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటవ్వగా.. క్రైమ్ కానిస్టేబుల్ ఒకరు ఈ నెల 12న నిందితుడిని గుర్తించి, అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. అంతలో హాషం తన జేబులోంచి బ్లేడ్ తీసి.. గొంతు కోసుకున్నాడు. చేతులపైనా కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దాంతో సదరు కానిస్టేబుల్ అతణ్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం హాషం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' యత్నించగా.. పోలీసులు స్పందించడం లేదు.



## బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం.. రాజ్యాంగ సవరణ చేయాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను పొందుతున్న ఏ వర్గానికి విధించని క్రీమి లేయర్‌ను బీసీలకే విధించడం ఏమిటని.. దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్లు పెట్టింది పేదరిక నిర్మూలన కోసం కాదని సామాజిక అభివృద్ధి కోసమేనని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘాలు, బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుకు 50% సబ్సిడీ!

- రైతులను ప్రోత్సహించే దిశగా సర్కారు కీలక నిర్ణయం
- ఎకరానికి రూ.3 లక్షలు ఖర్చు.. సగం సర్కారే భరిస్తుంది
- ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు దిశగా ఆలోచిస్తున్న రైతులకు ఇది శుభవార్తే! కూరగాయల సాగు విస్తీర్ణం పెంపు, నాణ్యమైన తీగజాతి కూరగాయల ఉత్పత్తి, తద్వారా రైతులు స్వయం సమృద్ధి సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూరగాయలు సాగు చేసే రైతులకు వారి క్షేత్రాల్లో శాశ్వత పందిళ్లు, సాగు పరంగా మౌలిక సదుపాయాల కల్పనకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులను వినియోగించాలని సంకల్పించింది. ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో అమలు చేయాలని నిర్ణయించింది. పథకంపై అక్కడి రైతులూ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 360 దరఖాస్తులొచ్చాయి. వీరికి బోధన్ మార్కెట్ కమిటీ నుంచి సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై మార్కెటింగ్‌శాఖ ఒక శాతం మార్కెట్ సెస్ వసూలు చేస్తుంది. ఈ నిధులను ఎక్కడికక్కడ మార్కెట్ కమిటీలు వసూలు చేస్తాయి. వీటితో ఆయా మార్కెట్ పరిధిలో బహిరంగ ప్లాట్‌ఫామ్‌లు, కవర్ షెడ్లు, గోదాములు, అంతర్గత సీసీరోడ్లు, రైతులకు విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు నిర్మిస్తుంటారు. నీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 87 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. మార్కెట్ సెస్‌ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈప్రక్రియలో ముందుగా తీగజాతి కూరగాయల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకర, బీర, దొండ, సోర, చిక్కుడ తదితర కూరగాయల సాగుకు కోసం శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఎకరాకు రూ.3 లక్షల దాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పందిళ్ల ఏర్పాటు చేసుకుంటే 50శాతం సబ్సిడీ ఇస్తారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఈ పథకాన్ని చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్‌రెడ్డి ముందుకొచ్చారు. నియోజకవర్గంలో క్షేత్ర పర్యటనలుచేసి రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. శాశ్వత పందిళ్లు వేసి కూరగాయలు సాగు చేస్తే ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ప్రకృతి పరిమళం

'పువ్వు పూయును, పూసి వాడును/ వాడి రాలును, వాడి రాలిన పువ్వు వంతుకు/ పూసి మరియొక పువ్వు జేరును' అని ప్రకృతి లీలను కవి కాళోజీ వర్ణించారు. 'రాశి చక్రగతులలో/ రాత్రిం దివాల పరిణామాలలో/ బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో/ కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన/ పరమాణువు సంకల్పంలో' ప్రభవించిన మానవుడు కాల దేవతను సంక్రాంతులతో పూజిస్తున్నాడు. తన జీవనాన్ని వినూత్న మార్పులతో మరింత శోభితం చేసుకునేందుకు సంక్రాంతి వేడుకలతో ఆవాహన చేసుకుంటున్నాడు.

సంక్రాంతి గగనంలో ప్రారంభమవుతుంది. మానవుని ఖగోళ జిజ్ఞాస నుంచి 'సంక్రాంతి' అనే పదం పుట్టింది. గ్రహ రాశులలో ఒక రాశి నుంచి మరొక రాశికి సూర్యుని కదలికను సంక్రాంతి సూచిస్తుంది. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి చేరడాన్ని సంక్రమణం లేక సంక్రాంతి అంటారు. సూర్యుడు మకర రాశికి చేరినప్పుడు మకర సంక్రాంతి వస్తుంది. ఈ సంక్రాంతి నుంచి సూర్యుడి గమనం ఉత్తర దిశగా జరుగుతుంది. అదే ఉత్తరాయణం. సూర్యుని సంక్రమణల ప్రాతిపదికనే ఋతువుల మార్పు జరుగుతుంది. ఈ ప్రాకృతిక పరిణామం భువిపై మానవునితో సహా జీవకోటి వైవిధ్యపూరిత జీవన మనుగడ ఆధారపడి ఉంటుంది. మార్పు ఒక నిత్య సత్యమని, అది అనివార్యమని సూర్యుడి మకరరాశి ప్రవేశం స్పష్టం చేస్తుంది. గగనంలో సంక్రాంతి అందరిదీ. అది చాటే సత్యం సంక్రాంతి పండుగ ఖగోళ ప్రాధాన్యాన్ని దృష్టాంతపరుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మన పాడిపంటలు ఆ ఆదిత్యుని అనుగ్రహాలే.

సంక్రాంతి పంటల పండుగ. ధాన్యరాశులు రైతుల ఇళ్లకు చేరుతాయి, సంక్రాంతి మహోత్సవం ప్రారంభమవుతుంది. మకర సంక్రాంతి రోజున పంటల సాగులో తమకు సహాయపడిన వారికి రైతులు సముచిత రీతిలో కృతజ్ఞతలు తెలుపుతారు. సంక్రాంతి మరుసటి రోజు 'ఇలవేల్పుల' (పాడి పశువులు అయిన ఆవులు, గేదెలతో పాటు ఎద్లు, దున్నపోతులు మొదలైన శ్రామిక పశువులు)ను పూజిస్తారు. మకర సంక్రాంతి వేడుకలు భారతావని అంతటా వివిధ పేర్లతో, వేర్వేరు రూపాలలో జరుగుతాయి. ఉత్తరప్రదేశ్‌లో కీచేరిగా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లలో లోహ్రిగా, అసోంలో భోగాలి బిహుగా, బెంగాల్, ఒడిసాలలో మకర్ సంక్రాంతి, రాజస్థాన్‌లలో ఉత్తరాయన్, తమిళనాడులో పొంగల్‌గా జరుపుకోవడం పరిపాటి. ఈ వేడుకల ఉల్లాసోత్సాహాల వెనుక అపారశ్రమ, అంతులేని వేదన ఉన్నాయన్నది కూడా విస్మరించలేని నిజం. సిరులు పండించిన శ్రామికులకు, ఒకటి రెండు రోజులపాటు ఉదార దానధర్మాలు, కృతజ్ఞతా నివేదనలతో న్యాయం జరుగుతుందా?

మకర సంక్రాంతికి ఖగోళ, వ్యవసాయక, సాంస్కృతిక ప్రాధాన్యమే కాకుండా ఆధ్యాత్మిక విశిష్టత కూడా ఉన్నది. ఒక నిర్దిష్ట యోగ ప్రక్రియ నుంచి ఈ పండుగ ఆవిర్భవించిందని యోగి పుంగవులు విశ్వసిస్తారు. భగీరథుడు గంగమ్మను భువిపైకి తీసుకువచ్చింది మకర సంక్రాంతి నాడే అని మన పురాణాలు చెప్తునందున ఈ పర్వదినం నాడు గంగానది, ఇతర నదులలో స్నానం చేయడాన్ని ఒక పుణ్యకార్యంగా ప్రజలు భావిస్తారు. సహస్రాబ్దాలుగా సంఖ్యానేక తరాల వారి ఈ విశ్వాసమే కుంభమేళాలకు నాంది. ముఖ్యంగా ఈ ఏడాది త్రివేణీ సంగమమైన ప్రయాగరాజ్ (అలహాబాద్)లో మహా కుంభమేళ జరుగుతున్నందున (జనవరి 13న ప్రారంభమయిన ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 26 దాకా కొనసాగనున్నది) ఈ మకర సంక్రాంతి మరింత విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ప్రకృతి పవిత్రత గురించి మానవ అంతరంగాన్ని జాగృతం చేయడమే కుంభమేళాల లక్ష్యం. సామాజిక పరమార్థాన్ని సాధించే ఒక మతాభినివేశ కార్యక్రమం మహా కుంభమేళా. సామాజిక సమ్మిళితత్వానికి దోహదం చేసే ఆధ్యాత్మిక మహోత్సవం.

ఒక శుభ సందర్భంలో గూడుకట్టుకుని ఉన్న విషాదాన్ని గురించి 'ఆ మానవాననంలో/ ఏదో కించి ద్విషాదం, కించిన్నిరాశ/ కొంచెం విరాగం, కించి దసంతృప్తి/ ఆ మానవ వదనం అందరికీ పరిచితమే/ అతడే నువ్వూ నేనూ అంతమంది వెరసి' అని శ్రీశ్రీ అన్న మాటలు ప్రస్తుతం ధరిత్రిని కమ్మివేస్తున్న ఒక విలయానికి కూడా వర్తిస్తాయి. అవధులు మీరుతున్న వాతావరణ మార్పే ఆ విషాదం. 2024 పంచాంగ సంవత్సరంలో పారిశ్రామిక యుగానికి పూర్వపు సగటు ఉష్ణోగ్రతల స్థాయి కంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయింది. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ప్రాకృతిక ఉత్పాతాలన్నీ ఈ వాతావరణ మార్పు పర్యవసానాలే. ముంచుకొస్తున్న ఈ ముప్పును నివారించడానికి పరిష్కార మార్గాలను కనుగొనవలసి ఉన్నది. యూపీ సర్కార్ మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో సుస్థిరత, అభివృద్ధిపై కుంభ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం ముదావహం. కొత్త జీవితాన్ని నిర్మించుకునేందుకు సంకల్పం చెప్పుకునే శుభ దినం కనుక ఈ మకర సంక్రాంతి రోజున ధాత్రీరక్షణకు దోహదం చేసే ఆలోచనలు చేసి వాటిని స్థానికంగా ఆచరణలో పెట్టేందుకు వ్యక్తులు, జన సముదాయాలు, సామాజిక సమూహాలు, ప్రభుత్వాలు పూనుకోవాలి. ఊరు, ఉర్వి శ్రేయస్సు అవిభాజ్యమని గుర్తిస్తేనే ఊరంతా సంక్రాంతి జరుపుకుంటుంది, ఉర్వి జీవన నందనవనం అవుతుంది.

# కలల దేశంగా అమెరికా ఎప్పుడైనా ఉందా?

జాతీయవాదం... దాదాపు 200 ఏళ్లకు పైగా ప్రజలను ఉర్రూతలూగిస్తోంది. అన్ని సందర్భాల్లోనూ దీని ప్రభావం స్పష్టంగా కనపడకపోవచ్చు. సాధారణ ప్రజలు చాలాసార్లు జాతీయవాద ప్రేరణతో వ్యవహరించి ఉండకపోవచ్చు. కానీ కీలక సందర్భాల్లో విపరీతంగా ప్రభావితం చేసిన భావజాలాల్లో జాతీయవాదమే ప్రధానమైంది. జాతీయవాదం కోసం సర్వం ధారపోసినవారు అన్ని దేశాల్లోనూ కనపడతారు. ఇదంతా ఒక వైపు కథే! మరోవైపు నుంచి చూస్తే విపరీత జాతీయవాదం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. అనేక యుద్ధాలకు, దారుణాలకు, వైషమ్యాలకు, విద్వేష ఆలోచనలకు కారణమై కోట్ల మంది జీవితాలను విచ్ఛిన్నం చేసిందీ జాతీయవాదమే! యుద్ధోన్మాదాలను రగిలించిన నాయకులందరూ జాతీయ వాదాన్ని స్మరిస్తూనే రక్తపుటేరులను పారించారు.

మితిమీరిన జాతీయవాదంతో ఏ దేశంలోనైనా నలిగిపోయేది మైనారిటీలే. చరిత్రను తవ్వితీస్తే కనపడేది ఈ చేదు నిజమే. దేశంలోని మెజారిటీ ప్రజలను... మతపరంగానో, భాషపరంగానో, జాతిపరంగానో (రేస్), ప్రాంతంపరంగానో ప్రధాన సమూహంగా గుర్తించి వారందరికీ ఒకే తరహా ఉమ్మడి ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేయటమే అతి జాతీయవాదంలో విశేషంగా ఉంటుంది. ప్రధాన సమూహ ప్రజల మధ్య తేడాలనూ, అసమానతలనూ గుర్తించకుండా కృత్రిమ జాతి ఆధిక్య భావాల చుట్టూ ప్రచారాన్ని కేంద్రీకరించి ఉద్రేకపరచటమే జాతీయవాదాల్లో తరచూ కనపడుతుంది. దేశం గొప్పగా భావించే సాంస్కృతిక వారసత్వాన్ని మైనారిటీలు అంగీకరించటం లేదనీ మనం తరచూ వింటూంటాం. సాంస్కృతిక ప్రత్యేకతలను వదులుకోనివారిని సందేహదృష్టితో చూడటం సంకుచిత జాతీయ వాదంలో ప్రధానంగా కనపడుతుంది.

ప్రజాస్వామ్యానికి అగ్రదేశంగా మనందరమూ భావిస్తున్న అమెరికాలోనూ ఆది నుంచి ఇదే ధోరణి కనపడుతుంది. హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడే వెల్లడవుతోంది. కుల, తెగ మనస్తత్వాల కంటే జాతీయవాదం విశాలమైనదే కావచ్చు. కానీ జాతి, వర్ణ ఆధిక్యంపై జాతీయవాదం ఆధారపడిన చోట అమెరికా అయినా మరో చోటైనా జరిగే దురాగతాలు ఇంచుమించుగా ఒకేరకంగా ఉంటాయి. జాతీయవాదం పేరుతో సంకుచిత్వం పెరిగే కొద్దీ మైనారిటీలకు క్షోభ ఎక్కువవుతుంది. సందర్భాన్ని బట్టి ఈ క్షోభ రూపం ఆధారపడి ఉంటుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. 2022–23లో 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు.

అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్క పెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వారిని అక్కున చేర్చుకుని నివాసయోగ్యాన్ని కలిగించే దేశంగా అమెరికా గురించి ఘనంగా చెప్పుకోవటం అందరమూ వినే ఉంటాం. అమెరికాను వలసదారుల దేశంగా (ఎ నేషన్ ఆఫ్ ఇమ్మిగ్రంట్స్) వర్ణించి బాగా ప్రాచుర్యం కల్పించటంలో ఒకనాడు ఆ దేశాధ్యక్షుడిగా వ్యవహరించిన జాన్.ఎఫ్.కెన్నడి పాత్ర చాలా ఉంది. 'వలసదారుల దేశం' పేరుతో 1958లో కెన్నడి ఒక వ్యాసం రాశారు. దాన్నే తర్వాత పుస్తకంగానూ ప్రచురించారు. 1961లో కెన్నడి అధ్యక్షుడిగా ఎన్నికకావటానికి ఆ పుస్తకం చాలా తోడ్పడింది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పినా అది చాలా సందర్భాల్లో అమలుకాని ఆదర్శంగానే ఉండిపోయింది. అనేక దేశాల నుంచి వచ్చిన వలసదారుల అనుభవాలనూ, చరిత్రలనూ స్పృశిస్తూ జాక్లిన్ బాక్ హౌస్.. 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇమిగ్రేషన్' పేరుతో రాసిన పుస్తకంలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. అమెరికా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న తొలినాళ్లలో అంటే 1790లో తీసుకొచ్చిన 'నేచరలైజేషన్ యాక్ట్'లోనే వలసలకు కఠిన పరిమితులు విధించారు. పశ్చిమ యూరపు నుంచి వచ్చిన వారికే పౌరసత్వాన్ని ఇచ్చే వీలు కల్పించారు. అందుకే 1840–90 మధ్య వలసదారుల్లో 90 శాతం మంది యూరపు నుంచే వచ్చారు. 1919 వరకూ కూడా ఈ పరిస్థితి అసలు మారలేదు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో వలసలు దాదాపుగా ఆగిపోయాయి.



చరిత్రను విశాల మానవతా దృక్పథంతో చూస్తే అమెరికా నుంచి నేర్చుకునేది ఎంత ఉందో నేర్చుకో తగనిదీ అంతకంటే ఎక్కువే ఉంది. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్ణానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా అమానవీయాలే! అందుకే 'కలలదేశం'లో సామాజిక సమానత్వ ఆదర్శాల అమలూ అసంపూర్ణమే!

అమెరికాకు ఒకవైపున అట్లాంటిక్, మరోవైపున పసిఫిక్ మహా సముద్రాలు ఉన్నాయి. వీటి మధ్య భూభాగాలను కలుపుతూ రైల్వేలైన్లు వేయటం చాలా సంక్లిష్టమైన పని. అరణ్యాలు, ఉధృతంగా ప్రవహించే నదులు, మహాపర్వతాలతో కూడిన ప్రాంతాల్లో పనిచేయటానికి స్థానిక అమెరికన్లు ముందుకురాలేదు. చివరికి చైనా నుంచి వేలాదిమంది కార్మికులను రప్పించి, అతి తక్కువ వేతనాలతో రైల్వేలైన్లను పూర్తిచేశారు. అప్పటికే శాన్‌ఫ్రాన్సిస్కోలో పనుల కోసం వెతుకుతూ ఉన్న చైనీయులనూ రంగంలోకి దించారు. లైను పూర్తయ్యే లోపల వందల చైనా కార్మికులు చనిపోయారు. 90 శాతం మంది చైనా కార్మికులు రైల్వేలైను నిర్మాణంలో పాల్గొంటే అమెరికన్ల సంఖ్య 10 శాతానికి మించలేదు. 1869 మే 10 నాటికి లైను పూర్తయింది. ఆ సందర్భంగా ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించారు. వేడుకల ఫోటోల్లో ఒక్క చైనా కార్మికుడు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతటి చిన్నచూపు, ఏహ్యత ఆనాడు ఉండేవి. ఏళ్లపాటు పనిచేసినందుకు తమకు పౌరసత్వం కల్పించాలని కోరారు. దానికి ససేమిరా అనటమే కాదు మొత్తంగా చైనీయులను అమెరికాలోకి అడుగుపెట్టకుండా 1882లో 'చైనీస్ ఎక్స్‌క్లూజన్ యాక్ట్'ను తీసుకువచ్చారు. 1902లో వాళ్ల పౌరసత్వాలనూ రద్దుచేశారు. కాలిఫోర్నియాలో అయితే 1882 కంటే ముందే చైనీయులకు ఉన్న ఓటుహక్కునూ రద్దుచేశారు. 1917లో మొత్తంగా ఆసియాదేశాల నుంచే ప్రజలు రాకుండా నిషేధం విధించారు. ఆ తర్వాత 1924లో తీసుకువచ్చిన వలసల చట్టం దేశాలు, జాతుల వారీ కోటాలను ప్రవేశపెట్టి ఆంక్షలను మరింతగా పెంచింది. ఇందుకు 1890నాటి అమెరికాలోని జాతుల జనాభా సంఖ్య ఆధారంగా వలసల కోటాను నిర్ణయించారు. అప్పటికే అమెరికాలో ఉన్న ఒక జాతి జనాభాకు 2 శాతానికి మించి ఏ దేశం నుంచి వలసదారులను అనుమతించకుండా చర్యలు ఈ చట్టంలో ప్రతిపాదించారు. ఆసియా ప్రజలకు పూర్తిగా తలుపులు మూసివేశారు. దక్షిణ, తూర్పు యూరపు దేశాల ప్రజలపైనా చాలా నిషేధాలు పెట్టారు. చివరికి అనేక ఒత్తిళ్ల అనంతరం 1965లో తీసుకువచ్చిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్' కోటాల పద్ధతిని ఎత్తివేయటంతోనే ఆసియా వాసులకు అమెరికాలో ప్రవేశం కాస్త సులభమైంది. భారతీయులు కూడా ఈ చట్టం తర్వాతే అమెరికాకు వెళ్లటం మొదలుపెట్టారు. నిజానికి 1965 నాటి చట్టానికి అంతకు ముందు ఏడాది అమల్లోకి తెచ్చిన పౌరహక్కుల చట్టం చాలా తోడ్పడింది. నల్లజాతీయులు సాగించిన మహత్తర పోరాటాలతోనే అది సాధ్యమైంది. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు.



■ రాహుల్ కుమార్

అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021–24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయని చెబుతూ చాలా రచనలు వస్తున్నాయి.

అమెరికా స్వాతంత్ర్య ప్రకటన మనిషి స్వేచ్ఛకూ సంతోషానికీ జీవికకూ పట్టంకడుతూ చాలా ఉదాత్తంగా ఉంటుంది. మనుషులు సమానంగానే పుట్టారనీ, విస్మరించలేని కొన్ని సహజ హక్కులను సృష్టికర్త వారికి కల్పించారనీ అందులో జీవిక హక్కు, స్వేచ్ఛ, సంతోషాన్వేషణ ప్రధానమైనవనీ ఆ ప్రకటన స్పష్టం చేసింది. అమెరికాలోని ఆదిమవాసులనూ ఆఫ్రికా నుంచి బానిసలుగా బలవంతంగా కొనుగోలుచేసి తెచ్చిన లక్షోపలక్షల మందినీ ఆ సహజ హక్కులకు అర్హులుగా చూడలేదు.

**చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. 2022–23లో 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు.**

ఆఫ్రికా నుంచి నల్లజాతి ప్రజలను 16–19 శతాబ్దాల మధ్య కోటిమందిని బానిసలుగా అమెరికాకు తరలించారు. చరిత్రలో ఇంతమందిని ఇలా తరలించటం జరగలేదు. మెక్సికన్లది మరో విషాద చరిత్ర. మెక్సికో, అమెరికా మధ్య 1846–1848లో యుద్ధం జరగక ముందు అరిజోనా, కాలిఫోర్నియా, కలరాడో, నివాడ, ఒక్లహోమ, టెక్సస్, న్యూమెక్సికో, యూటా రాష్ట్రాల్లో చాలా భూభాగాలు మొత్తంగానో, పాక్షికంగానో మెక్సికో కిందే ఉండేవి. ఆ యుద్ధంలో మెక్సికో సగం భూభాగాన్ని కోల్పోయింది. కోల్పోయిన భూభాగాల్లో మెక్సికన్ల ఆస్తులు, ఉపాధికి భంగం కలగకూడదని ఒప్పందం కుదిరినా దాన్ని ఖాతరు చేయలేదు. అప్పటి నుంచీ మెక్సికన్లు కోల్పోయిన భూభాగాల్లో ప్రవేశించటానికి ఎడతెగని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

చరిత్రను విశాల మానవతా దృక్పథంతో చూస్తే అమెరికా నుంచి నేర్చుకునేది ఎంత ఉందో నేర్చుకోతగనిదీ అంతకంటే ఎక్కువే ఉంది. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికి పెద్దపీట వేయాలనే తర్కానికి ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా అమానవీయాలే! అందుకే 'కలలదేశం'లో సామాజిక సమానత్వ ఆదర్శాల అమలూ అసంపూర్ణమే! భిన్నజాతుల ప్రజల మధ్య వివాహాలు 1967 వరకూ చట్టవిరుద్ధమైన చోట అదెంత ఉండి ఉంటుంది?

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

## విశ్వకళ్యాణ సంక్రాంతి లక్ష్మి

శ్రీమకర సంక్రమణ – ఉషఃశ్రీ కిరణ వి
రాజ తేజస్వి – సూర్యనారాయణుండు,
స్వర్ణరథమున విచ్చేయ – భవ్య పుష్య
కాంతులెసగ నేతెంచె – సంక్రాంతి లక్ష్మి!

పచ్చనైన గుమ్మాలన్ని – పచ్చమావి
తోరముల – రంగవల్లులతో కలకల
లాడ, గొబ్బెమ్మ – పూబంతు లలరగాను,
రమ్యగతి వచ్చె – స్వర్ణ సంక్రాంతి లక్ష్మి!

'అన్నదాతా! శుభమస్తు!' – అని – సిరిసం
పదల నొసగెడి – సౌభాగ్యలక్ష్మి!
'జై జవాను!' – యని – విజయాల నుగ్రహించు –
వీరదుర్గాంబ – శ్రీవిజయలక్ష్మి!
విద్యార్థుల – నఖిల విజ్ఞానులుగ తీర్చు –
విశ్వవిద్యా – మహావిభవలక్ష్మి!
సకల ప్రజల – దయాసాంద్రవై బ్రోచు –
అభయదాయిని! కరుణార్ద్రలక్ష్మి!

ధాన్యరాశులు – పూబంతిదండ లెల్ల –
పసిడికాంతుల రాజిల్లి – స్వాగతించ,
తెలుగు వెలుగులు – పుడమిని తేజరిల్ల –
రమ్ము – విశ్వకళ్యాణ సంక్రాంతి లక్ష్మి!

– 'కళ్యాణశ్రీ' జంధ్యాల వేంకటరామశాస్త్రి

## రంగవల్లుల ముంగిలి

రంగు రంగుల ముగ్గులతో ముంగిలి
పుత్తడిబొమ్మలా ముస్తాబైంది
గొబ్బెమ్మల సొబగులతో వీధి మొత్తం
ఇంద్ర ధనువులా కాంతివంతమైంది
బంధువుల రాకతో ఇల్లు మొత్తం
అలంకారపూరితమైంది



సేద్యపు యంత్రాంగం
పూజకు నోచుకుంటూ ఆనందించింది
కొత్త బట్టల కొంగొత్త శోభతో
పండుగ రోజు మిరుమిట్లు గొలిపింది
బసవన్నల రాకతో
గృహప్రాంగణం పావనమై వెలిగింది
హరిదాసుల ఆలాపనలో
మకర సంక్రమణం పులకించిపోయింది

పచ్చని పల్లెపట్టు ప్రకృతి యదపై
హాయిగా ఒదిగిపోయింది
చిరునవ్వుల వెలుగులు మొత్తం
పిల్లల మోములో కళలు పుట్టించింది
కోవెల భక్త బృందాల సందడితో
భక్తిగీతాలాపనతో మైమరచిపోయింది
ఐనవారి ఆగమనంలో
ఆనందం గాలిపటమై పైపైకెగసింది

– నరెడ్డుల రాజారెడ్డి

## లాస్యహేల


సీ. హరినామస్మరణలో పరుగులు పెట్టేటి
హరిదాసు దీవెనల్ హంగు గూర్చ!
డూడూల బసవన్న డోలు సన్నాయితో
రంగవల్లుల వీధి రంజిలంగ!
ప్రొద్దుట సూరీడు పూలబాలలపైని
తుహినపు ముత్యాల రహిని గూర్చ!
అరిసెల కతనాన అమ్మలక్కలు జేయు
వరువాత రోకళ్ళ వాద్యఘోష!

తే. సస్య సిరులతో కర్షక లాస్యహేల
గొబ్బిపాటల వనితల కూజితాల
కొత్త అల్లుళ్ళ సందళ్ళు కూర్పువేళ
అరుగుదెంచెడి సంక్రాంతి స్వాగతమ్ము!

– మోదుకూరు రాధాకృష్ణశర్మ

## అనుబంధాల పండగ

అరిసెల వంటల ఘుమఘుమలు
గరిసెల ధాన్యపు గలగలలు
విరిసిన బంతుల కళ కళలు
కలిసిన నేస్తపు గుసగుసలు
వాడలు చేరిన వలస పక్షులు
వీడని వాడని పాత గురుతులు
గోరంతలయ్యే చిరుబురులు
కొండంత నవ్వుల పెళపెళలు
గంగిరెద్దు మెడగంటల గణగణలు
ఊరి గుడిలో మంత్ర ధ్వనులు
వీధివీధినా రంగుల ముగ్గులు
రేపగలూ పిల్లల గంతులు



తెలుగువారి సంబరాల సంక్రాంతి
అందమైన అనుబంధాలను
మరవనివ్వని వెలుగు జ్యోతి

– డి.వి.జి. శంకరరావు

# రాహుల్‌పై 'అర్బన్ నక్సల్' అస్త్రం!

పార్లమెంటు శీతాకాల సమావేశాలలో రాజ్యాంగంపై చర్చ ఒక వికృతమైన కలహంగా మారింది. పాలక, ప్రతిపక్ష సభ్యుల జరిగిన పొట్లాటలో కొంత మంది ఎంపీలు శారీరకంగా గాయపడ్డారు. ఈ శోచనీయ పరిణామానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీయే కారణమని పాలక పక్ష ఎంపీలు తీవ్రంగా ఆరోపించారు. సభలో చోటుచేసుకున్న ఈ ద్వంద్వ యుద్ధాన్ని 2001లో పార్లమెంటుపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద బృందాల దాడిగా బీజేపీ ఎంపీ ఒకరు అభివర్ణించారు! ప్రతిపక్ష సభ్యులు 'అర్బన్ నక్సల్స్'గా సభలోకి ప్రవేశించారని కూడా ఆ ఎంపీ ఆరోపించారు.

రాహుల్‌గాంధీని ఒక 'అర్బన్ నక్సల్'గా చిత్రించే ప్రయత్నాలు గత కొంత కాలంగా జరుగుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు డాక్టర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, సామాజిక న్యాయం, కుల గణన, జాతీయ సంపద పునః పంపిణీ తదితర అంశాలపై రాహుల్ ఉపన్యాసాలను 'నక్సలైట్ అజెండా'గా పాలక పక్షం పదే పదే అభివర్ణించింది. ఇటీవలి శాసనసభ ఎన్నికల సందర్భంగా కూడా రాహుల్‌పై అటువంటి విమర్శలనే తీవ్రంగా గుప్పించారు. మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికలలో విజయం సాధించడం బీజేపీకి తప్పనిసరి అయింది. ఆ అనివార్యతకు రాజకీయ, ఆర్థిక కారణాలు రెండూ ఉన్నాయి. అవి: సార్వత్రిక ఎన్నికలలో కోల్పోయిన సీట్లను మళ్లీ స్వాయత్తం చేసుకోవడం; ముంబై, గుర్గావ్ ఆర్థిక వ్యవస్థలపై నియంత్రణ సాధించడం.

2004లో రాహుల్‌గాంధీ రాజకీయాలలోకి ప్రవేశించిన నాటి నుంచి ఆయనను రాజకీయంగా అంతమొందించడానికి బీజేపీ నాయకులు శతథా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అప్పట్లో ఆయన్ను 'పప్పు' అని అపహసిస్తుండేవారు. ఆయనొక అపరిణత యువకుడు అని, పరిణత నాయకుడుగా ఎట్టి పరిస్థితులలోను ఎదగలేరని వారు తరచు ఎద్దేవా చేస్తుండేవారు. రాహుల్ గురించిన ఈ కథనాన్ని బీజేపీ, దాని మాతృసంస్థ, సోదర సంస్థలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో విజయవంతమయ్యాయి. ఆ ప్రచారం ఎంత ప్రభావశీలంగా ఉన్నదంటే కాంగ్రెస్ పార్టీ ద్వితీయ స్థాయి నాయకులు సైతం దానిని దాదాపుగా విశ్వసించడం జరిగింది!

భారత్ జోడో యాత్ర (కన్యాకుమారి నుంచి శ్రీనగర్ దాకా), న్యాయ్ యాత్ర (మణిపూర్ నుంచి ముంబై దాకా) నిర్వహించేందుకు రాహుల్ నిర్ణయించుకోవడం పలువురిని విస్మయ పరిచింది. అదొక సాహసోపేత నిర్ణయం, సందేహం లేదు. ఆ యాత్రలలో రాహుల్ దేశ వ్యాప్తంగా పర్యటించడంతో పాటు ప్రజలను విస్తృతంగా కలుసుకున్నారు. వారితో సంభాషించారు. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కూలంకషంగా తెలుసుకున్నారు. దీనితో పాటు మీడియా ప్రతినిధులు, మేధావి వర్గాలతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఈ ఉభయ యాత్రలతో అశేష ప్రజలకు రాహుల్ సన్నిహితమయ్యారు. ఈ పరిణామం అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నాయకులు ఇరువురినీ అమితంగా విస్మయపరిచింది. న్యాయ్ యాత్రతో తన ప్రజాకర్షణ శక్తిని రాహుల్ ఇతోధికంగా పెంచుకున్నారు.

**కాంగ్రెస్ మనుగడకు ఆలంబన గాంధీ కుటుంబ నాయకత్వమన్న వాస్తవం బీజేపీకి బాగా తెలుసు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబ నాయకత్వం లేకుండా చేస్తే ఆ పార్టీని ఉనికిలో లేకుండా రూపుమాపడం సులువవుతుందని బీజేపీ విశ్వసిస్తోంది. బీజేపీ దాడుల నుంచి రాహుల్‌ను రక్షించగల స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదా?**



రాహుల్‌లో వచ్చిన ఈ పరివర్తన బీజేపీని ఎందుకు కలవరపరిచింది? కాంగ్రెస్‌ను తన ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ పరిగణిస్తోంది. న్యూఢిల్లీలో అధికారానికి తనతో పోటీపడగల సమఉజ్జీ అని కూడా భావిస్తోంది. కాంగ్రెస్ అఖిల భారత రాజకీయ పక్షమని, ఆసేతు హిమాచలం ఆ పార్టీకి సంస్థాగత బలం ఉన్నదని బీజేపీకి బాగా తెలుసు. ఏ ప్రాంతీయ పార్టీ కూడా కాంగ్రెస్ మాదిరిగా తనతో పోటీకి రాలేదన్నది బీజేపీ భరోసా. కాంగ్రెస్ మనుగడకు ఆలంబన గాంధీ కుటుంబ నాయకత్వమన్న వాస్తవం కూడా బీజేపీకి బాగా తెలుసు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబ నాయకత్వం లేకుండా చేస్తే ఆ పార్టీని ఉనికిలో లేకుండా రూపుమాపడం సులువవుతుందని బీజేపీ విశ్వసిస్తోంది. గాంధీల వలే దేశవ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకోగల నాయకులు మరెవ్వరూ కాంగ్రెస్‌కు లేరు అన్నది బీజేపీ సునిశ్చిత భావన. గాంధీ కుటుంబేతర వ్యక్తులు ఎవరినీ జాతీయ స్థాయిలో నాయకులుగా రూపొందించుకోలేకపోవడం కాంగ్రెస్ పార్టీ స్వతస్సిద్ధ బలహీనత. కాంగ్రెస్ జాతీయ నాయకత్వంలో గాంధీ కుటుంబాన్ని లేకుండా చేసినప్పుడు మాత్రమే బీజేపీ తిరుగులేని సంపూర్ణ జాతీయ పార్టీగా ఆవిర్భవించగలదు.

కాంగ్రెస్ ప్రాభవ ప్రాబల్యాలను పూర్తిగా అణచివేయడం బీజేపీకి అనివార్యమయింది. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నంతవరకు ప్రాంతీయ పార్టీలను తనకు అనుకూల పరచుకోవడంలో సఫలమయింది. బీజేపీని సైద్ధాంతికంగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు చాలా చాలా తక్కువ. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇండియా కూటమిలోని అనేక పార్టీలు సైతం తమకుతాముగా కాంగ్రెస్‌కు దూరం జరుగుతున్నాయి. ఎన్నికలలో పరాజయాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని అవి గట్టిగా విశ్వసించడం వల్లే ఇండియా కూటమి విచ్ఛిన్నమయిపోయే దుస్థితి దాపురిల్లింది. అయినప్పటికీ గత వేసవిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ ఒక ప్రధాన శక్తిగా ప్రభవించడం బీజేపీని గందరగోళ పరుస్తోంది. ముఖ్యంగా ఆయన ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయం, సంపద పునఃపంపిణీ అజెండాలకు సమాజంలోని అట్టడుగు వర్గాల వారి నుంచి అపురూపమైన ప్రతిస్పందన లభిస్తోంది. ఇది బీజేపీని వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో అస్థిరత్వం పాలు చేసే ప్రమాదం ఎంతైనా ఉన్నది. ఈ వాస్తవాన్ని గుర్తించిన బీజేపీ రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా 'అర్బన్ నక్సల్' కథనాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఆయన నాయకత్వాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తోంది.

బీజేపీ కుటిల దాడుల నుంచి రాహుల్‌ను రక్షించగల స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదా? కాంగ్రెస్ నాయకులలో ఎంత మంది రాహుల్ ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయ, సంపద పునః పంపిణీ లక్ష్యాలకు నిబద్ధమై ఉన్నారు? కాంగ్రెస్ పార్టీని జాతీయ కార్యనిర్వాహక వర్గం స్థాయి నుంచి గ్రామ కమిటీల వరకు సామాజిక న్యాయం ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించని పక్షంలో పై ప్రశ్నలకు సరైన సమాధానాలు రావుగాక రావు. ఎందుకని? చాలా మంది కాంగ్రెస్ నాయకుల సామాజిక న్యాయసాధన లక్ష్య స్ఫూర్తి పూర్తిగా సందేహాస్పదమైనది. ఆ పార్టీ ద్వితీయ స్థాయి నాయకులలో అత్యధికులు కరడుగట్టిన మితవాదులు లేదా కులీన వర్గాలకు చెందినవారే. రాహుల్ గాంధీ భావాలు, ఆదర్శాలను వారు విశ్వసిస్తున్నారని చెప్పగల పరిస్థితి ఏ మాత్రం లేదు. నిజానికి రాహుల్ నిర్వహించిన భారత్ జోడో, న్యాయ్ యాత్రలు దేశ వ్యాప్తంగా ప్రజలను ఎంతగానో ఉత్తేజపరిచాయి. ప్రజాభిప్రాయం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారినప్పటికీ ఆ సానుకూలతను ఓట్లుగా మార్చుకోవడంలో రాష్ట్ర స్థాయిలోని ద్వితీయ స్థాయి నాయకులు ఘోరంగా విఫలమయ్యారు.

ఇటీవలి సంవత్సరాలలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకొంటోంది. గతంలో కాంగ్రెస్ పట్ల బద్ధ వ్యతిరేకత చూపినవారు సైతం ఇప్పుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాంగ్రెస్‌కు మద్దతునిస్తున్నారు. అయితే కాంగ్రెస్ వారిని విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. దేశ రాజకీయాలలో మళ్లీ అగ్రగామి శక్తిగా ఆవిర్భవించాలంటే అటువంటి ఉపేక్షా ధోరణులను కాంగ్రెస్ తక్షణమే విడనాడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. పార్టీ పనితీరులో ఒక మౌలిక మార్పు అవశ్యం వచ్చి తీరాలి. రాహుల్ నాయకత్వంపై బీజేపీ దాడులను తన మిత్రపక్షాలు ఏవీ ఖండించకపోవడం కాంగ్రెస్‌ను ఎంతైనా కలవరపెడుతోంది పైగా బీజేపీ వలే అవి కూడా రాహుల్ నాయత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఈ ధోరణులు బాగా ప్రబలిపోతున్నాయి.

ఈ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ ముందున్న ప్రత్యామ్నాయం బీజేపీకి వ్యతిరేకంగా ఒంటరిగా పోరాడటమే, తప్పదు. అయితే కాంగ్రెస్ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అది అసాధ్యం. దేశ రాజకీయాలు అంతకంతకూ భావజాల పోరాటంగా పరిణమిస్తున్నాయన్న వాస్తవం విస్మరించరానిది. సమస్యేమిటంటే కాంగ్రెస్ శ్రేణులు తమ నాయకుడిని అనుసరించలేకపోతున్నాయి. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన సాహసోపేతంగా నిర్దేశిస్తున్న అజెండాలను అర్థం చేసుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ శ్రేణుల ఉదాసీన వైఖరులను రాహుల్ మార్చగలరా? తన భావాలు, భావజాలాన్ని సమాజంలోని అట్టడుగు స్థాయి వర్గాలకి తెలియజేసి వారితో సహా దేశ ప్రజలనందరినీ ఉత్తేజపరిచేందుకు వాటికి మనసా వాచా కర్మణా నిబద్ధమయి, అంకితభావంతో కృషి చేసే కొత్త తరం కార్యకర్తలు, నాయకుల అవసరం రాహుల్‌కు విశేషంగా ఉన్నది.

■ ప్రొఫెసర్ భంగ్యా భూక్యా
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు సైతం..
- రేపు ఏఐసీసీ కార్యాలయం ప్రారంభానికి హాజరు
- 16న అటు నుంచే సింగపూర్‌కు కుటుంబంతో రేవంత్

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నారు. కుటుంబ సమేతంగా వెళుతున్న ఆయన.. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు జరిగే ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. సీఎంతో పాటుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఇతర ముఖ్య నాయకులూ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలోనే అందరూ మంగళవారం సాయంత్రమే ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నారు. బుధ, గురువారాల్లో ఢిల్లీలోనే ఉంటున్న సీఎం రేవంత్.. కేంద్ర మంత్రులను కలిసి వివిధ అభివృద్ధి పనులకు నిధులను కోరనున్నారు. కేంద్రమంత్రులను కలిసేటప్పుడు ఆయా శాఖల మంత్రులూ సీఎం వెంట ఉంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రానికి చెందిన ముఖ్య నాయకులంతా బుధ, గురు వారాల్లో ఢిల్లీలోనే ఉంటున్న నేపథ్యంలో అధిష్ఠానం పెద్దలనూ కలిసి మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపైనా చర్చించేందుకు అవకాశముందని వెల్లడించాయి. అనంతరం గురువారం (ఈ నెల 16వ తేదీ) రాత్రి.. కుటుంబ సమేతంగా సీఎం సింగపూర్‌కు బయలుదేరి వెళ్తారు. ఆయన అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించనున్నారు. కాగా, దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ నివాళులర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీకి అవకాశం ఇవ్వండి

- టీపీసీసీ చీఫ్‌కు ఎమిగోస్ విద్యాసంస్థల అధినేత వినతి

నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను ఎమిగోస్ విద్యాసంస్థల అధినేత మూస్కు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు గాంధీభవన్‌లో సోమవారం మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ఆయన వినతిపత్రం ఇచ్చారు.

## పీఎంఏవై నిధులు ఇందిరమ్మ ఇళ్లకా?

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ డీకే అరుణ సూటిప్రశ్న

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద కేంద్రం ఇస్తున్న నిధులను ఇందిరమ్మ ఇళ్లకు ఎలా కేటాయిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. పేదల ఇళ్లకు మోదీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం తమవిగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కమిటీల్లో అన్ని పార్టీలకు భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులివ్వాలని డీకే అరుణ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలి

- మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలి: కవిత

మన పండుగలు, సంస్కృతిని యథాతథంగా భవిష్యత్ తరాలకు అందించాలని, హైదరాబాద్ నడిబొడ్డున పల్లెవాతావరణాన్ని సృష్టించి, భోగి వేడుకలు నిర్వహించడం హర్షణీయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం కేబీఆర్ పార్కులో నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గంగిరెద్దుల ఆటలు అందరినీ అలరించాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న కవిత.. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగలో.. భోగి అంటేనే ప్రతికూలతను వదిలిపెట్టి నూతనోత్సాహంతో ముందుకు వెళ్లడమని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రజలు కొత్త ఉత్సాహంతో ముందడుగు వేయాలని కవిత పిలుపునిచ్చారు.

# కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల జారీ

- మార్గదర్శకాలను ఖరారు చేసిన సర్కారు
- క్షేత్రస్థాయి పరిశీలనకు ముసాయిదా
- గ్రామసభలో ప్రదర్శించిన తర్వాత ఆమోదం
- సభ్యుల మార్పులు, చేర్పులకు అవకాశం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వినతులను పరిష్కరించేందుకు విధివిధానాలను ఖరారు చేసింది. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. ఈనెల 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మంత్రి వర్గం ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ముసాయిదా జాబితాను పంపించి.. గ్రామసభలు, మునిసిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో జాబితా ప్రదర్శించిన తర్వాత ఆమోదించనుంది. ఈ మేరకు పౌర సరఫరాలశాఖ కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక్క రేషన్ కార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రేషన్ కార్డులో సభ్యుల మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం కల్పించారు.

### కొత్త రేషన్ కార్డుల జారీకి విధి విధానాలు..

- కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలనకు పంపిస్తారు.
- ముసాయిదా జాబితాను గ్రామసభ, మున్సిపాలిటీ వార్డుల్లో ప్రదర్శించి, చదివి వినిపించి, చర్చించిన తర్వాత ఆమోదిస్తారు.
- మండల స్థాయిలో ఎంపీడీవో, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కమిషనర్లు ఈ ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారు.
- జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్‌వో (జిల్లా పౌరసరఫరాల అధికారి) పర్యవేక్షకులుగా ఉంటారు.
- గ్రామ, వార్డు సభల్లో ఆమోదించిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల/మునిసిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపాలి.
- పంపిన జాబితాను జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే పౌరసరఫరాలశాఖ కమిషనర్ లాగిన్‌కు పంపించాలి.
- ఈ తుది జాబితా ప్రకారం పౌరసరఫరాలశాఖ కమిషనర్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు.

## అనర్హులకు పథకాలు అందితే

# అధికారులదే బాధ్యత

**లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లోనే.. జాబితాను కూడా అక్కడే ప్రకటించాలి**

- ఉపాధి కార్డు ఉండి ఏడాదిలో 20రోజులు పనిచేస్తే ఆత్మీయ భరోసా
- 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా: భట్టి



ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి

ఖమ్మం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అనర్హులను ఎంపిక చేస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఇందులో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లోనే ప్రకటించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను జిల్లా మంత్రితో ఆమోదింపజేసుకొని, మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారుల వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్‌లతో కలిసి భట్టి విక్రమార్క.. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించబోయే సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ జాబ్‌కార్డ్ ఉండి, భూమి లేని వ్యవసాయ కుటుంబాలు ఏడాదిలో 20రోజులు ఉపాధి హామీ పని చేసి ఉంటే.. వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12వేలు అందజేస్తామన్నారు. జనవరి 26 నుంచి కొత్తరేషన్ కార్డులను అందజేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకాలకు రూ.45వేల కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

### ఈ ఏడాది 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అధికారులు వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఎక్కడా పెట్టుబడి సాయం చేరకుండా చూడాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడికి రైతు భరోసా అందాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు ఏటా రూ.12వేల ఆర్థిక సహాయాన్ని 'రైతు భరోసా' కింద అందించనున్నామని, పంట వేసినా, వేయకపోయినా ఈ భూములకు రైతుభరోసా అందుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది 4.50లక్షల ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే నాలుగేళ్లలో మొత్తం 20లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో సిఫార్సులకు, ప్రలోభాలకు లొంగవద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా క్రమశిక్షణ పాటిస్తూ.. ఇచ్చిన హామీ మేరకు మొదటి ఏడాదిలోనే 4.50లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3,500 ఇళ్లకు తగ్గకుండా మంజూరు చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గ్రీన్‌ఛానల్ ద్వారా పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లిస్తామన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ఎంపీ రఘురాం రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి మంత్రి ప్రారంభించారు. మరోవైపు, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో రూ.66.33 కోట్లతో చేపట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకానికి తుమ్మల, పొంగులేటి. ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి భట్టి విక్రమార్క సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. జిల్లాల విభజన తర్వాత పరిశ్రమలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లావైపు వెళ్లాయని, అందువల్లే ఖమ్మం జిల్లాలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ఉగాది నాటికి పూర్తిచేసి రైతులకు నీరివ్వాలన్నదే తన లక్ష్యమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

### ఒక్కొక్కరికి 6కిలోల సన్నబియ్యం

రేషన్ కార్డులో పేర్లున్న ఒక్కొక్కరికీ 6కిలోల సన్నబియ్యాన్ని ఇవ్వనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు రూ.12వేల కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ అంశంలో అధికారులు మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు సమాచార సేకరణ చాలా కీలకమని, అధికారులు వివరాలు సరిగ్గా నమోదు చేస్తేనే ఈ కార్యక్రమాలు విజయవంతమవుతాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న బ్యాంకుల్లో గిరిజనేతరులకు రుణాలు కూడా అందడం లేదని, దీనిని పరిష్కరించాలని ఎంపీ బలరాం నాయక్ కోరారు.


మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## పెట్టుబడంటే తెలంగాణే

(మొదటిపేజీ తరువాయి)

నిలబెట్టాయి. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది దావోస్ డబ్ల్యూఈఎఫ్‌లో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికారులు సీఎంకు ఆయా ప్రాజెక్టుల పురోగతిపై వివరణ ఇచ్చారు. 14 ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబుతో ఆయా కంపెనీల వారీగా పురోగతిని సీఎం చర్చించారు.

### విదేశాల్లో సుడిగాలి పర్యటనలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్ బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.

# విద్యుత్తు చార్జీలు యథాతథం

**ప్రస్తుత చార్జీలే 2025-26లోనూ కొనసాగింపు.. పెంపునకు అనుమతి కోరిన డిస్కమ్‌లు**

- పెంపు వద్దంటూ ప్రభుత్వం తిరస్కరణ
- వారంలో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు
- ఇప్పటికే రూ.57,448 కోట్ల నష్టాలు
- ప్రభుత్వం సబ్సిడీ ఇస్తేనే గట్టెక్కే అవకాశం



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విద్యుత్తు వినియోగదారులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా విద్యుత్తు చార్జీలు పెంచరాదని నిర్ణయించింది. చార్జీల పెంపునకు ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) అనుమతి కోరగా.. ప్రభుత్వం తిరస్కరించింది. ప్రస్తుత విద్యుత్తు చార్జీలనే 2025-26లోనూ యథాతథంగా కొనసాగించాలని ఆదేశించింది. విద్యుత్తు చార్జీల పెంపును ప్రతిపాదించకుండానే 2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సమర్పించేందుకు డిస్కమ్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో ప్రస్తుత విద్యుత్తు చార్జీలనే 2025-26లో కొనసాగించాలని ప్రతిపాదిస్తూ వారంరోజుల్లో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పిస్తామని డిస్కమ్‌ల వర్గాలు తెలిపాయి. విద్యుత్తు టారిఫ్ రెగ్యులేషన్స్ ప్రకారం.. ప్రతి ఏటా నవంబరు 30లోగా తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్తు టారిఫ్, ఏఆర్ఆర్ ప్రతిపాదనలను డిస్కమ్‌లు ఈఆర్సీకి సమర్పించాలి. ఈ మేరకు 2024-25కు సంబంధించి విద్యుత్తు చార్జీల పెంపునకు ప్రతిపాదనలను డిస్కమ్‌లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సిద్ధం చేశాయి. అయితే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో గడువు పొడిగింపు పొందాయి.

### రూ.57,448 కోట్ల నష్టాల్లో డిస్కమ్‌లు..

ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లు గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రూ.6299.29 కోట్ల కొత్త నష్టాలను మూటగట్టుకోగా, అంతకుముందున్న నష్టాలతో కలిపి వాటి మొత్తం నష్టాలు రూ.57,448 కోట్లకు చేరాయి. ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లకు చేరగా, టీజీఎన్పీడీసీఎల్ రూ.17,756 కోట్ల నష్టాల్లో ఉంది. విద్యుత్తు శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా ఆ శాఖపై నిర్వహించిన సమీక్షలో డిస్కమ్‌ల అధికారులు ఈ విషయాలను వారికి వివరించి.. విద్యుత్తు చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు తెలిపారు. గృహావసరాలను మినహాయించి పారిశ్రామిక, ఇతర వాణిజ్య కేటగిరీల విద్యుత్తు చార్జీల పెంపునకు అనుమతించాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్తు చార్జీల పెంపు జోలికి వెళ్లవద్దని సీఎం, డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చార్జీలనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొనసాగిస్తామని పేర్కొంటూ ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాలని సీఎం ఆదేశించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఈ నెల 18న ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించే అవకాశముంది.

### డిస్కమ్‌లకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తేనే..

ప్రస్తుత విద్యుత్తు చార్జీలతోనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు సరఫరా చేస్తే.. డిస్కమ్‌లకు కొత్తగా వచ్చే నష్టాలను అంచనా వేసి.. ఈఆర్సీకి సమర్పించే ప్రతిపాదనల్లో ఆర్థిక లోటుగా ఆ సంస్థలు చూపించనున్నాయి. వీటిని ఈఆర్సీ పరిశీలించి ఆమోదించిన నష్టాల మొత్తాన్ని డిస్కమ్‌లకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తేనే విద్యుత్తు చార్జీల పెంపు భారం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఇంతకు ముందు 2024 నవంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రాష్ట్రంలో రూ.1,200 కోట్ల విద్యుత్తు చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ డిస్కమ్‌లు ప్రతిపాదనలు సమర్పించాయి. ఈఆర్సీ ఇందుకు అనుమతించకపోవడంతో చార్జీల పెంపు భారం నుంచి ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు సబ్సిడీలను రూ.11,499 కోట్లకు పెంచేందుకు అంగీకరించడంతో ఇది సాధ్యమైంది.

# నేడు నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రారంభోత్సవం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్
- బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి
- ప్రధాని మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు: కిషన్ రెడ్డి
- పసుపు బోర్డు ఏర్పాటులో రాష్ట్ర సర్కారు పాత్ర కీలకం: తుమ్మల



న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు మంగళవారం ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటలకు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం కేంద్రం ఓ ప్రకటన చేసింది. అలాగే జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, పల్లె గంగారెడ్డి, అధికారులు, రైతులు పాల్గొననున్నారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సంక్రాంతి కానుకగా కేంద్రం పసుపు బోర్డుని తెలుగు రాష్ట్రాలకే కాదు యావద్దేశానికి అందిస్తోందన్నారు. సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని వ్యాఖ్యానించారు. పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రధాని మోదీ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల తరఫున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానిది క్రియాశీలక పాత్ర అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పసుపు రైతుల చిరకాల వాంఛను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజా ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఒకేవైపు 40 అడుగులు


- కేబీఆర్ పార్కు చుట్టూ ఆస్తుల సేకరణ
- రహదారి విస్తరణకు ఆస్తుల మార్కింగ్
- మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా నిర్ణయం
- జాతీయ పార్కు కావడమే కారణం
- ఎన్‌జీటీ కేసులతో నిలిచిన ప్రాజెక్టులు
- ఆ ఇబ్బంది లేకుండా బల్దియా నిర్ణయం
- యజమానులను ఒప్పించేందుకు యత్నం

హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోని ప్రఖ్యాత కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు చుట్టూ రహదారికి ఒకవైపు ఆస్తులు సేకరించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. జాతీయ ఉద్యానవనం కావడంతో పార్కు వైపు స్థల సేకరణకు పర్యావరణ నిబంధనలు అవరోధంగా మారే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఒకవైపు 40 అడుగుల మేర సేకరణ కోసం మార్కింగ్ చేశారు. దీంతో భవనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది సాంకేతికంగా, న్యాయపరంగా అవరోధంగా మారుతుందని అధికారులూ పునరాలోచనలో పడ్డారు. ఈ క్రమంలోనే ఉన్నత స్థాయి ఆదేశాలతో వంతెనలు, అండర్‌పాస్‌ల కోసం ప్రకటించిన టెండర్ నోటిఫికేషన్‌ను జీహెచ్ఎంసీ రద్దు చేసింది. ఆస్తుల సేకరణపై స్పష్టత వచ్చాకే ముందుకెళ్లాలని భావిస్తున్నారు. హైదరాబాద్ సిటీ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా కేబీఆర్ చుట్టూ ఆరు కూడళ్లలో రూ.1090 కోట్లతో వంతెనలు, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. బంజారాహిల్స్ విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్ కూడలి వరకు రహదారి విస్తరణ సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) పట్టణ ప్రణాళికా విభాగం సిద్ధం చేసింది. 303 ఆస్తుల సేకరణకు మార్క్ చేశారు. విరించి నుంచి మహారాజ అగ్రసేన్ కూడలి వరకు 60 అడుగులుగా ఉన్న రోడ్డును 100 అడుగులకు విస్తరించనున్నారు. రోడ్డుకు ఒక్కోవైపు 20 అడుగుల చొప్పున ఆస్తులు సేకరణకు మార్కింగ్ పూర్తయింది. అగ్రసేన్ కూడలి నుంచి జూబ్లీ చౌరస్తా వరకు 80 అడుగుల రోడ్డు ఉండగా.. 120 అడుగులకు విస్తరించాల్సి ఉంది. వాస్తవంగా రహదారి విస్తరణకు ఇరువైపులా ఆస్తులు సేకరిస్తారు. ఇక్కడ ఒక వైపు మాత్రమే మార్కింగ్ చేశారు. కాగా, బీఆర్ఎస్ సర్కారు హయాంలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు నిర్ణయించగా.. జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)లో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టులు నిలిచిపోయాయి. కేసులు విచారణలో ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రాజెక్టును ఇబ్బందులు లేకుండా చేపట్టేందుకు ఒకవైపు ఆస్తుల సేకరణకు నిర్ణయించినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జూబ్లీ చెక్‌పోస్ట్ నుంచి కేబీఆర్ ప్రవేశ ద్వారం, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా, అగ్రసేన్ చౌరస్తా వరకు డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంది. ఇక్కడా 120 అడుగుల మేర విస్తరణ చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం వర్గాలు చెబుతున్నాయి.

# పునరుత్పాదక విద్యుత్‌కు పెద్ద పీట

- సౌర, పవన, పంప్డ్, వేస్ట్ టు ఎనర్జీ తదితర ప్లాంట్లు ఏర్పాటు చేసే వారికి భారీ ప్రోత్సాహకాలు
- 50 ఉద్యోగాలిస్తే.. రూ.5 లక్షలు నియామక సాయం
- తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లో స్పష్టం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు తెలంగాణ సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సౌర, పవన, డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టులు, జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ వంటి పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను నెలకొల్పే వారికి భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలను అందించాలని నిర్ణయించింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన పరికరాలు, యంత్రాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికీ ఈ ప్రోత్సాకాలను ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025'ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి తాజాగా ఆవిష్కరించారు. ఈ పాలసీని అమల్లోకి తెస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు సైతం జారీ చేశారు. రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యం(కాంట్రాక్టెడ్ కెపాసిటీ) ప్రస్తుతం 10,338.20 మెగావాట్లు ఉండగా 2029-30 నాటికి 31,537 మెగావాట్లకు.. 2034-35 నాటికి 50,063 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. పదేళ్లపాటు ఈ పాలసీ అమల్లో ఉంటుంది.



### భారీగా ప్రోత్సాహకాలు..

పాలసీలో భాగంగా డిస్కంలు టారిఫ్ ఆధారిత కాంపిటేటివ్ బిడ్డింగ్ ద్వారా ఈ విద్యుత్ కేంద్రాల నుంచి కరెంటు కొనుగోలుకు బిడ్లను ఆహ్వానించనున్నాయి. బిడ్డింగ్‌లో గెలిచిన సంస్థకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుగా నిర్ణయించి భూములను కేటాయిస్తారు. డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ అమ్ముకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్లు లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి సర్కారు స్థలాలను కేటాయిస్తుంది. నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు టీజీ-ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తుంది. భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లిస్తుంది. ఆయా ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను సర్కారు అందిస్తుంది. వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీ తిరిగి చెల్లిస్తుంది. సౌర, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ, ఇతర ప్రాజెక్టులకు 50 శాతం రాష్ట్ర జీఎస్టీ తిరిగి చెల్లింపు ఉంటుంది. అలాగే, సౌర, పవన విద్యుత్ కేంద్రాల పరికరాల తయారీ పరిశ్రమలు స్థాపిస్తే మూలధన పెట్టుబడిలో 25 శాతం.. బ్యాటరీల తయారీ పరిశ్రమలు స్థాపిస్తే 20శాతం పెట్టుబడి రాయితీని.. రూ.30కోట్ల గరిష్ఠ పరిమితికి లోబడి 5 ఏళ్లలో ప్రభుత్వం ఇవ్వనుంది. పరికరాలు, యంత్రాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి రెండేళ్లలో 50 మంది తెలంగాణ స్థానికులకు ఉద్యోగాలిస్తే రూ.5 లక్షలను రిక్రూట్‌మెంట్ సహాయంగా అందజేయనుంది. ఉత్పత్తులపై ఏడేళ్ల పాటు 100శాతం రాష్ట్ర జీఎస్టీని రీయింబర్స్ చేయనుంది. తెలంగాణ జెన్‌కో, డిస్కంలలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వినూత్న ఆలోచనలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రూ.50 కోట్ల ఇంక్యుబేషన్ ఫండ్‌ను ప్రభుత్వం సృష్టించనుంది.

# కిషన్‌రెడ్డి ఇంట సంక్రాంతి.. మోదీ, చిరు సందడి

- మెగాస్టార్‌కు ప్రధాని ప్రాధాన్యం
- ఆద్యంతం చిరంజీవిని తనవెంటే తిప్పుకొన్న మోదీ
- భోగి మంటలు వెలిగించి,సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధికార నివాసంలో సంక్రాంతి సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. కార్యక్రమంలో సినీ నటుడు చిరంజీవి పాల్గొనడం విశేషమైతే, కార్యక్రమం ఆద్యంతం ఆయనకు మోదీ ప్రాధాన్యమివ్వడం మరీ విశేషం! భోగి సందర్భంగా సోమవారం సాయంత్రం తమ నివాసానికి వచ్చిన మోదీకి చిరంజీవితో కలిసి కిషన్‌రెడ్డి దంపతులు స్వాగతం పలికారు. లోపలికి అడుగుపెట్టిన మోదీ, తొలుత చిరంజీవితో కరచాలనం చేశారు. వేడుకల్లో భాగంగా భోగిమంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, వేదికపైన జ్యోతి ప్రకాశనం, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ.. ఇలా ప్రతిదశలోనూ చిరంజీవిని మోదీ తనవెంట తిప్పుకొన్నారు. సంబురాల్లో భాగంగా మోదీ, మంత్రోచ్చారణల మధ్య భోగి మంటలను వెలిగించారు. గంగిరెద్దులకు అరటిపండ్లు తినిపించి, నూతన వస్త్రాలు కప్పారు. అనంతరం వేదికపైకి చేరుకున్న మోదీ, జ్యోతి వెలిగించి లాంఛనంగా సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ప్రధానితో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, చిరంజీవి, కిషన్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వేదికపైకి చేరుకుని జ్యోతి ప్రకాశన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ప్రధానికి శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేశారు. అనంతరం ప్రముఖ గాయని సునీత తన పాటలతో అలరించారు. సంక్రాంతి సంప్రదాయాలను, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీపికా రెడ్డి బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. సంక్రాంతి వేడుకల్లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్, గజేంద్ర సింగ్ షెకావత్, ధర్మేంద్ర ప్రధాన్, జ్యోతిరాదిత్య సింధియా, బండి సంజయ్, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస వర్మతో పాటు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ తెలంగాణ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, గోడం నగేశ్, రఘునందన్‌రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మణ్, బీజేపీ ఎంపీలు అనురాగ్ సింగ్ ఠాకూర్, అరుణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. పీవీ సింధూ తన భర్తతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. కాగా.. సంక్రాంతి వేడుకల్లో భాగంగా పవిత్రమైన భోగి రోజున ప్రధాని నరేంద్ర మోదీకి ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సంక్రాంతి విశిష్టతను తెలియజేస్తూ జరిగిన వేడుకలో మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారని వెల్లడించారు.


చిరంజీవితో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

### కిషన్‌రెడ్డి ఇంట్లో అద్భుత కార్యక్రమం: మోదీ

"దేశమంతటా ప్రజలు సంక్రాంతిని, పొంగల్‌ను ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారు. ఇది మన సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయాల్లో అంతర్భాగమైన వేడుక" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రజలకు మంచి ఆరోగ్యం, ఆనందమయ జీవనం లభించాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఆయన ఎక్స్ వేదికగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా తన మంత్రివర్గ సహచరుడు కిషన్ రెడ్డి ఇంట్లో అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించినట్లు మోదీ తెలిపారు.

---

కొత్తల్లుడికి 130 వంటకాలతో

## కొసరి కొసరి...

తెలంగాణ మార్కు వంటకాలతో మర్యాద ఉబ్బితబ్బిబ్బయిన ఆంధ్రా అల్లుడు



దిల్‌సుఖ్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కొత్తల్లుడు ఇంటికొస్తే మర్యాద మామూలే! పెళ్లయ్యాక మొదటి పండుగ కావడంతో ఆ అల్లుడూ అత్తింటికొచ్చాడు. భోజనానికి పీటేసి కూర్చోబెట్టి పచ్చని అరిటాకు పరిచారు! పదార్థాలు వస్తూనే ఉన్నాయి వరదలా! పది, ఇరవై.. కాదు.. శాకాహార, మాంసాహార వంటకాలు, రకరకాల మిఠాయిలు, జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్‌లు అన్నీ కలిపి 130 పదార్థాలు ముందర పెట్టారు. ఆయనకు కొసరి కొసరి వడ్డించారు. కాదనకుండా ప్రతిదీ రుచిచూసిన ఆ ఆంధ్రా అల్లుడు, సంప్రదాయ తెలంగాణ వంటకాల ఘుమఘుమలకు ఫిదా అయ్యాడు. హైదరబాద్ గడ్డిఅన్నారం శారదనగర్‌కు చెందిన క్రాంతి, కల్పన దంపతులు తమ అల్లుడైన ఏపీలోని కాకినాడకు చెందిన మల్లికార్జున్‌కు చేసిన చిరస్మరణీయమైన మర్యాద ఇదీ! తమపెద్ద కుమార్తెను ఇటీవలే మల్లికార్జున్‌కు ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు. మొదటి సంక్రాంతి కావడంతో కొత్త దంపతులను ఇంటికి ఆహ్వానించారు. భోజనం పరంగా అత్తింటివారు ఊహించని రీతిలో చేసిన మర్యాదకు మల్లికార్జున్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.


---

# కో... అంటే కోట్లు!

## గోదావరి సహా పలు జిల్లాల్లో భారీగా కోడి పందేల జోరు

- పందెం రాయుళ్ల హుషారు
- తొలిరోజే రూ. 300 కోట్ల పందేలు
- కొందరికి బుల్లెట్ల కానుకలు
- లక్షల సంఖ్యలో తరలివచ్చిన వైనం
- ఎటు చూసినా సంక్రాంతి 'సంస్కృతి'

కత్తులు దూసిన కోళ్లు... పందెం రాయుళ్ల హుషారుతో పల్లెలు చిందులేశాయి! గోదావరి జిల్లాల నుంచి కోస్తాలోని పలు ప్రాంతాల్లో భారీ సంఖ్యలో వెలిసిన బరులు కోళ్ల యుద్ధానికి వేదికలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండుగలో తొలిరోజు భోగినాడే సుమారు రూ.300 కోట్ల మేరకు కరెన్సీ కట్టలు పందేలొడ్డాయి. గుండాట, లోనబయట, పేకాటలతో 'భోగి' సాగిపోయింది!!


కాకినాడలో నిర్వహిస్తున్న కోడి పందేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగు వారి అతి పెద్ద మూడు రోజుల పండుగ సంక్రాంతిలో తొలిరోజైన సోమవారం భోగి.. కోడి పందేలు, గుండాట, పేకాట, మందు, విందు, చిందులతో వైభోగంగా సాగిపోయింది. ఉమ్మడి గోదావరి జిల్లాలతోపాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల్లోనూ కోడి పందేలు జోరుగా సాగాయి. మూడు రోజుల పండుగలో తొలిరోజే సుమారు రూ.300కోట్ల మేరకు పందెం రాయుళ్లు పందేలొడ్డడం గమనార్హం. గోదావరి జిల్లాల్లో వేసిన భారీ బరులను వీక్షించేందుకు లక్షల సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. పలు బరుల్లో పలువురు ప్రజాప్రతినిధులు సైతం సందడి చేశారు.


రామవరప్పాడులో...

### ఉమ్మడి, తూర్పు పశ్చిమలో ఉత్సాహంగా..

పశ్చిమగోదావరి జిల్లాలో రూ.కోట్లు చేతులు మారాయి. భీమవరం, ఉండి మండలాల్లో ఒక్కొక్క కోడి పందెం రూ.5 లక్షల వరకు వెళ్లింది. జిల్లా వ్యాప్తంగా భోగి పండుగ రోజే పందెం రాయుళ్లు రూ.100 కోట్ల వరకు పందేలు కాసినట్టు అంచనా. తాడేపల్లిగూడెంలో ముసుగు పందెం రూ.25 లక్షల వరకు పలికింది. ముసుగు పందెం అంటే ముందుగా కోళ్లను చూపించరు. పందెం ఖరారైన తర్వాత కోళ్లను బరిలోకి దింపుతారు. హాస్య నటుడు కృష్ణ భగవాన్ పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పందేల జాతర ఘనంగా జరిగింది. తొలిరోజు కోడిపందాలు, గుండాట, కోతాటతో కలిపి రూ.175 కోట్లకుపైగా వ్యాపారం సాగినట్టు సమాచారం. కోనసీమ జిల్లాలో 430 బరుల్లో పందేలు సాగాయి. కోడి పందేలు భారీ స్థాయిలో జరిగిన ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఏకంగా రూ.5 కోట్లు దాటినట్టు తెలిసింది. కడప జిల్లా పులివెందులలో తొలిసారి కోడిపందేల జోరు కనిపించింది. పందేల్లో తొలిరోజే రూ.2కోట్లు దాటినట్లు సమాచారం. ప్రకాశం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కోడి పందేలు సాగాయి.

### పందేలు-పదనిసలు!

- తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సతీశ్ తొమ్మిది పందేల్లో పాల్గొని ఆరు గెలిచి, బుల్లెట్‌ను సొంతం చేసుకున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలో బైక్‌లు, పసిడి నాణేల ఆఫర్లు పందెం రాయుళ్లను ఆకట్టుకున్నాయి.
- యలమంచిలి, వీరవాసరం మండలం నవుడూరులో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.
- కాకినాడలోని కరప మండలంలో రూ.36 లక్షలతో బరి గెలుచుకున్న ఓ నిర్వాహకుడు తొలిరోజు రూ.10 కోట్లకుపైగా పందేలు నిర్వహించారు.
- బరుల వద్ద తక్షణం అప్పులు ఇచ్చేందుకు ఫైనాన్స్ వ్యాపారులు నోట్ల కట్టలతో కనిపించారు.
- పిఠాపురంలో 60 చోట్ల పందేలు జరిగాయి. టీడీపీ, జనసేన నేతలు బరులు నిర్వహించారు.
- ఏలూరు జిల్లాలో కోడి పందేల్లో పాల్గొన్న వారికి బిర్యానీ ఇచ్చేందుకు పాస్‌లు జారీ చేశారు.
- కృష్ణా జిల్లా గన్నవరంలో కోళ్లను వాటి యజమానులు ముద్దాడే ఫోటోలతో 'మా సంక్రాంతి చాంపియన్' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.
- కృష్ణాజిల్లాలో చీకోటి ప్రవీణ్ అనుచరులు క్యాసినోను రహస్యంగా నిర్వహించారు.
- ఫ్లడ్ లైట్ల వెలుగులో రేయింబవళ్లు జరిగే పందేలను ప్రత్యేక డ్రోన్లు, అత్యాధునిక సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు.


తాడేపల్లి గూడెంలో కోడిపందేల బరి వద్ద వాహనాలు



**470 రకాల వంటలతో విందు**

యానాంలో కొత్త అల్లుడికి అత్తింటివారు 470రకాల వంటలతో మెగా విందు ఏర్పాటు చేశారు. యానాం వ్యాపారి మాజేటి సత్యభాస్కర్ వెంకటేశ్వర్, వెంకటేశ్వరి దంపతులు తమ అల్లుడు సాకేత్‌ను ఇంటికి ఆహ్వానించి.. ఈ విధంగా విందు ఇచ్చారు.

---

# కోడి పందేలు చూసొద్దాం..!


గచ్చిబౌలిలో నిర్మానుష్యంగా ఫ్లై ఓవర్


కైట్ ఫెస్టివల్‌లో పతంగులు ఎగురవేస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

వారి సొంత ఊర్లకు వెళుతుంటారు. కొందరు తెలంగాణ వాసులు కూడా అక్కడికి వెళ్లే ఆనవాయితీ ఉంది. అయితే.. ఈసారి తెలంగాణ ప్రజలు భారీ సంఖ్యలో వెళ్లారు. వరసగా సెలవులు రావడం, ఏపీలో సంక్రాంతి వేడుకలు భిన్నంగా ఉండడంతో ప్రజల్లో ఆసక్తి పెరిగింది. విజయవాడ, భీమవరం, రాజమండ్రి, విశాఖపట్నం వంటి నగరాలు, సమీప ప్రాంతాల్లో జరిగే భోగి పండగతో పాటు కోడి పందేలను చూడడానికి తెలంగాణ వాసులు తరలి వెళ్లారు. ఇలా వెళ్లిన వారిలో కొందరు తమకు తెలిసిన వారి ఇళ్లలో ఉండగా, చాలా మంది హోటళ్లలో దిగారు. హైదరాబాద్ నుంచి మూడు రోజుల్లోనే సుమారు 60 వేల కార్లు ఏపీకి వెళ్లినట్లు అంచనా. అందుకే టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. హైదరాబాద్ నుంచి భారీగా జనం సొంతూళ్లకు వెళ్లడంతో నగరంలోని చాలా ప్రాంతాలు బోసిపోయాయి. పండగకు మూడు రోజుల ముందు నుంచే భారీగా ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో ఐటీ జోన్ నిర్మానుష్యంగా మారింది. మాదాపూర్, గచ్చిబౌలి, గౌలిదొడ్డి, రాయదుర్గం, కొండాపూర్, మియాపూర్, చందానగర్‌లో ప్రధాన రహదారులు వెలవెలబోతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు భారీగా ఊళ్లకు వెళ్లడంతో కంపెనీల గేట్లు సైతం మూతపడ్డాయి. ట్రాఫిక్ లేకపోవడంతో కాలుష్యం కూడా తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

---

# జైళ్లలో అగరబత్తుల తయారీ!

## ఆలయాల్లో వాడిన పూలతో తయారీ.. కరీంనగర్ జైల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభం

- త్వరలో మరికొన్ని జైళ్లలోనూ యూనిట్లు
- పుష్పాలు ఇవ్వాలని కోరుతూ త్వరలో దేవాదాయ శాఖకు జైళ్ల శాఖ లేఖ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పూజలకు వినియోగించిన పుష్పాలతో తిరుమల తిరుపతిలో అగరబత్తీలు తయారు చేస్తున్నారు. అదే తరహాలో తెలంగాణలోనూ అగరుబత్తీలు తయారు చేస్తున్నారు. అయితే, వీటిని తయారు చేస్తున్నది ప్రైవేటు వ్యక్తులో, సంస్థలో కాదు.. జైళ్ల శాఖ!! ఈ అగరుబత్తీలను ఖైదీలతో తయారు చేయిస్తోంది. ఇప్పటికే పలు సబ్బులు, షాంపూలు, ఫినాయిల్ వంటి గృహోపయోగ వస్తువులు, ఫర్నిచర్, పుస్తకాలు, ఇతర వస్తువుల్ని జైళ్ల శాఖ తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తోంది. మార్కెట్‌లో లభించే వస్తువుల కంటే ధర తక్కువగా ఉండడం, నాణ్యంగా ఉండడంతో జైళ్ల శాఖ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే జైళ్ల శాఖ అధికారులు అగరబత్తుల తయారీకి కూడా శ్రీకారం చుట్టారు. అది కూడా రసాయనాలు, ఇతర వస్తువులతో కాకుండా ఆలయాల్లో పూజలకు ఉపయోగించిన పూలను సేకరించి వాటి ద్వారా అగరబత్తులు తయారు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా జైల్లో అగరబత్తుల తయారీ యూనిట్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. స్థానిక ఆలయాల నుంచి సేకరించిన పుష్పాలతో అగరబత్తులు తయారు చేస్తున్నారు. త్వరలోనే వాటిని మార్కెట్‌లో విక్రయించనున్నారు. ఇతర ఉత్పత్తుల మాదిరిగానే అగరబత్తుల్ని సైతం ఖైదీలతో తయారు చేయిస్తున్నారు. ఇందుకోసం దేవాదాయ శాఖ సహాయ సహకారాలు తీసుకునేందుకు జైళ్ల శాఖ సిద్ధమైంది. జిల్లాల్లోని ప్రముఖ ఆలయాల్లో నిత్యం స్వామి, అమ్మవార్ల పూజలు, ప్రత్యేక సందర్భాల్లో అలంకరణలకు ఉపయోగించే పుష్పాల్ని పారవేయకుండా తమకు ఇవ్వాలని కోరుతూ జైళ్ల శాఖ ఉన్నతాధికారులు దేవాదాయ శాఖకు లేఖ రాయనున్నారు. ప్రస్తుతం ఆలయాల్లో నిత్య పూజలకు ఉపయోగించే పుష్పాలు, భక్తులు సమర్పించే దండలను ఆ తర్వాత పడేస్తున్నారు. ఇకపై దేవాదాయ శాఖ సహకారంతో పుష్పాలను సేకరించి అగరబత్తుల తయారీకి ఉపయోగించుకోనున్నారు. సహజసిద్ధంగా తయారు చేస్తుండడంతో అగరబత్తులకు ప్రజల ఆదరణ బాగుంటుందని జైళ్ల శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. "ఇతర వస్తువుల మాదిరిగానే ఖైదీలతో అగరబత్తులనూ తయారు చేయించాలని నిర్ణయించాం. ఆలయాల్లో పూజలకు ఉపయోగించే పుష్పాల్ని సేకరించి, రసాయనాలు వాడకుండా సహజ పద్ధతుల్లో అగరబత్తులను తయారు చేస్తాం. ప్రస్తుతం కరీంనగర్ జైల్లో తయారీ ప్రారంభించాం. దేవాదాయశాఖ సహకారంతో త్వరలో మరికొన్ని జైళ్లల్లో యూనిట్లు ఏర్పాటు చేస్తాం" అని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. "ఆలయాల్లో నిత్యం స్వామి, అమ్మవార్ల పూజలకు, అలంకరణలకు ఉపయోగించే పుష్పాలను ఆ తర్వాత పారవేస్తున్నాం. అవసరమైన వారికి వాటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకోసం నామమాత్రపు రుసుము వసూలు చేయడం వల్ల ఆలయాల అభివృద్ధికి ఉపయోగపడుతుంది" అని దేవాదాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

---

## త్రినాథరావుకు మహిళా కమిషన్ నోటీసులు

### పెద్ద మనసుతో క్షమించండి: త్రినాథరావు

నటి అన్షూపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దర్శకుడు నక్కిన త్రినాథరావుపై మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మజాకా సినిమా టీజర్ లాంచ్ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేస్తామని కమిషన్ ఛైర్ పర్సన్ నేరేళ్ల శారద తెలిపారు. మరోవైపు, దర్శకుడు త్రినాథరావు అన్షూపై చేసిన వ్యాఖ్యలకు గాను.. ఆమెకు, మహిళలకు క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. "టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నేను చేసిన వ్యాఖ్యలు చాలా మంది మహిళల మనసులు నొప్పించాయని అర్థమైంది. ఇవి మీ అందర్నీ నవ్వించే ప్రయత్నంలో అనుకోకుండా వచ్చిన వ్యాఖ్యలే తప్ప.. కావాలని చేసినవి కావు. ఏదో వినోదం కోసం చేసిన ప్రయత్నమిది. అది కూడా కావాలని చేసింది కాదు. ఇంత పెద్ద ఇష్యూ అవుతుందని అనుకోలేదు. నా వల్ల ఎవరెవరి మనోభావాలు దెబ్బతిన్నాయో.. వారందరికీ మనస్ఫూర్తిగా నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. దయచేసి పెద్ద మనసు చేసుకుని క్షమించండి" అని వీడియోలో పేర్కొన్నారు. - సినిమా డెస్క్

## గేమ్ చేంజర్ ఆన్‌లైన్‌లో పెడతామంటూ బ్లాక్‌మెయిల్

- అడిగినంత డబ్బు ఇవ్వాలని డిమాండ్
- విడుదల రోజే సోషల్ మీడియాలో లీక్
- సైబర్ క్రైమ్‌లో చిత్ర యునిట్ ఫిర్యాదు

రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చేంజర్ సినిమాను లీక్ చేసి ఆన్‌లైన్ పెడతామని కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ చిత్ర యూనిట్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సినిమా విడుదలకు వారం రోజుల ముందు నుంచే కొంతమంది దుండగులు సినిమా నిర్మాతతో పాటు చిత్ర యూనిట్‌లోని ప్రముఖులకు ఫోన్‌లు చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతూ భారీగా డబ్బులు డిమాండ్ చేశారు. రిలీజ్‌కు రెండు రోజుల ముందు సినిమాలోని కీలక సన్నివేశాలను లీక్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సినిమా రిలీజ్ అయిన రోజే హెచ్‌డీ ప్రింట్‌ను లీక్ చేసి సోషల్ మీడియాలో పెట్టినట్లు తెలిపారు. 45 మంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, గేమ్ చేంజర్ సినిమాను పథకం ప్రకారమే లీక్ చేసి, ఇబ్బందులు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేశారని చిత్ర యూనిట్ గుర్తించింది. ఈ ముఠా వెనుక ఎవరో బలమైన వ్యక్తి ఉండి ఇదంతా నడిపిస్తున్నట్లు అనుమానించిన చిత్ర బృందం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

-ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ/ సినిమాడెస్క్

---

కేంద్ర జలసంఘం అధ్యక్షుడిగా

## ముఖేశ్ కుమార్ సిన్హా



- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అధ్యక్షుడిగా ముఖేశ్ కుమార్ సిన్హాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర క్యాబినెట్ నియామక కమిటీ ఆయన పేరును సిఫారసు చేయగా, ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముఖేశ్‌కుమార్ హైదరాబాద్‌లోని గోదావరి యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

## తిరుమల లడ్డూ కౌంటర్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూకౌంటర్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. 47వ నంబరు కౌంటర్‌లోని కంప్యూటర్ వైర్ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో కౌంటర్ల వద్ద భక్తులు భయభ్రాంతులయ్యారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వైర్లన్నీ తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విచారించాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

## ఆ కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం రూ.46లక్షలు!

- బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి దొంగతనం కేసులో కొత్త విషయాలు వెలుగుచూశాయి. వంద గ్రాముల గోల్డ్ బిస్కెట్ దొంగతనం చేసేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఆప్కాస్ కాంట్రాక్ట్ ఉద్యోగి వీరిశెట్టి పెంచలయ్య నుంచి దాదాపు రూ.46 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెంచలయ్య శనివారం మధ్యాహ్నం ఖాళీ ట్రాలీ పైపు ద్వారా వంద గ్రాముల బంగారు బిస్కెట్‌ను తస్కరించే ప్రయత్నం చేయగా విజిలెన్స్ అధికారులు గుర్తించి పట్టుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో అతడిపై శనివారమే కేసు నమోదు చేయగా, ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. పెంచలయ్యను తిరుమల వన్‌టౌన్ పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఈక్రమంలో అతడి నుంచి 655 గ్రాముల బరువు కలిగిన బంగారు బిస్కెట్, ఆభరణాలతో పాటు మరో 157 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.46 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా, పెంచలయ్య రెండేళ్లుగా పరకామణిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఏడాది కాలం నుంచి అతని తీరు అనుమానాస్పదంగా ఉండటంతో ప్రత్యేక నిఘా ఉంచిన విజిలెన్స్ అధికారులు శనివారం నేరుగా పట్టుకున్నారు.

## 1% అక్షరాస్యత పెరిగితే.. మహిళా ఓటింగ్ 25% పెరుగుదల..!

- వారి భాగస్వామ్యాన్ని పెంచాలి: ఎస్బీఐ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 13: భారతదేశంలో అక్షరాస్యత, మహిళల ఓటింగ్ శాతానికి మధ్య గణనీయమైన సంబంధం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. దేశంలో 1 శాతం అక్షరాస్యత పెరిగితే, అది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే మహిళల సంఖ్యలో 25 శాతం పెరుగుదలకు దారితీస్తుందని విశ్లేషించింది. ఈ సందర్భంగా గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన మహిళా ఓటర్ల సంఖ్యను ప్రస్తావించింది. 2019తో పోలిస్తే.. 2024 ఎన్నికల్లో 1.8 కోట్ల మంది మహిళా ఓటర్లు పెరిగాయని తెలిపింది. ఇందులో ఇందులో 45 లక్షల మంది పెరుగుదలకు అక్షరాస్యత స్థాయి మెరుగుదలే కారణమని పేర్కొంది. మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుదలను నడిపించడంలో అక్షరాస్యత, ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఇంటి యాజమాన్యం (ప్రధాన మంత్రి అవాస్ యోజన) వంటివి కీలక పాత్ర పోషిస్తాయని ఎస్బీఐ నివేదిక నొక్కిచెప్పింది.

Printed and published by Koganti Venkata Seshagiri Rao , on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at "Aamoda Press" at Plot No. 112, IDA, Khanapuramhaveli, Khammam, Tel. No. 08742-247915, Editor: N.Rahul Kumar.
RNI No: APTEL/2004/11932 Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
సంక్రాంతి శుభాకాంక్షలు

మంగళవారం | 14-1-2025 | పేజీలు: 8+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు ఉ. 10.17 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.6.20-7.57; దుర్ముహూర్తం: ఉ.9.04-9.49, రా.10.11-11.01; అమృతఘడియలు: ఉ.7.55-9.29, తె.4.01-5.37; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.56

ఖమ్మం సిటీ

Khammam | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru






**మకర సంక్రాంతి విందు పసందైన ఆరోగ్యాన్ని అందించేలా ఉండాలి. అందుకోసం పండుగ పిండివంటల్లో ఈ పోషకభరిత పదార్థాలకు స్థానం కల్పించాలి. సంక్రాంతితో ఆరోగ్య శోభ వెల్లివిరియడం కోసం అనుసరించవలసిన పోషక నియమాలు ఇవే!**

# పండుగ నాడు... పోషక శోభ

పండుగల్లో పిండివంటలదే ప్రత్యేక స్థానం. నోరూరించే పిండివంటల్లో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉంటాయి. వ్యాధినిరోధకశక్తిని పెంచడం ద్వారా కాలానుగుణ రుగ్మతల నుంచి రక్షణ కల్పించే బలవర్థకమైన పోషకాలను అందించడమే పండుగనాటి పిండిపదార్థాల లక్ష్యం. కాబట్టి సంప్రదాయసిద్ధమైన పిండివంటలకే ప్రాధాన్యమిస్తూ, వాటిలో పోషకవిలువలకు పెద్ద పీట వేయాలంటున్నారు వైద్య నిపుణులు.

## పోషకభరిత నువ్వులు

నువ్వుల్లో జింక్, క్యాల్షియం, పీచు సమృద్ధిగా ఉంటాయి. నువ్వులు ఆరోగ్య ప్రయోజనాలను అందించే శక్తిభాండాగారాల్లాంటివి. కాబట్టి నువ్వులతో లడ్లు చేసుకోవాలి. అరిసెల్లో కూడా నువ్వులు చేర్చాలి.



## నువ్వుల లడ్డూలు

దీన్లోని నువ్వులు, బెల్లం, వేరుశనగలు, యాలకుల పొడిలో లెక్కలేనన్ని పోషకాలుంటాయి. సంక్రాంతి నాడు వండుకునే ఈ సంప్రదాయ పిండి వంటతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

**నువ్వులు:** నల్ల నువ్వుల్లో విటమిన్లు, ప్రొటీన్లు, ఇనుము, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. వీటితో రక్తంలో చక్కెర నియంత్రణలో ఉండడంతో పాటు, కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గుతాయి. అధిక రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, జీర్ణశక్తి మెరుగు పడుతుంది.

**బెల్లం:** కొలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక శరీర బరువు మరింత పెరగకుండా నియంత్రించే బెల్లం ఊపిరితిత్తుల ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది.

**వేరుశనగలు:** పీచు, మెగ్నీషియం, ఇనుము, జింక్ మొదలైన ఖనిజ లవణాలు, బి, కె విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వీటిలో ఎక్కువ. వేరుశనగలతో గ్లైసెమిక్ ఇండెక్స్ తగ్గి మధుమేహం అదుపులో ఉంటుంది. వీటిలోని విటమిన్ ఇ, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

**యాలకులు:** రక్తపోటు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీన్లో క్యాన్సర్ వ్యతిరేక, బ్యాక్టీరియా వ్యతిరేక గుణాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ వ్యాధిగ్రస్థులకు వేరుసెనగలు ఎంతో మేలు చేస్తాయి.

## పసందైన పొంగలి

సుప్రసిద్ధమైన దక్షిణ భారతీయ వంటకమైన పొంగలి, బియ్యం, పెసరపప్పు, జీలకర్ర, మిరియాలు, ఇంగువ, కరివేపాకు, అల్లంతో తయారవుతుంది. వీటిలో పోషకాలు ఏవంటే...

**పెసరపప్పు:** ఈ పప్పుతో మధుమేహం నియంత్రణతో పాటు, కాలేయం దెబ్బతినకుండా రక్షణ దక్కుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగు పడుతుంది. పెసరపప్పులో మాంసకృత్తులు, పీచు, ఫోలేట్, విటమిన్ కె, సిలు ఎక్కువ. కీలకమైన పెప్టైడ్స్, పాలీఫినాల్స్ మొదలైన సమ్మేళనాలు కూడా సమృద్ధిగా దొరుకుతాయి.

**ఇంగువ:** జీర్ణ సంబంధ సమస్యలైన పొట్ట నొప్పి, పేగుల్లోని పరాన్నజీవులు, కడుపుబ్బరంతో పాటు ఉబ్బసం, బ్రాంకైటిస్, కోరింత దగ్గులకు ఇంగువ ఔషధంలా ఉపయోగపడుతుంది.

**కరివేపాకు:** కార్బజోల్ ఆల్కలాయిడ్స్‌ను సమృద్ధిగా కలిగి ఉండే కరివేపాకుకు మధుమేహాన్ని తగ్గించే గుణాలు కూడా ఉంటాయి. అలాగే నాడులను కాపాడే స్వభావం కూడా ఉంటుంది. కరివేపాకుతో జీర్ణసంబంధ సమస్యలతో పాటు, పైల్స్, ఎడీమా, ఒళ్లు నొప్పులు కూడా తగ్గుతాయి.

**అల్లం:** ఎన్నో వేల సంవత్సరాలుగా అధిక రక్తపోటు, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఇతరత్రా ఇన్‌ఫ్లమేటరీ సమస్యల చికిత్సల్లో అల్లాన్ని ఉపయోగిస్తున్నారు.



## బలవర్ధకమైన బెల్లం పాయసం

కొత్త బియ్యం, కొత్త తాటి బెల్లంతో తయారుచేసే బెల్లం పాయసం సంక్రాంతి నాడు వండుకునే తీపి పిండివంటకం. వీటిలోని పోషకాల గురించి తెలుసుకుందాం!

**తాటి బెల్లం:** ఈ సహజసిద్ధ తీపి పదార్థంలో ఎన్నో పోషకాలుంటాయి. శక్తి పెరగడంతో పాటు, జీర్ణశక్తి మెరుగు పడుతుంది. మైగ్రెయిన్ నొప్పులు తగ్గుతాయి. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కీళ్లనొప్పులు, నెలసరి నొప్పులు తగ్గుతాయి. అల్జీమర్స్ లాంటి నాడీక్షీణత వ్యాధులను నయం చేయడంలో తాటి బెల్లం కీలక పాత్ర పోషిస్తుంది.

పండుగ వేళల్లో మనం భిన్నమైన పిండి వంటలతో కమ్మని రుచులకే ప్రాధాన్యమిస్తాం. కానీ నిజానికి ప్రత్యేకించి సంక్రాంతి పండుగ నాటి పిండివంటలు అంతకు మించిన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కాబట్టి ఆత్మన్యూనతకు గురి కాకుండా, బరువు పెరిగిపోతాయమనే భయం లేకుండా పండుగ నాటి పిండిపదార్థాలను ఆస్వాదించాలి. అయితే అతి సర్వత్రా నష్టదాయకమే! కాబట్టి పరిమితంగా ఆస్వాదించడం మర్చిపోకూడదు. మరీ ముఖ్యంగా మధుమేహులు ఒకట్రెండు తీపి పదార్థాలకే పరిమితం కావాలి. పండుగ విందుల్లో ఇలాంటి సూపర్ ఫుడ్స్‌ను జోడించుకోవడం ద్వారా అటు సంప్రదాయాన్నీ, ఇటు పోషణనూ సమంగా సమన్వయం చేసుకోవాలి. అలాంటప్పుడే పండుగ వేడుకల ప్రయోజనాలను సంపూర్తిగా అందుకోగలుగుతాం!

## బలవర్ధకమైన బెల్లం

చక్కెరను బెల్లంతో భర్తీ చేయడం అన్నివిధాలా ప్రయోజనకరమే! ఈ సహజసిద్ధ తీపిపదార్థంలో ఇనుము, మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లంతో పిండివంటలకు ప్రత్యేకమైన రుచితో పాటు పోషకాలు కూడా సమకూరతాయి.

## కమ్మని కుంకుమ పువ్వు

రుచి, పోషకవిలువలను పెంచే కుంకుమ పువ్వును తీపి వంటకాల్లో విరివిగా వాడుతూ ఉంటాం. వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పులు వాపులను తగ్గిస్తాయి. రుచి, ఆరోగ్యం పరంగా ప్రయోజనకరంగా ఉండే కుంకుమ పువ్వు ఖరీదే అయినప్పటికీ పండుగ సందర్భాల్లో తప్పనిసరిగా వాడుకోవాలి.

## దారుఢ్యాన్ని పెంచే నట్స్

బాదం, వాల్‌నట్స్, పిస్తాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, మాంసకృత్తులు, పోషకాలు ఉంటాయి. కాబట్టి తీపి వంటకాల్లో వీటిని ఎక్కువగా ఉపయోగించుకోవాలి. పండుగ పనుల్లో తీరిక లేని పనులతో అలసటకు లోనవకుండా, రోజంతా అప్పుడప్పుడూ నట్స్‌ను తింటూ ఉంటే, నిస్సత్తువ ఆవరించకుండా ఉంటుంది.

## పొట్టు తీయని ధాన్యం

సజ్జలతో, జొన్నలు లాంటి పొట్టుతీయని వాటినే పిండివంటలకు ఉపయోగించడం ఉత్తమం. వీటిలో పీచుతో పాటు పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. దాంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. పండుగ కార్యకలాపాలన్నింట్లో చురుగ్గా పాల్గొనే శక్తి సమకూరుతుంది.

## ముత్యాల ముగ్గు








అరుణ కుమారి
కడప

27 చుక్కలు
5 వరుసలు
సరిచుక్క












www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## ఇదేం బాదుడు..!
### సంక్రాంతి స్పెషల్ పేరుతో అదనపు వసూళ్లు


తొర్రూరు డిపో బస్సుకు స్టిక్కర్‌లు అంటించిన ఆర్టీసీ సిబ్బంది



అధిక వసూళ్లు చేసిన బస్సు టికెట్

తొర్రూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లుగా బస్సులకు స్టిక్కర్లు అంటించి అదనపు వసూళ్ళకు పాల్పడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు డిపో నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ రింగ్ రోడ్, జగద్గిరిగుట్టకు సుమారు 70 సర్వీసులు నడుస్తాయి. ఈ నెల 11వ తేదీ నుంచి ఆర్టీసీ అధికారులు బస్సులకు సంక్రాంతి స్పెషల్ స్టిక్కర్లు అతికించి బస్సు చార్జీలు పెంచి వసూళ్లు చేస్తున్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు తొర్రూరు నుంచి ఉప్పల్ రింగ్ రోడ్ వరకు సాధారణంగా రూ.290 ఉండగా స్పెషల్ బస్సుల్లో రూ.420 వసూలు

మిగతా 5వ పేజీలో...

మంగళవారం | 14-1-2025 | పేజీలు: 8+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 14
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు ఉ. 10.17 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.6.20-7.57; దుర్ముహూర్తం: ఉ.9.04-9.49, రా.10.11-11.01; అమృతఘడియలు: ఉ.7.55-9.29, తె.4.01-5.37; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.56
ఖమ్మం సిటీ
Khammam | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# పల్లెల్లో.. సంక్రాంతి శోభ

**భోగితో ఆరంభమైన సంబురాలు**
- సంప్రదాయాలకు ప్రతిబింబం రంగవల్లులు
- ముగ్గులతో కళకళలాడిన లోగిళ్లు
- అలరించిన గంగిరెద్దుల కోలాహలం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. ఆడపడచులు, బంధువుల రాకతో పల్లెలు, పట్టణాలు కళకళలాడుతున్నాయి. ఇళ్లముందు రంగవల్లులు విరబూస్తున్నాయి. చిన్నాపెద్దా తేడాలేకుండా గాలిపటాలు ఎగుచేస్తూ సందడి చేస్తున్నారు. గంగిరెద్దులు విన్యాసాలు, విందూ వినోదాల్లో జిల్లావాసులు మునిగి తేలనున్నారు. సూర్యుడు ఏ రాశిలో ప్రవేశిస్తే ఆ సంక్రాంతిగా వ్యవహరిస్తారు. సూర్యుడు ధనురాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే కాలాన్ని మకర సంకాంత్రి అంటారు. మకర సంక్రాంతి రోజున నువ్వుల నూనెలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని ప్రతీతి. సంక్రాంతి నోముల కోసం ఇచ్చే వాయినాలలో చిన్న చిన్న బహుమతులు ముత్తయిదువలకు అందజేస్తారు. లక్ష్మి తమ ఇంట్లో కొలువై ఉండాలని, నిత్య సౌభాగ్యంతో కళకళలాడాలని ముత్తయిదువలు దీవెనలు అందజేస్తారు.

**భోగి పండుగ విశిష్టత...**
భోగి పర్వదినాన 12 సంవత్సరాలలోపు పిల్లలకు భోగిపండ్లను పోయడం వల్ల వారికి ఉన్న బాలారిష్టాలు, ఇతర దోషాలు తొలగిపోతాయని పండ్లను పోస్తారు. ఈ భోగి పండ్లలో రేగుపండ్లు, జీడీపండ్లు, చిల్లర నాణేలు, బియ్యం పిండితో నువ్వుల నూనెలో వేయించారు. చిన్నచిన్న వేపగింజల ఆకారంలో తాల్కలు, చెరుకుగడ ముక్కలతో ఈ ఐదింటిని ఒకేచోట కలిపి ఇంట్లో ఉన్న పిల్లల్లో ఐదు సంవత్సరాలలోపు వయస్సు కలిగిన చిన్నారులకు కొత్తబట్టలు వేసి కూర్చోడానికి చాప లేదా దుప్పటి వేశారు. తూర్పువైపు ముఖం ఉండేలా కూర్చోబెట్టి నుదుట కుంకుమబొట్టు పెట్టి చుట్టు పక్కల పిల్లలను పిలిచి భోగిపండ్లను రెండు చేతులతో పిల్లల తలపై నుంచి కిందపడేలా పోశారు. కిందపడిన భోగిపండ్లను పిల్లలు సరదాగా పోటీపడుతూ... భోగి పండ్లను పోగు చేసుకుని తిన్నారు.

● శ్రీ పార్వతిరామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు రంగావఝ్జుల సుధాకర శాస్త్రీ నివాసంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. అనంతరం చిన్నారులకు భోగి పండ్లు పోశారు. మనలో ఉన్న బద్దకాన్ని అశ్రద్ధను, మనస్సులో ఉన్న చెడులను మంటల్లో వేసి ఈ రోజు నుంచి ఆనంద ఆప్యాయతలతో కూడుకుని ఉన్న జీవితాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పడానికి నిదర్శనంగా చెప్పుకుంటారని ప్రతీక.

**సంక్రాంతి రోజున...**
సంక్రాంతి, భోగిరోజు కొన్ని ప్రాంతాల్లో ముత్తయిదువలు కొత్తగాజులు వేసుకుంటారు. గాజులు తొడిగిన గాజుల వ్యాపారికి వారిపంట పొలాల్లో పండిన కొత్త ధాన్యంను ఆనవాయితీగా ఇస్తారు. ఇంటికి వచ్చిన కొత్త అల్లుళ్ల, కూతుర్లతో సరదాగా ఆనందంగా గడుపుతారు. ఈ రోజు కుటుంబంలో ఎంతో అనురాగ ఆప్యాయతల మధ్య అనుభూతులు పొందుతారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా కుటుంబసభ్యులు ఆత్మీయులతో ఆనందంగా గడుపుతారు.


మహబూబాబాద్‌లో ఇంటి ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు


కేసముద్రం మండలం కల్వలలో గంగిరెద్దుకు పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు


డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో భోగి వేడుకలు


మహబూబాబాద్ 23వ వార్డు మిర్త్రీ కాలనీలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు సతీమణి సంధ్యారాణి




సీరోలు మండలం ఉప్పరగూడెం హట్యతండాలో మహాయాగం నిర్వహిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ-జీవిత దంపతులు


మహబూబాబాద్‌లో అర్చకులు సుధాకరశాస్త్రీ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో చిన్నారులకు భోగీపండ్లు పోస్తున్న దృశ్యం

# భరోసా సర్వేకు సై

- 16 నుంచి 20 వరకు గ్రామాల్లో సర్వేలు
- 21 నుంచి 23 వరకు గ్రామసభలు

**గ్రామాలకు తరలనున్న అధికారులు**

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా పథకాన్ని ఈ నెల 26 నుంచి అమలు చేయాలని తెలంగాణ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ పథకం అమలు చేయడానికి గ్రామాల్లో శ్రీకారం చుట్టడానికి జిల్లా అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారుల బృందాలు క్షేత్రస్థాయి సర్వే చేయడానికి గ్రామాలకు తరలనున్నది. ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వేలు చేయనున్నారు. అనంతరం ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామసభలు నిర్వహించి 24న ఫైనల్ లిస్ట్ తయారు చేయనున్నారు.

**ఆయా శాఖల ఆధ్వర్యంలో..**
వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం, అధికారుల బృందాల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. మండలానికి వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో బృందాలుగా ఏర్పడి వారి నేతృత్వంలో తహసీల్దార్ ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఒక బృందంగా ఏర్పాటు చేస్తారు. ఒక్కొక్క అధికారికి మండలంలోని సంఖ్యను బట్టి ఆరు నుంచి ఏడు గ్రామాలు కేటాయించారు. అలాగే మండల స్థాయిలో కూడ పెద్దమండలాలకు అధికారుల బృందాలు పెరగనున్నాయి. ఆదివారం రాత్రి వ్యవసాయ, ఇతర శాఖల అధికారులకు తమకు కేటాయించిన సర్వే షెడ్యూల్‌ను జారీ చేశారు. అయితే సర్వేయర్లు తయారు చేసిన క్వారీలు, ఇతర భూములను తయారు చేసిన లిస్టు ప్రకారం. గతంలో రైతుబంధు వచ్చిన లిస్టు ప్రకారం కూడ ఈ అధికారుల బృందం గ్రామాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలిస్తారు. సాగుకు పనికి రాని భూముల వివరాలు, గ్రానైట్ క్వారీలు, రాళ్లగుట్టలు, రియల్‌ఎస్టేట్ భూములు, వెంచర్లు, పడావుపడ్డ భూములను వివరాల సమాచారాన్ని అధికారులు సేకరిస్తారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల రైతు సాగు వివరాలను సేకరిస్తారు. ఈ సర్వే బృందాలు ఈ నెల 16, 17, 18, 19,20 తేదీలలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తారు.


మహబూబాబాద్ మండలం మాధవాపురం శివారు తండాల్లో దుక్కులు దున్నుతున్న ఓ రైతు

**21 నుంచి 23 వరకు గ్రామసభలు...**
గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే జరిపిన అనంతరం ఆయా గ్రామాల్లో 21 నుంచి 23 వరకు అధికారులు గ్రామసభలను ఏర్పాటుచేస్తారు. సేకరించిన సమాచారాన్ని గ్రామసభలో ప్రజలు, రైతుల ముందు చర్చిస్తారు. గ్రామసభల్లో ఆమోదం పొందిన తర్వాత లోటుపాట్లను సరిచేసి అధికారికంగా ఆమోదిస్తారు. ఈ నెల 24న ఫైనల్ రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి అధికారులు నివేదిస్తారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని లబ్దిదారులను గుర్తించనున్నారు.

**CHANGE OF NAME**
I, AMARENDER YADAGERI VANGA, S/o. YADAGERI RAMAYA VANGA (Old Name) Passport No : B2746496 R/o Dumbai, Tenament, Block No: 3-14, Limbayat Surat Gujarat State India. Have Changed my Name as VANGA AMARENDER S/o. VANGA YADAGIRI (NewName), H.No: 16-201, Opp: Annaram Road, Near Saraswathi Hospital Thorrur (Vill&Mdl), Mahabubabad Dist. 506163.


ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు


ఐనవోలులో శివసత్తులు భక్తి పారవశ్యం

## మల్లన్నా.. మమ్మేలు మాయన్నా..
**పసుపుమయమైన ఐనవోలు మల్లన్న సన్నిధి**
- శిగమూగిన శివసత్తులు, మోగిన ఢమరుక నాదాలు
- పరవశించిన భక్తులు.. కిటకిటలాడిన పరిసరాలు
- నేడు వైభవంగా ప్రభ బండ్ల ప్రదర్శన

4


కొత్తకొండ జాతరకు ఎడ్లబండ్లతో తరలివస్తున్న భక్తులు



## కోరిన వరాలిచ్చే కోరమీసాల సామి
**కొత్తకొండ జాతరకు తరలివచ్చిన భక్తులు**
- గుమ్మడి కాయలు, కోర మీసాల చెల్లింపులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- దర్శనానికి మూడు గంటల సమయం

4

## కాళేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు

మహదేవపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి రాధా రాణి దంపతులు సోమవారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయంలో ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది జడ్జికి ఆలయ గోపురం నుంచి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ముక్తీశ్వరస్వామి వారికి జడ్జి దంపతులు అభిషేకంతోపాటు అమ్మవారికి అర్చన చేయించారు. అనంతరం శ్రీపార్వతి అమ్మవారి ఆలయంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ శేషవస్త్రాలతో జడ్జి దంపతులను సత్కరించారు.

## జగత్ విఖ్యాత అవార్డు అందుకున్న విద్యార్థిని



విద్యార్థిని హర్షినిని సన్మానిస్తున్న నిర్వాహకులు

భూపాలపల్లిటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లికి చెందిన విద్యార్థిని దుప్పటి హర్షినికి జగత్ విఖ్యాత అవార్డు లభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఖమ్మం ఆడిటోరియంలో జరిగిన జాతీయ స్వర మాధురి కల్చరల్ ప్రోగ్రాంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హర్షిని నృత్య ప్రదర్శన చేసి ఆహుతులను ఆకట్టుకుంది. దీంతో నిర్వాహకులు ఆ విద్యార్థినికి జగత్ విఖ్యాత అవార్డును అందజేశారు.

## డబుల్ ఇళ్ల వద్ద తాగునీటి కష్టాలు



చెర్లపాలెం ఇళ్ల సమీపంలో జీపీ ట్యాంకర్ వద్ద నీరు తీసుకెళ్తున్న మహిళలు

తొర్రూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ప్రజలు వారం రోజులుగా తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వం పేద ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఇళ్లవద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పండుగపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలు జీపీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి అందజేస్తున్నట్లు ప్రజలు వెల్లడిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో, బోరునీటి సౌకర్యం లేకపోవడంతో పండుగ పూట ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



# సీఎం ఆలోచనతోనే క్రీడల నిర్వహణ





రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీలో ప్రథమ స్థానం సాధించిన సూర్యాపేట బాలికల జట్టుకు, హైదరాబాద్ బాలుర జట్టుకు ట్రోఫీలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

» ఓటమి క్రీడాకారుల్లో పట్టుదల పెంచాలి
» ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కేసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతోనే రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, దీనికి కొనసాగింపుగా సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తండ్రి చెన్నకృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తం రెడ్డిల జ్ఞాపకార్థం ఇక్కడ రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడ్రన్ కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టి రాష్ట్రంలోని యువత, విద్యార్థులపై ఉందని, వీరిని ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాలను పెంపొందించే విధంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు గచ్చిబౌలి స్టేడియం కేంద్రంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌కి కేసముద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని, ఇందులో భాగంగానే ఇక్కడ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల, మునిసిపాలిటీ మంజూరు ఇతరఅభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. క్రీడలు పోటీతత్వం, మనోధైర్యం, మానసిక వికాసం, స్నేహసంబంధాలను పెంచుతాయని తెలిపారు. ఓటమి చెందిన వారిలో మళ్లీ గెలవాలనే పట్టుదల ఉంటుందని, ఎన్నో ఇబ్బందులు పడుతూ తాను ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకొని, రాజకీయంలో రెండుసార్లు ఓడిపోయి అవమానాలు, అవహేళనలకు గురైనప్పటికీ పట్టుదలతో విజయం కోసం పోరాడి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు.

### క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి..

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని, ఇందుకు ఉదాహరణగా దక్షిణ ఆఫ్రికాలో నెల్సన్ మండేలా రగ్బీ క్రీడతో ఆ దేశ ప్రజల్లో ఐకమత్యాన్ని సాధించారని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. చిన్నచిన్న సమస్యలతో నేటి యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని, క్రీడలు ఆడితే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. జయాపజయాలను సమానంగా తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం పట్ల పోలీస్ శాఖ తరపున నిర్వాహకులను ఎస్పీ అభినందించారు. మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సలంజీవరెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తేరాల శ్రీనివాస్, కొప్పుల శంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### విజేతలు వీరే..

కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీ 17ఏళ్ల బాలికల విభాగంలో ప్రథమ స్థానం సూర్యాపేట జిల్లా జట్టు సాధించింది. ద్వితీయ నల్గొండ, తృతీయ జగిత్యాల, చతుర్థ స్థానం జనగామ జిల్లా జట్లు సాధించాయి. బాలుర విభాగంలో ప్రథమ హైదరాబాద్, ద్వితీయ నల్గొండ, తృతీయ మహబూబాబాద్, చతుర్థ స్థానం మెదక్ జిల్లా జట్లు సాధించాయి.

సీనియర్ మహిళల విభాగంలో ప్రథమస్థానం దోమల్‌గూడ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల జట్టు, ద్వితీయ జనగామ, తృతీయ మహబూబాబాద్ జట్లు, పురుషుల విభాగంలో ప్రథమ నల్గొండ, ద్వితీయ దోమల్‌గూడ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల, తృతీయ మహబూబాబాద్, చతుర్థ నిజామాబాద్ జట్లు సాధించాయి. విజేతలకు ఆహుతులు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## బస్సు ఢీకొని యువతికి గాయాలు

తొర్రూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని యువతికి గాయాలైన సంఘటన సోమవారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... తొర్రూరు ఆర్టీసీ డిపో బస్సు బస్టాండ్‌కు వెళ్తుండగా మన గ్రోమోర్ ప్రాంతంలో రోడ్డుపై పట్టణానికి చెందిన అఫ్రిన్ నడుచుకుంటూ వెళ్తుంది. ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టడంతో యువతి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## గుర్తుతెలియని యాచకుడి మృతి




ములుగు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలోని తిరుమల థియేటర్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మరణించాడు. రోడ్డు పక్కన మృతదేహం ఉందన్న సమాచారంతో ఘటనా స్థలికి పోలీసులు వెళ్లారు. 60-65ఏళ్ల వయసున్న ఈ వ్యక్తి కొద్ది రోజులుగా ములుగులో భిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లు తెలిసిందని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## 18న ఉమ్మడి వరంగల్, ఖమ్మం క్రికెట్ టోర్నీ



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 18న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు రెడిన్ ల్యాబ్ యాజమాని లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను కలిసి మొక్కను బహూకరించి పోటీలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తోట సుభాష్, బంటి, శంకర్, రవి, భరత్, వంశీ పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిల్లు పత్రాలను దహనం చేస్తున్న నేతలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ ముసాయిదా బిల్లును వెంటనే రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్నలు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎస్‌కేఎం కన్వీనర్ గుజ్జు దేవేందర్ ఆధ్వర్యంలో ముసాయిదా బిల్లు పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన మార్కెట్ విధాన బిల్లును తీసుకువచ్చిందని తెలిపారు. ఈ బిల్లు కార్పోరేట్‌లకు లాభం చేకూర్చే విధంగా ఉందని, ఆ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం నేతలు బండారి ఐలయ్య, పైండ్ల యాకయ్య, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, నల్లు సుధాకర్‌రెడ్డి, మేక వీరన్నలు, గుగులోతు సక్రు, యాకన్న, ఉమగాని సత్యం, తాజ్‌పాషా, తోకల వెంకన్న, రాంచంద్రు, మురళి, బిక్షం, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో ముందస్తు మొక్కులు



సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న భక్తులు



గద్దెల ప్రాంగణంలో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

మేడారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలను దర్శించుకోవడానికి భక్తజనం సోమవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మినీ జాతరకు ముందస్తుగా తల్లులను దర్శించుకున్నారు. దీంతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.

ముందుగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేశారు. పక్కనే ఉన్న కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి గద్దెలకు చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు చీరె, సారె, పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, 20వేల మందికి పైగా భక్తులు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

### భక్తుల భద్రతలో పోలీసులు

వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు పోలీసులు భద్రత కల్పించారు. వాహనాలను పార్కింగ్‌లకు తరలించడం, గద్దెల వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, దొంగతనాలు జరగకుండా రక్షణ కల్పించడం, పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు సహాయం అందించడం తదితర చర్యలు చేపట్టారు. మొత్తం 36 మంది విధులు నిర్వర్తించారు.

### గద్దెల ప్రాంగణంలో మరమ్మతులు

వనదేవతల గద్దెల ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు భక్తుల సౌకర్యార్థం పలు మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. మినీ జాతర నేపథ్యంలో తల్లుల దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న దృష్ట్యా ఈ పనులను చేపడుతున్నారు.

## హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌కు సన్మానం



తౌర్యతండాలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

కేసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం శివారు తౌర్యతండాకు చెందిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ మూడావత్ చైతన్యకుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. తండాలో గత పదేళ్ల క్రితం ఆయన సహకారంతో తండావాసుల ఆధ్వర్యంలో నిర్మించిన దుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహానికి అలంకరణ తోరణాన్ని అందించి తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఆయన్ను మాజీ సర్పంచ్ భూక్య శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, గుగులోత్ రాము, మిట్టగడుపుల యాకూబ్, జాటోత్ రమేష్, కీసర రమాదేవి, రామారపు శ్రీహరి, ముంజాల శ్రీనివాస్, భూక్య నెహ్రూ, రాంధన్, వెంకన్న, వీరన్న, భద్రు, రెడ్యా, రాంచంద్రు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌ల దొంగ అరెస్ట్

### రూ.5.09 లక్షల విలువైన ఆరు బైక్‌ల స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలిస్తూ వాహనదారులను ఆందోళనకు గురి చేస్తున్న వ్యక్తిని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కథనం ప్రకారం... వర్ధన్నపేట మండలం రామవరంనకు చెందిన ఉడుత హరీష్ అనే బైక్ మెకానిక్ 2020లో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికెళ్లి ఆర్థికంగా నష్టపోయాడు. అప్పటి నుంచి చెడు అలవాట్లను అలవర్చుకుని డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత ఆత్మకూరు మండలంలోని హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో హీరో గ్లామర్, పాలకుర్తి మండలం పెద్దతండలో టీవీఎస్ ఎక్సెల్, శివునిపల్లిలో యాక్టివా 6జి, బజాజ్ పల్సర్ 150సీసీ, 2025లో లింగాలఘణపురం మండలం చీటూరులో ప్యాషన్ ప్లస్, స్టేషన్‌ఘన్‌పూర్‌లో బజాజ్ పల్సర్ 125 సీసీ, తానేదార్‌పల్లిలో బజాజ్ ఆటోలను దొంగిలించాడు.

కాగా, బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్న వెంటనే పోలీసులు స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్‌లో పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహిచండంతో బజాజ్ ఆటోలో వస్తున్న హరీష్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంతో గతంలో చేసిన నేరాలు, దొంగతనాలను వెల్లడించి రూ.5.09లక్షల విలువైన సదరు వాహనాలను పోలీసులకు చూపించాడు. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు దొగిలించిన వాహనాలను సీజ్ చేసిన అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

## జాతరలో తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఏసీపీ తిరుమల్

భీమదేవరపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తకొండ జాతరలో సోమవా రం తప్పిపోయిన బాలుడిని పోలీసులు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటా పూర్‌కు చెందిన కొక్కుల విష్ణు కుటుంబ సభ్యులతో వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. జాతరలో విష్ణు కుమారుడు హర్షిత్ తప్పిపోయాడు. విష్ణు వెంటనే జాతరలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దకు వెళ్లి సమాచారం తెలిపారు. ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ ఆధ్వర్యంలో వెతికి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

• ప్లాన్ ప్రకారమే మర్డర్ • ఏసీపీ నితిన్ చేతన్ వెల్లడి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నితిన్ చేతన్

జనగామ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జనగామలో కలకలం సృష్టించిన యువకుడి హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కేసుకు సంబంధించిన వివరాలను జనగామ ఏసీపీ చేతన్ నితిన్ సోమవారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోతు వెంకన్న(35) 15ఏళ్లుగా జనగామ రైల్వే స్టేషన్‌లో కోతులను ఆడిస్తూ, భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జనగామలోని ధర్మకంచకు చెందిన గాండ్ల సంపత్, వెంకన్నకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో వెంకన్నను ఎలాగైనా అంతమొందించాలని సంపత్ పన్నాగం పన్నాడు. శనివారం రాత్రి తన స్నేహితులు మహ్మద్ హైదర్, మార్క లక్ష్మణ్‌తో కలిసి వ్యూహాత్మకంగా జిల్లా కేంద్రంలోని వినాయక బార్‌లో వెంకన్నకు మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న వెంకన్నను బార్ వెనుక వైపు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో ఛాతిపై మోది, కర్రతో మెడ, తలపై కొట్టి, బీరు సీసాలతో పొడిచి చంపివేశారు. మృతదేహాన్ని గుర్తు పట్టకుండా వారి వెంట తెచ్చుకున్న బైక్ నుంచి పెట్రోల్ తీసి మృతదేహాన్ని పాక్షికంగా కాల్చివేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన నర్మెట సీఐ ఎం. అబ్బయ్య, జనగామ ఎస్ఐ చెన్నకేశవులు, కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

# మల్లన్నా.. మమ్మేలుకోవన్నా..

## శివమెత్తిన శివసత్తులు, ఢమరుక నాదాలు



- పరవశించిన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన ఐనవోలు పరిసరాలు
- నేడు ప్రభ బండ్ల ప్రదర్శన



ఐనవోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శివమెత్తిన శివసత్తుల ఢమరుక నాదాలతో ఐలోని మల్లన్న దండాలు.. నన్నేలు నా తండ్రి దండాలు.. గండాలు తీరితే గండ దీపం పెడతాం.. కోరికలు నెరవేరితే కోడెలను కడుతాం.. పంటలు పండితే పట్నాలు వేస్తాం.. పిల్లజెల్ల సల్లంగా ఉంటే శేవాలు తీస్తామంటూ మల్లికార్జునస్వామి జాతరలో శివసత్తులు భక్తి పారవశ్యం పూనకాలతో చేసిన నృత్యం భక్తిని చాటాయి. మొక్కులు తీర్చేందుకు భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. ఒగ్గు పూజారుల డమరుకాల హోరు.. టెంకాయ బంధనాలు.. భోగి పర్వదినమైన సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ధర్మ, శీఘ్ర, విశిష్ట దర్శనం క్యూలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు గంటల సమయం పట్టింది. భక్తులు ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో విడిది చేశారు. అందంగా బోనాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేసి మల్లన్నను స్తుతించారు. బోనాలపై దీపాలు వెలిగించి శివతాండవం చేస్తూ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. మంగళవారం జరిగే మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు.

**అష్టోత్తర పుష్పాలతో శివలింగానికి అలంకరణ**

మల్లన్నకు ఒగ్గు పూజారులు మేలుకొలుపు చేశారు. శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వరపూజ శైవశుద్ధి పుణ్యాహవాచనం నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంలో అర్చకులు 11 సార్లు నమ్మకం ఒకసారి చెమ్మకం చెప్పారు. పాలు, పెరుగు, నెయి, తేనె, పంచదార, పండ్ల రసం, కొబ్బరి నీరు బస్మోదం (విభూది) సువర్ణోదకం, గంధోదకం, బిల్వోదకం, కుశోదకం, రుద్రకదోకంతో మంత్ర పఠనం చేసి స్వామి వారికి అభిషేకం చేశారు. అష్టోత్తర పుష్పాలతో(108) శివలింగాన్ని అలంకరించి మహానివేదన నీరాజన మంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాద వితరణ చేశారు.



ఐనవోలు జాతరలో వరం పడుతున్న భక్తులు



బోనంతో శివసత్తుల విన్యాసాలు

**నేడు మకర సంక్రాంతి ప్రభల బండ్ల ప్రదర్శన**

మంగళవారం మకర సంక్రాంతిన మల్లన్న సన్నిధిలో ఉత్తరాన పుణ్యాకాలం, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవాచనం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా నివేదన పూజలు నిర్వహిస్తారు. నీరాజనమంత్ర పుష్పం తీర్థప్రసాద వితరణ, రాత్రి ప్రభల బండ్ల ప్రదర్శన, నైవేద్యంతో మార్నేని వంశీయుల దేవుడి రథం తిరుగనుంది.

### దర్శించుకున్న ప్రముఖులు

వర్ధన్నపేట, భూపాలపల్లి, మేడ్చల్ ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.



స్వామి వారిని దర్శించుకున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



స్వామి సన్నిధిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, మేయర్ సుధారాణి, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యులు



భక్తజన సందోహం



కొత్తకొండ వీరభద్రస్వామి

# మార్మోగిన వీరభద్రస్వామి నామస్మరణ

## కొత్తకొండ జాతరలో భక్తుల కిటకిట

- గుమ్మడి కాయలు, కోర మీసాలు చెల్లించుకున్న భక్తులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- దర్శనానికి 3 గంటల సమయం



పల్లెరం వేస్తున్న వీరముష్టిలు

భీమదేవరపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వీరభద్రా... శరభా... శరభా.. అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. భక్తుల స్వామి నామస్మరణతో కొత్తకొండ పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీఘ్ర, ప్రత్యేక దర్శనం, రూ. 200, రూ. 100, రూ. 50 తో పాటు సర్వ దర్శనం ఇలా అన్ని క్యూలు కిక్కిరిసిపోయాయి. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వీరభద్రస్వామిని దర్శించుకుంటూనే ఉన్నారు. గుమ్మడికాయలు, కోరమీసాలు స్వామి వారికి చెల్లించేందుకు భక్తులు పోటీ పడ్డారు. రూ. 200 లైన్లు మూడు గంటల పాటు దర్శనానికి సమయం పట్టింది. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగింది. పవిత్ర కోనేరులో స్నానాలాచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి బారులు తీరారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండా దీపంలో నూనె పోశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీత, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, దివ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. భోగి కావడంతో భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. 600 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. డీసీపీ సలీమా కోడె కట్టి గుమ్మడి కాయ మొక్కులు చెల్లించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జాతరలో పలు సేవలందించారు. గతంలో వేలాదిగా ఇచ్చే వీఐపీ పాస్‌లు రద్దు చేయడంతో కొంత మంది భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**కుమ్మరుల బోనాలతో ఎడ్లబండ్లు ప్రారంభం**

ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో కుమ్మరులు బోనాలను వండి ఎడ్ల బండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాత రోజు నుంచి ఎడ్లబండ్ల కార్యక్రమం జరగడం ఆనవాయితీ. దీంట్లో భాగంగా కుమ్మరులు సోమవారం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటంకుండతో నృత్యం చేశారు. వీటి వెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. మొదటగా గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగడ్డ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

### భోగి సందర్భంగా ప్రత్యేక పూజలు

భోగి సందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్యయంత్ర ప్రతిష్ఠాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం నిత్య బలిహరణ, అమ్మవారికి చక్రార్చన, నవావరణ పూజ చండీ హోమం నిర్వహించారు. నందీశ్వర పూజలు చేశారు. దక్షిణాయనం నుంచి సూర్య భగవానుడు ఉత్తారాయనంలోకి ప్రవేశించే సమయంలో ఎవరైతే వీరభద్రుడిని ఆరాధిస్తారో వారికి శత్రు, శరీర పీడ దరి చేరవని పురాణాలు చెబుతున్నాయి.

### నేడు సంక్రాంతి బండ్ల తిరుగుట

వీరభద్రుడి ఆలయంలో మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎడ్లబండ్లు తిరుగుతాయి. కొత్తపల్లి గ్రామస్థుల రథోత్సవం జరుగుతుంది. ఎడ్ల బండ్లను అందంగా తీర్చిదిద్ది రథాలుగా కొత్తపల్లి నుంచి ఊరేగింపుగా జాతరకు వస్తారు. కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు జాతరకు ఆకర్షణగా నిలుస్తాయి.



క్యూలైన్‌లో భక్తులు



వీర బోనం ఎత్తుకున్న కుమ్మరులు



గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న డీసీపీ సలీమా

## ఆద్యంతం.. ఆనందభరితం



సంక్రాంతి సంబరాలు ఊరూరా మొదలయ్యాయి. నగరాలు, పట్టణాలతోపాటు పల్లెల్లో ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సంక్రాంతి శోభ సంతరించుకుంది. సోమవారం భోగి ఉండగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో తెల్లవారుజామున భోగీ మంటలు వేసుకొని భక్తులు ఆనందోత్సవాల నడుమ ఈ పర్వదినాన్ని జరుపుకున్నారు.

- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి)



వేయిస్తంభాల ఆలయంలో క్యూ లైన్లలో భక్తులు

# రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

### భక్తులతో కిటకిటలాడిన ఆలయం

హనుమకొండ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివ ప్రీతికర సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పౌర్ణమి తిథి ఆరుద్ర నక్షత్రం కలిసి వచ్చిన శుభ తరుణంతో పాటు భోగి వేళ పరమ శివుడికి అభిషేకం చేసుకుంటే ఎంతో శుభ ఫలితాలు కలుగుతాయన్న విశ్వాసంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జాతరలకు తరలి వచ్చే భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఉదయం నుంచి ఆలయానికి తరలి వచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. రుద్రేశ్వరుడికి 51 లీటర్ల ఆవుపాలు, 25 కిలోల పెరుగు, 10 కిలోల తేనె, 11 కిలోల చక్కర, 5 కిలోల ఆవు నెయ్యితో రుద్రసూక్త మూల మంత్ర పఠనంతో ప్రత్యేక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలువురు పోలీసు అధికారులు, న్యాయవాదులు, వ్యాపార వేత్తలు కూడా సోమవారం రుద్రేశ్వరుడిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ సిబ్బంది ఎన్. మధూకర్, ఎల్. రామకృష్ణ, బి. రజిత తదితరులు భక్తులకు సేవలందించారు.

# ఘనంగా గోదావరి హారతి





గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతినెల పౌర్ణమి రోజు నాడు దీనిని నిర్వహిస్తున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అర్చకుడు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దేవస్థానం నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో గోదావరికి చేరుకొని హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఓం నమఃశివాయ హరహర మహాదేవ..

- కన్నుల పండువగా ఆరుద్ర ద్వార దర్శనం
- శివాలయాల్లో వేకువ జామున బారులు దీరిన భక్తులు
- కిటకిటలాడిన భద్రకాళి అమ్మవారి ఆలయం

వరంగల్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం మహాదేవుడైన పరమేశ్వరుడిని ద్వార దర్శనం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. ఏటా మార్గశిర మాసంలో ఆరుద్ర నక్షత్రం రోజు బ్రహ్మ ముహూర్తంలో పరమేశ్వరుడిని దర్శించుకునే విధంగా ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలోని శ్రీరామలింగేశ్వర, ఆకారపు వారి గుడి శివాలయం, గీతాభవన్ శివాలయం, దుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయంతో పాటు శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానంలోని తేజోలింగమైన చారిత్రక శ్రీభద్రేశ్వర స్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఓలలాడారు. ఓం నమః శివాయ.. హర హర మహాదేవ.. జైజై భద్రకాళి మాత.. శ్రీభద్రకాళి శరణం మమ.. అంటూ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన గేటు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భద్రకాళి ఆలయంలో భక్తుల సందడి

# పల్లెల్లో సంక్రాంతి శోభ

### భోగితో ఆరంభమైన సంబురాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు టగ్ ఆఫ్‌వార్, గోలీలు, చిర్రగోనే, టైర్, బొంగరాల ఆటలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ బాధ్యులు వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, విష్ణువర్దన్, మైన నాగయ్య, శ్రీనివాసులు, పెద్ది వెంకన్న, ఉపేందర్, రవీందర్, దామోదర్, వెంకట్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, దాసరి ప్రసాద్, కళ్లెం వెంకట్‌రెడ్డి, కాపర బోయిన శ్రీనివాస్, బొడ్డుపల్లి ఉపేంద్రం, సుంకరి పరందామయ్య, పమ్మి రాజు, సాదు మైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మార్కండేయులు, శ్రీనివాస్, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

●పట్టణంలోని 23వ వార్డు మిల్క్ కాలనీలో స్థానిక వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవిరఘు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత ప్రారంభించగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు సతీమణి సంధ్యారాణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ముత్యం వెంకన్న, మహబూబ్‌పాషా, తేళ్ల శ్రీనివాస్, కర్పూరపు గోపి పాల్గొన్నారు.

● పట్టణంలోని 27వ వార్డులో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన కె. స్వప్న, కోడి స్వప్న, స్రవంతిలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారది, వెలుగు శ్రావన్, బొడ్డుపల్లి ఉపేంద్రం, చంద్రయ్య, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మీ, జ్ఞానేశ్వర్, అశోక్, ప్రవీణ్, నర్సమ్మ, వేణు, శ్రీనాథ్, హర్షవర్దన్, శ్యాంప్రసాద్, , రమేష్, శంకర్, శ్రీనివాస్, జడ్జీలు నూకల గీతారెడ్డి, రాజకుమారి పాల్గొన్నారు.

**వివిధ మండలాల్లో...**

●సీరోలు మండలం ఉప్పరగూడెం హట్యతండాలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ-జీవిత దంపతులు మహాయాగం నిర్వహించారు.

● దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు దాట్ల, పెద్దముప్పారంలో భోగి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని రవీందర్, మల్లారెడ్డి, బాలాజీ, వెంకన్న పాల్గొన్నారు.

● మరిపెడ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. గిరిపురంలోని మురారిశెట్టి మానస్‌నాగకు భోగిపండ్లు పోశారు. ఈ కార్యక్రమంలో మురారిశెట్టి వివేక్, శ్రావణి, గుండా లక్ష్మమ్మ, లక్ష్మీ, ఉప్పలయ్య, రమాదేవి పాల్గొన్నారు.

● పెద్దవంగర మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలు భోగి వేడుకలు నిర్వహించుకున్నారు.

● తొర్రూరులో తెల్లవారుజామునుంచే యువకులు భోగి మంటలు వేసారు. ఘనంగా భోగి వేడుకలు జరుపుకున్నారు.

● డోర్నకల్ మునిసిపల్, మండలం ఉయ్యాలవాడలో భోగి మంటలు వేసి యువకులు, ప్రజలు భోగి వేడుకల్లో పాల్గొని పాటలు పాడుతూ. కోలాహలంగా నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ తాళ్లూరి రామయ్య, కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌లు తదితరులు పాల్గొన్నా రు.

● కొత్తగూడ మండలంలో భోగి వేడుకల్లో ప్రజలు పాల్గొన్ని ఉత్సహంగా గడిపారు. మహిళలు ఇండ్ల ముందు ముగ్గులు వేశారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


కురవి దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


పెద్దవంగరలో భోగి వేడుకల్లో పాల్గొన్న యువకులు


మరిపెడలో భోగి పండ్లు


మానుకోటలో బొమ్మల కొలువు


ఉషోదయ వాకర్స్ ఆధ్వర్యంలో వేసిన భోగిమంటలు



ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


27వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు నగదును అందజేస్తున్న అజయ్‌సారధిరెడ్డి

## కొత్తగూడలో ముగ్గుల పోటీలు


కొత్తగూడలో మైదం ప్రభకు మొదటి బహుమతి అందజేస్తున్న కుంజ కుసుమాంజలి

కొత్తగూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం (జేఎల్ఎన్‌వైసీ) ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడలో నిర్వహించిన ముగ్గుల పోటీలో మైదం ప్రభ మొదటి బహుమతి గెలుచుకున్నారు. రెండవ బహుమతి మెరుగు శిల్ప, మూడవ బహుమతి సామాల ప్రతిభ, నాలుగో బహుమతి మల్లెల శ్వేత, ప్రోత్సహక బహుమతి దూడల రమ గెలుచుకున్నారు. విజేతలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కుంజ కుసుమాంజలి, జేఎల్ఎన్‌వైసీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కల్తీ శ్రీను, గ్రామస్తులు గుమ్మడి సమ్మయ్య, వెలుదండి వేణు, కంగాల నాగేశ్వరరావు, మల్లెల వీరాస్వామి, యాదగిరి మురళి, ఏంపల్లి రమేష్, మిడతపల్లి యాకయ్య, సిరిగిరి సురేష్, యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి


వేంపల్లిలో క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎస్సైలు

కొత్తగూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :యువత క్రీడల్లో రాణించాలని కొత్తగూడ, గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ సూచించారు. తాటివారి వేంపల్లి గ్రామంలో యువకులకు క్రీడా సామాగ్రి అందించారు. యువకులతో క్రీడలు ఆడారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల భారీన పడవద్దని సూచించారు

# ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :ముదిరాజ్‌లు విద్య, రాజకీయ రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మానుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం పెద్దమ్మతల్లి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ... ముదిరాజ్‌లు విద్యారంగంలో వెనుకబడి ఉన్నారని, ప్రతి కుటుంబం నుంచి విద్యావంతులుగా రాణించాలని పేర్కొన్నారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకుంటూ రాజకీయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ రాజు, నాగరాజు, ఉప్పలయ్య, ఐలయ్య, నర్స య్య, నారాయణ, శ్రీనివాస్, వీరన్న, బిక్షం, వెంక న్న, సోమయ్య, శ్రీరాములు, యాదగిరి, నవీన్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మందకుమార్‌మాదిగ

నెహ్రూసెంటర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం దళితవాడల్లో తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్‌మాదిగ మాట్లాడుతూ... ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల పీరయ్య, తప్పెట్ల వెంకన్న, తప్పెట్ల గిరిబాబు, బందెల కిరణ్, విక్రమ్, బిక్షపతి, అంజిబాబు, నాగేష్, మరికంటి వెంకన్న, బందెల రాములు, తప్పెట్ల రాజు, పవన్, నందల మధు, బందల వేణు, సిరిపురం బన్నీ, తప్పెట్ల శరత్, తప్పెట్ల విజయ్, పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ 2025 ఆవిష్కరణ

డోర్నకల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఎస్సై గడ్డం ఉమ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. ఫోటోగ్రాఫర్స్ వృత్తి నిబద్దతతో కూడినదని చెప్పారు. ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రజాలీ, ఉపేందర్, మోతీలాల్, యాకయ్య, కొలిపాక పుల్లారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దవంగర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతీ నెల 1న గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రకటించడంతో మండలంలోని పోచంపల్లిలో జీపీ కార్మికులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు ఓరుగంటి సోమ నర్సయ్య మాట్లాడుతూ జీపీ కార్మికుల ఇబ్బందులను గుర్తించి వేతనాలు ప్రతీ నెల 1వ తేదిన అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు ఎల్లప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం పెంపుదల

కురవి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో గ్రామాల్లోని యువత మధ్య స్నేహాభావం పెరుగుతుందని కురవి ఏఎస్సై వెంకన్న అన్నారు. కురవి మండలం నేరడ గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామీణా క్రీడలు, ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, కడియం సత్యం, జక్కుల మల్లయ్య, గండి వెంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ పట్ల మధు, సూర్యప్రసాద్, డీవైఎఫ్ఐ నాయకులు వెంకటేశ్వర్లు, నరేష్, సూర్యకిరణ్, భగత్, రంజిత్, తిలక్, షాదీక్, వేణు, అజయ్, కడియం వినోద, నీరుడు లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కురవి ఏఎస్సై వెంకన్న

## జర్పులతండాలో ఎద్దుల అపహరణ

కురవి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జర్పులతండాలో రెండు ఎద్దులను దొంగలు అపహరించుకువెళ్లినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. 12వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో బి.టీక్యా ఇంట్లో కొట్టంలో కట్టేసి ఉన్నా.. ఎద్దులను దొంగలు తీసుకువెళ్లారని పేర్కొన్నారు. రైతు టీక్యా ఉదయం 5 గంటల సమయంలో ఎద్దులు అపహరణకు గురైన విషయాన్ని తెలుసుకుని పరిసర ప్రాంతాల్లో వెతికినట్లు చెప్పారు. ఎద్దుల జాగ కన్పించకపోవడంతో టీక్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

## బీజేపీ మునిసిపల్ అధ్యక్షుడిగా పైండ్ల రాజేష్

తొర్రూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ తొర్రూరు మునిసిపల్ అధ్యక్షుడిగా పైండ్ల రాజేష్‌ను నియమించినట్లు బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్ రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మునిసిపాలిటీ అర్బన్ అధ్యక్షుడిగా పైండ్ల రాజేష్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన రాజేష్ 2006 నుంచి ఏబీవీపీ కార్యకర్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసి 2018లో పార్టీలో చురుకైన కార్యకర్తగా వివిధ బాధ్యతలు నిర్వహించగా గుర్తించి నియమించామన్నారు. రాజేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అనారోగ్యంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి


శ్రీరాములు

కొత్తగూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :అనారోగ్యంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలోని గోపాలపురంలో సోమవారం జరిగింది. గోపాలపురం గ్రామానికి చెందిన తుర్స శ్రీరాములు (52) హన్మకొండ జిల్లాలోని ఖిలా వరంగల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అనారోగ్య ంతో బాధపడుతున్న శ్రీరాములు సోమవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సోమక్క, కుమారుడు సాయి ప్రకాష్, కూతురు శిరీష ఉన్నారు.

## మరిపెడ పట్టణ బీజేపీ అధ్యక్షురాలిగా మంగమ్మ


మంగమ్మ

మరిపెడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ పట్టణ బీజేపీ అధ్యక్షురాలిగా భూక్యా మంగమ్మ ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగిం చిన రాష్ట్ర పార్టీ బాధ్యులు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, మహబూబాబాద్ జిల్లా పార్టీ బాధ్యులు, రాష్ట్ర నాయకుడు గుగులోత్ లక్ష్మణ్‌నాయక్‌కు మంగమ్మ సోమవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా సుధాకర్ యాదవ్


సుధాకర్

పెద్దవంగర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దవంగర బీజేపీ మండల అధ్యక్షులుగా అవుతాపురం గ్రామానికి చెందిన బొమ్మరబోయిన సుధాకర్‌యాదవ్ ఎన్నికైనట్లు జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి పటిష్ఠం చేస్తూ బీజేపీ బలోపేతానికి సమన్వయంతో పని చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపా రు. గ్రామాల్లో యువత మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## ఎన్డీ పెద్దచంద్రన్న పార్టీలో చేరికలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న పార్టీలోకి మరోవర్గం ఎన్డీ సీనియర్ నాయకులు గోపన్న, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సీనియర్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు చేరినట్లు ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో గోపన్నకు పార్టీ జెండాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రజా ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో పది లక్షల ఎకరాలకు పైగా పోడు భూములను ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర ఎన్డీదేనన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి ప్రతాప్‌రెడ్డి, ఎన్డీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.మదార్, ఉపేందర్, ఆలకుంట్ల సాయిలు, బిక్షపతి, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత


లక్ష్మీపురంలో ట్రైసైకిల్‌ను అందజేస్తున్న కిరణ్

ఇనుగుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం లక్ష్మీపురానికి చెందిన వేర్పుల ఉప్పలయ్యకు అదే గ్రామానికి చెందిన చిర్రగోని సారయ్య తన సొంత ఖర్చులతో రూ.8వేలు విలువైన మూడు చక్రాల సైకిల్‌ను కొనుగోలు చేసి సోమవారం అందజేశారు. ఇటీవల ఉప్పల య్యకు అనారోగ్య కారణాలతో వైద్యులు ఒక కాలు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సారయ్య సైకిల్ కొనివ్వడంపట్ల గ్రామస్తులు అభినందించారు.

## యేనె రామస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి

పెద్దవంగర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంట్లకుంట గ్రామంలోని యేనె రామస్వామి జాతరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బానోతు శ్రీనునాయక్ తెలిపారు. సోమవారం జాతర పరిసర ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా అన్ని ఏర్పాట్లును జీపీ సిబ్బంది, గ్రామస్థులు ఏర్పాట్లును ముందస్తుగా పూర్తి చేశారు.

## ఇదేం బాదుడు..!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుండడంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణం ఉంటుంది. డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో రద్దీ సమయంలో ఎక్కుతుండడంతో అధికా రులు ఇదే అదనుగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. అదనపు వసూళ్లపై కార్పొరేషన్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకున్నా స్థానిక అధికారులు ఉన్నతాధికారుల మెప్పు పొందేందుకు చార్జీలు పెంచి వసూళ్లు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనిపై డిపో అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 11, 12 తేదీల్లో స్పెషల్ బస్సుల్లో టికెట్‌ల రేట్‌లు పెంచినట్లు తెలిపారు.



# వైభవంగా గోదారంగనాథుల కల్యాణోత్సవం..


చిట్యాలలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు


తొర్రూరులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కేసముద్రం : అమినాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో..

పెద్దవంగర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాలలో ఉన్న సీతారామాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రఘునాథచార్యులు శ్రీగోదారంగనాథులస్వామి కల్యాణోత్సవంలో కట్కూరి నరేష్ స్వాతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం తిరుపతి శ్రీవారి సన్నిధిలో కల్యాణోత్సవం జరిపిన మాదిరిగా శేషవాహనంపై శ్రీరంగనాథస్వామి వారిని కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రఘునాథచార్యులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది సంప్రదాయంగా కల్యాణం నిర్వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రావుల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి అశోక్, రమేష్, సోమలింగం, బిక్షపతి, సోమయ్య, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు : గోదాదేవి రంగనాయకుల కల్యాణ వేడుకలు సోమవారం తొర్రూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆస్థాన అర్చకులు శ్యామ్ సుందరాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొర్రూరు పట్టణ ఇలవేల్పు వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉదయం 11 గంటలకు వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఓలేటి లక్ష్మణాచార్యులు, శేషాచార్యులు, రాము, రాజేష్, కృష్ణమాచార్యులు, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రం : మండలంలోని అమినాపురం శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గోదారంగనాధస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి అలంకరణ, మాల మార్పిడీ పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాదం భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు వోలం రాజేశ్వర్‌రావు, వద్దిరాజు దేవేందర్, వోలం మురళీ, బచ్చు పరమేశ్వర్, కొయగూరి యాకూబ్‌రెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మరిపెడ : మరిపెడ మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయం, మరిపెడ బంగ్లాలోని రాములోరి గుడిలో ధనుర్మాసోత్సవంలో భాగంగా గోదాదేవి -రంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆయా ఆలయాల వేదపండితులు సోమవారం నిర్వహించారు. వేద పండితులు లక్ష్మీనర్సింహ చార్యులు, లక్ష్మణాచార్యులు, సుదర్శనచార్యులు, రంగాచార్యులు, ఫణికమ ల్, సుదర్శన్ భట్టార్‌లు వేదమంత్రోచ్చారణలతో దేవతామూర్తులకు కల్యాణ ం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు. మాకుల ఆలయ అనువంశిక చైర్మన్ నల్లాన్ చక్రవర్తుల రామాను జ చార్యులు, ఈవో వేణుగోపాల్, రాములోరి ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.
















Printed and published by Koganti Venkata Seshagiri Rao , on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at "Aamoda Press" at Plot No. 112, IDA, Khanapuramhaveli, Khammam, Tel. No. 08742-247915, Editor: N.Rahul Kumar.
RNI No: APTEL/2004/11932 Managing Director : Vemuri Radha Krishna,Founder : K.L.N. Prasad.